తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

RNI NO.TELTEL / 2013 /50370

Estd : 2002

జనంసాక్షి

www.janamsakshi.org

ఆదివారం 02.11.2025 | సంపుటి :12 సంచిక : 102 | పేజీలు :12 వెల : రూ. 4/-

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

కారు షెడ్డుకు పోయింది

బిల్లారంగాలు ఆటోలో తిరుగుతూ మభ్యపెడుతున్నారు

పీజేఆర్ చనిపోతే ఏకగ్రీవానికి భారాస,బీజేపీలు సహకరించలేదు

- అజారుద్దీన్‌ను మంత్రి చేసి మాట నిలబెట్టుకున్నా..
- పదేళ్లు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్నా జూబ్లీహిల్స్‌లో సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదు?
- తాడు బొంగరం లేని బీజేపీ ఇక్కడ అభివృద్ధి చేస్తామని అనడం విడ్డూరం
- బోరబండ కార్నర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): జూబ్లీహిల్స్ ఉపఎన్నిక ప్రచారంలో రెండోరోజు సీఎం రేవంత్ రెడ్డి పాల్గొని ప్రచారం చేపట్టారు. ఈసందర్భంగా అభివృద్ధి తదితర అంశాలతో పాటు బిఆర్ఎస్‌పై విమర్శలు గుప్పించారు. బోర బండలో నిర్వహించిన కార్నర్ మీటింగ్ లో మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీపై ఘాటైన వ్యాఖ్యలు చేశారు. అజారుద్దీన్ ను మంత్రి చేసి మాట నిలబెట్టుకున్నానని అన్నారు. కారు షెడ్డుకు పోయింది, బిల్లా రంగాలు ఆటోల్లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. పీజేఆర్ చనిపోతే ఏకగ్రీవానికి బీజేపీ, బీఆర్ఎస్ ఎందుకు సహకరించలేదని ప్రశ్నించారు. ఈ దుష్ట సంస్కృతికి తెర లేపిందే బీఆర్ఎస్ కాదా అని ధ్వజమెత్తారు. ఎమ్మెల్యే చనిపోతే ఎన్నికలు

మిగతా 2లో..

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

కెనడా, ఫ్రాన్స్ ప్రతినిధులకు ముఖ్యమంత్రి రేవంత్ వినతి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావాలని కెనడా ప్రతినిధులని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కోరారు. శనివారం రాష్ట్ర

మిగతా 2లో..

కాశీబుగ్గలో ఘోర విషాదం

వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిసలాట

9 మంది మృతి.. 25 మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

- ఏకాదశితో భారీగా తరలివచ్చిన భక్తులు
- క్షతగాత్రలను ఆస్పత్రికి తరలించి చికిత్స
- ఘటనపై సీఎం చంద్రబాబు తీవ్రదిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాకు లోకేశ్ పరామర్శ
- ఒక్కో కుటుంబానికి రూ.15లక్షలు..
- క్షతగాత్రులకు రూ.3 లక్షల పరిహారం అందిస్తామని హామీ

ఆలయంలో చిందర వందరగా పడిపోయిన భక్తుల వస్తువులు.. రేయిలింగ్ ఊడిపడి తొక్కిసలాట ఘటన జరిగిందిక్కడే. (వృత్తంలో..)

శ్రీకాకుళం(జనంసాక్షి): శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గలో ఘోరం జరిగింది. కాశీబుగ్గలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాటలో 10 మంది భక్తులు మృతి చెందారు. కార్తీక మాసం ఏకాదశి శనివారం కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనానికి తరలి వచ్చారు. ఈ సమయంలో అకస్మాత్తుగా జనసందోహం పెరగడంతో తొక్కిసలాట చోటు చేసుకుంది. ఈ తొక్కిసలాటలో పలువురు భక్తులు తీవ్రంగా గాయపడ్డారు. వారిని సమీపంలోని ఆసుపత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ఆలయ పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత కొనసాగుతుంది. పోలీసులు సంఘటన జరిగిన ఆలయానికి చేరుకుని పరిస్థితిని నియంత్రించారు. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ ఘటనపై జిల్లా అధికారులు సమగ్ర విచారణకు ఆదేశాలు జారీ చేశారు. ఆలయ భద్రతా ఏర్పాట్లలో నిర్లక్ష్యం ఉందా అనే దానిపై కూడా దర్యాప్తు కొనసాగుతుంది. ఈ తొక్కిసలాట ఘటనపై దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆరా తీశారు. అయితే, తిరుమలలో దర్శనం కాలేదని సొంతంగా పండా కుటుంబం పదేళ్ల క్రితం 12 ఎకరాల భూమిలో ఈ కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయాన్ని

మిగతా 2లో..

తొక్కిసలాట ఘటన బాధాకరం

- కాశీబుగ్గ ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50వేల పరిహారం ప్రకటన

2 లో..

పిడికిలెత్తిన ఆత్మగౌరవ పతాక

నమ్మకం, ధర్మం పేరుతో.. దళితుల మీద దాడిచేస్తే కేసులుండవా..?

- ఈ దేశ వ్యవస్థలకు కూడా దళితులు అంటరానివారయ్యారు!
- సీజేఐపై దాడి జరిగితే ఢిల్లీ పోలీసులు కేసు ఎందుకు పెట్టలేదు?
- న్యాయవ్యవస్థ సుమోటోగా కేసు ఎందుకు స్వీకరించలేదు?
- మానవ హక్కుల కమిషన్ మౌనంగా ఎందుకు ఉన్నది?
- ఈ కులవివక్షతను ఎదుర్కోవడానికే దళిత ఆత్మగౌరవ పోరాటం
- ఇది ఆరంభం మాత్రమే.. నవంబర్ 17న చలో ఢిల్లీ
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ మందకృష్ణ మాదిగ

భారతదేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టు చీఫ్ జస్టీస్ బీఆర్ గవాయ్ మీద దాడి జరిగితే ఈ దేశ వ్యవస్థలన్నీ ఎలాంటి చర్యలకూ ఉపక్రమించకుండా మౌనం వహించి అంటరా నితనాన్ని ప్రదర్శించాయని ఎమ్మార్పీఎస్ వ్యవ స్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అన్నారు. రాజ్యాంగాన్ని గౌరవించే వాళ్ళు దేశభ క్తులు, రాజ్యాంగాన్ని వ్యతిరేకించే వాళ్ళు దేశ ద్రోహులు అని అన్నారు. ధర్మాలు మమ్మల్ని పశువుల కన్నా హీనంగా చూస్తే రాజ్యాంగం మమ్మల్ని మనుషులుగా గుర్తించిందన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం, దళితుల మీద దాడులు ఎదుర్కోవడం కోసం ఇక సిద్ధమవుతామని చెప్పారు. అందులో భాగంగా నవంబర్ 17న ఛలో ఢిల్లీకి దళితులు పెద్దఎత్తున తరలిరావా లని పిలుపునిచ్చారు.

హైదరాబాద్ బ్యూరో (జనంసాక్షి) : జస్టీస్ బీఆర్ గవాయి మీద దాడిని నిరసిస్తూ హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద నుండి బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వరకు ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో వేలాది మందితో దళితుల ఆత్మగౌరవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో ముఖ్య అతిథిగా పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ..

మిగతా 2లో..

ఓటమి భయంతోనే కాంగ్రెస్ బెదిరింపు రాజకీయాలు

- జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ ఓటమి ఖాయం
- ముఖ్యమంత్రి నకిలీ వాగ్దానాలు దీనితోనే అంతమవుతాయి
- కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతే, 500 రోజుల్లో కేసీఆర్ తిరిగి సీఎం అవుతారు: కేటీఆర్

హైదరాబాద్(జనంసాక్షి):రేవంత్ రెడ్డి బెదిరింపులకు ఎవరూ భయపడరని తేల్చిచెప్పారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని రహమత్‌నగర్ డివిజన్లో నిర్వహించిన భారీ రోడ్‌షోలో సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. రాజకీయ బెదిరింపులకు తెలంగాణ ప్రజలు తలవంచరని ఆయన స్పష్టం చేశారు. సంక్షేమ పథకాలు రద్దు చేయాలని చూస్తే, ఇదే జూబ్లీహిల్స్ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని పడగొడతారని హెచ్చరించారు. రేవంత్‌లాగా ఎగిరిప డుతున్న ఎంతో మంది నియంతలు పతనమయ్యారని.. దీనికి రేవంత్ రెడ్డి కూడా మినహాయింపు కాదని తేల్చిచెప్పారు.

మిగతా 2లో..

బీఆర్ఎస్,బీజేపీలది లోపాయికారి ఒప్పందం

- నిరుద్యోగులకు ఆశ చూపి పదేళ్ళు భోగం అనుభవించారు
- ఐదేళ్లు మహిళా మంత్రి లేకుండా నడిపిన చరిత్ర భారాసది
- కేటీఆర్ వ్యాఖ్యలకు పీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ కౌంటర్

హైదరాబాద్(జనంసాక్షి): అహనా పెళ్ళంట మాట బీఆర్ఎస్ పార్టీకి సరిగ్గా సరిపోతుందని కౌంటర్ టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ఇచ్చారు.సినిమాలో మాదిరి కోడిని వేలాడదీసి ఆశ చూపినట్లు నిరుద్యోగులకు ఉద్యోగాల ఆశ చూపి.. కేబినెట్‌లో ఐదేళ్లు మహిళా మంత్రి లేకుండా ప్రభుత్వం నడిపిన నీచ చరిత్ర బీఆర్ఎస్ పార్టీది అని దుయ్యబట్టారు. ఈమేరకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వ్యాఖ్యలపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తీవ్రంగా స్పందించారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటేస్తే బీజేపీకి వేసినట్లేనని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్‌తో లోపాయికారి ఒప్పందంలో భాగంగానే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో బీజేపీ ప్రాధాన్యత లేని అభ్యర్థిని నిలబెట్టిందని ఆరోపించారు. బీజేపీ, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒక్కటేనని ఘాటు వ్యాఖ్యలు చేశారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ 8 సీట్లు గెలవడానికి బీఆర్ఎస్ సహకరించిందని ఆరోపించించారు. ఈ మేరకు మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ రుణం

మిగతా 2లో..

రేపటి నుంచి ప్రైవేటు కాలేజీలు నిరవధిక బంద్

పిలుపునిచ్చిన ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య పిలుపు

హైదరాబాద్(జనంసాక్షి): ప్రభుత్వం రేపటిలోగా నిర్ణయం తీసుకోకపోతే.. ఈ నెల 3 నుంచి ప్రైవేటు కాలేజీల నిరవధిక బంద్ పాటిస్తామని ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్ బాబు తెలిపారు. ఫతేమైదాన్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.“ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై గత 6 నెలలుగా ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రస్తుతం రూ.1200 కోట్ల ఇవ్వాలని అడిగాం. మిగిలిన బకాయిల చెల్లింపులపై రోడ్ మ్యాప్ రూపొందించాలని కోరాం. కేవలం రూ.300 కోట్లు ఇచ్చారు.. ఇంకా రూ.900 కోట్లు దీపావళికి ఇవ్వాలని అడిగాం. నవంబరు ఒకటి నాటికి పెండింగ్ బకాయిలు మొత్తం ఇవ్వాలని కోరాం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు అందరినీ కలిశాం. అధికారులు మా విజ్ఞప్తిని పెడచెవిన పెట్టారు. మమ్మల్ని ప్రభుత్వం బెదిరింపులకు గురి చేస్తోంది. మా మీద విజిలెన్స్ విచారణకు ఆదేశించారు.

మిగతా 12లో..

హింస నుంచి విముక్తి దిశగా ఛత్తీస్‌గఢ్

ప్రస్తుతం అభివృద్ధి, భద్రత, స్థిరత్వానికి చిహ్నంగా నిలుస్తోంది : ప్రధాని మోదీ

జార్ఖండ్(జనంసాక్షి):మావోయిస్టుల హింస, వెనుకబాటుతనానికి మారు పేరుగా ఉన్న ఛత్తీస్‌గఢ్ ప్రస్తుతం అభివృద్ధి, భద్రత, స్థిరత్వానికి చిహ్నంగా నిలుస్తోందని ప్రధాని మోదీ పేర్కొన్నారు. గడిచిన 25 ఏళ్ల రాష్ట్ర ప్రస్థానం స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు. నవ రాయ్‌పుర్‌లో శాసనసభ నూతన భవనాన్ని ప్రారంభించిన ఆయన అసెంబ్లీ నుంచి వచ్చే ఆలోచన ప్రజాసేవను ప్రతిబింబించేలా ఉండాలన్నారు. మావోయిస్టు హింస నుంచి విముక్తి పొందే దిశగా ఛత్తీస్‌గఢ్ అడుగులు వేస్తోందన్నారు.“అసెంబ్లీ అనేది కేవలం చట్టాలను రూపొందించే వేదిక కాదు.. రాష్ట్ర భవితవ్యాన్ని నిర్ణయించే శక్తిమంతమైన కేంద్రం. సభ నుంచి వచ్చే ప్రతి ఆలోచన ప్రజా సేవ స్ఫూర్తి, అభివృద్ధి పట్ల నిబద్ధత, దేశాన్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్లగలమనే విశ్వాసాన్ని చాటాలి” అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఉగ్రవాదం, వామపక్ష తీవ్రవా దాన్ని ఎదుర్కోవడంలో భారత్

మిగతా 2లో..



భారతీయులే కీలకం

హెచ్-1బీ ఫీజుల పెంపుపై పునఃపరిశీలించండి ట్రంప్‌కు అమెరికా చట్టసభ సభ్యుల బృందం వినతి

వాషింగ్టన్(జనంసాక్షి): అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్-1బీ వీసాలపై ఫీజు పెంపుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. వీసాలపై ప్రకటనను పునఃపరిశీలించాలని అమెరికా చట్టసభ సభ్యుల బృందం.. తాజాగా ట్రంప్‌ను కోరడం విశేషం. ఫీజు పెంపుల అంశం అమెరికా ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేయడమే కాకుండగా.. ఏఐ సాంకేతిక నాయకత్వాన్ని దెబ్బతీస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.అమెరికా చట్టసభ సభ్యుల బృందం ప్రతినిధులు జిమ్మీ పనెట్టా, అమీ బెరా, సలుద్ కార్బజల్, జూలీ జాన్సన్ తాజాగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌కు లేఖ రాశారు. ఈ లేఖలో హెచ్1-బీ వీసాల ఫీజుల పెంపు గురించి ముఖ్యంగా ప్రస్తావించారు. లేఖలో..’ హెచ్-1బీ గ్రహీతల్లో అత్యధిక వాటాను భారతీయులు కలిగి ఉన్నారు. వారిలో ఎక్కువ మంది సమాచార సాంకేతికత, కృత్రిమ మేధస్సులో అమెరికా నాయకత్వానికి కేంద్రంగా ఉన్నారు. వీసాల విషయం భారత్, అమెరికా మధ్య సంబంధాలకు కూడా ఎంతో కీలకం. ఇలాంటి వీసా విధానం ఇండో-పసిఫిక్‌లో అమెరికాకు అత్యంత సన్నిహిత ప్రజాస్వామ్య మిత్రదేశాలలో ఒకటైన భారత్‌తో సంబంధాలను దెబ్బతీస్తుంది. వీసాల అమలు వల్ల కీలకమైన ప్రజాస్వామ్య భాగస్వామితో వ్యూహాత్మకంగా అమెరికా భాగస్వామ్యం బలపడుతుంది.మరోవైపు..

మిగతా 2లో..

అవరసరమైతే ఆపరేషన్ సిందూర్ 2.0

- అందుకు సిద్ధంగా ఉన్నాం
- పాక్ ప్రేలాపనలపై

ఆర్మీ చీఫ్ జనరల్ ద్వివేది కౌంటర్

భోపాల్(జనంసాక్షి):అఫ్ఘానిస్థాన్‌తో ఉద్రిక్తతల నేపథ్యంలో భారత్‌పై నోరు పారేసుకుంటున్న పాక్‌కు భారత ఆర్మీ చీఫ్ జనరల్ ఉపేంద్ర ద్వివేదీ మరోమారు గట్టి వార్నింగ్ ఇచ్చారు. పాక్ మళ్లీ ఏదైనా మూర్ఖపు చర్యకు దిగితే ఆపరేషన్ సిందూర్ రెండో రౌండ్‌కు తాము రెడీగా ఉన్నామని అన్నారు. ఆపరేషన్ సింధూర్ 2.0కు భారత సాయుధ దళాలు సిద్ధంగా ఉన్నాయి. త్రివిధ దళాధిపతులు సాయుధ దళాలను ముందుండి నడిపిస్తే మమల్ని ఎవరూ ఎదుర్కోలేరని ఆయన అన్నారు. మధ్యప్రదేశ్ రాష్ట్రం రేవా జిల్లాలోని సైనిక్ స్కూల్‌ను సందర్శించిన సందర్భంగా ఆయన ఈ హెచ్చరిక చేశారు. ఆపరేషన్ సిందూర్ ముగింపు ఎప్పుడో భారత్ తప్ప ఇతరులెవరూ నిర్ణయించలేరని

మిగతా 9లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
02.11.2025

ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డిని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుగా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శనివారం రాష్ట్ర సచివాలయంలో సుదర్శన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు సుదర్శన్ రెడ్డి. అలాగే, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన ఎమ్మెల్యేలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఇతర నేతలు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు.

ఓటమి భయంతోనే కాంగ్రెస్ బెదిరింపు రాజకీయాలు

ఓటమి భయంతో సీఎం రేవంత్ రెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్‌లో ఎవరైనా కాంగ్రెస్ నేతలు ప్రజలను భయపెడితే.. తెలంగాణ భవన్ ఎల్లప్పుడూ తెరిచే ఉంటుందని హామీ ఇచ్చిన కేటీఆర్.. వారి సంగతి తాము చూసుకుంటామని భరోసా ఇచ్చారు.ఇక.. జూబ్లీహిల్స్ బీఆర్ఎస్ విజయం ఖాయమైపోయిందని అన్నారు కేటీఆర్. ఇప్పటి వరకు వచ్చిన సర్వేలన్నీ ఇదే విషయాన్ని స్పష్టం చేస్తున్నాయని తెలిపారు. గత ఎన్నికల్లో వచ్చిన దానికంటే రెట్టింపు మెజార్టీ రాబోతోందని వెల్లడించారు. అటు.. నియోజకవర్గ అభివృద్ధి కోసం గోపినాథ్ ఎంతో కృషి చేశారని కొనియాడారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. కొన్ని కోట్ల విలువైన భూమిని కాపాడటంలో గోపినాథ్ కృషి మరువలేనిదని చెప్పారు. అయితే.. గోపినాథ్ అకాల మరణంతో ఈ ఎన్నిక వచ్చిందన్న ఆయన.. తన భర్తను తలుచుకొని సునీత కన్నీరు పెట్టుకుంటే కూడా కాంగ్రెస్ దిగజారుడు రాజకీయాలకు పాల్పడుతోందని ఫైరయ్యారు. సిగ్గులేని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం కన్నీళ్లను కూడా రాజకీయం చేస్తోందని ఆయన మండిపడ్డారు.మరోవైపు.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కూడా విఫలమైందని కేటీఆర్ ఫైరయ్యారు. మహిళలకు, వృద్ధులకు నెలకు రూ.4వేలు పెన్షన్.. యువతులకు స్కూటీలు, యువతకు రూ.2,500 ఇస్తామని చెప్పి మాట తప్పిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తూ.. పురుషులపై రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. పైగా కేసీఆర్ ఇచ్చిన కేసీఆర్ కిట్లు, బతుకమ్మ చీరలు లేవు, రంజాన్, క్రిస్మస్ కానుకలను కాంగ్రెస్ సర్కార్ రద్దు చేసిందని మండిపడ్డారు. రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తాం.. నిరుద్యోగ భృతి నెలకు రూ.4 వేలు ఇస్తామని వాగ్దానం చేసి.. నెరవేర్చలేకపోయిందని ఫైర్ అయ్యారు. అటు.. రేవంత్ రెడ్డిది కాంగ్రెస్‌తో ఫేక్ బంధం.. బీజేపీతో పేగు బంధం ఉందని ఎద్దేవా చేశారు. హైడ్రా పేరు చెప్పి పేదల ఇళ్లను బుల్డోజర్లతో కూల్చివేస్తుండటంతో ప్రజలు భయపడుతున్నారని చెప్పారు. తప్పుల మీద తప్పులు చేస్తున్న రేవంత్ సర్కార్‌కు.. జూబ్లీహిల్స్ ప్రజలు బుద్ధి చెప్పబోతున్నారని స్పష్టం చేశారు కేటీఆర్. బీఆర్ఎస్‌కు భారీ విజయం దక్కబోతోందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ ఎన్నికలో కాంగ్రెస్ డిపాజిట్ కోల్పోతే, 500 రోజుల్లో కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా తిరిగి వస్తారని చెప్పారు.

బీఆర్ఎస్,బీజేపీలది లోపాయికారి ఒప్పందం

తీర్చుకోవడానికి బీజేపీ ప్రాధాన్యత లేని అభ్యర్థిని నిలబెట్టిందని దుయ్యబట్టారు. ఎన్డీఏ ప్రభుత్వం ప్రతి నిర్ణయంలో గులాబీ బాస్, మాజీ సీఎం కేసీఆర్ పాత్ర ఉందని ఆరోపించారు. రాష్ట్రపతి అధ్యక్ష పదవిని నుంచి మొదలుకొని ట్రిపుల్ తలాక్ వరకు బీజేపీకి కేసీఆర్ మద్దతు ఇచ్చారని అన్నారు. డబ్బుతో ఓట్లను కొలవడమనేది అనైతిక చర్య అని పేర్కొన్నారు. కాంగ్రెస్ వాళ్ళు ఇచ్చే రూ.5 వేలు తీసుకోండి.. బీఆర్ఎస్ పార్టీకి ఓటేయండి? అంటూ కేటీఆర్ మాట్లాడటం ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించే చర్యగా పేర్కొన్నారు. ఎలక్షన్ కమిషన్ తక్షణమే కేటీఆర్ పై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మెజార్టీ అమలు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ హామీలు అమలు చేసి ఓట్లు అడుగుతుందని వ్యాఖ్యానించారు. రాష్ట్రం వస్తే ఉద్యోగాలు వస్తాయని అమాయకులైన నిరుద్యోగులను బలిగొన్న చరిత్ర బిఆర్ఎస్ పార్టీదని ఫైర్ అయ్యారు. పదేళ్ల పాలనలో కేసీఆర్ కుటుంబంలో వారికి మాత్రమే ఉద్యోగాలు వచ్చాయని మండిపడ్డారు.బీజేపీ, బీఆర్ఎస్ రెండూ ఒకటేనని పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గత ఎన్నికల్లో బీజేపీకి బీఆర్ఎస్ సాయం చేసిందని.. ఆ రుణాన్ని బీజేపీ ఇప్పుడు తీర్చుకుంటుందని ఆరోపించారు. అందుకే జూబ్లీహిల్స్ ఎన్నికలో బీజేపీ డమ్మీ క్యాండిడేట్ ను పెట్టిందని విమర్శించారు. యూసుఫ్ గూడలో ఏర్పాటు చేసిన మీటింగ్‌లో ఆయన బీజేపీ, బీఆర్ఎస్ పై తీవ్ర విమర్శలు చేశారు. బీఆర్ఎస్ పార్టీ ఫేక్ హామీలతో మోసం చేసిందని అన్నారు.

కారు షెడ్డుకు పోయింది

తీసుకొచ్చిన కసాయే కెసిఆర్ అని అన్నారు. బీఆర్ఎస్ ఈ ఎన్నికల్లో సెంటిమెంట్ రాజేయాలని చూస్తోందని అన్నారు. పదేళ్లు బీఆర్ఎస్ వ్యక్తి ఇక్కడ ఎమ్మెల్యేగా ఉన్నా సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదో ఆలోచించండని సీఎం రేవంత్ అన్నారు. తాడు బొంగరం లేని బీజేపీ ఇక్కడ అభివృద్ధి చేస్తామని అంటోందని ఎద్దేవా చేశారు. బోరబండలో అడిగినోళ్లందరికి రేషన్ కార్డులు ఇచ్చామని.. ఆడబిడ్డలకు ఫ్రీ బస్సు ఇస్తే బీఆర్ఎస్ కు కడుపు మండుతోందని.. ఆడబిడ్డలు పైసా లేకున్నా బస్సుల్లో ప్రయాణిస్తున్నారని అన్నారు సీఎం రేవంత్. 2014లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే.. ఐదేళ్లు మహిళా మంత్రి లేదని.. తాము అధికారంలోకి రాగానే ఇద్దరు మహిళలను మంత్రులను చేశామని అన్నారు సీఎం రేవంత్. మాగంటి గోపినాథ్ ఎప్పుడైనా అసెంబ్లీలో ప్రజాసమస్యలు ప్రస్తావించారా అని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో సమస్యలు పరిష్కారం కావాలంటే నవీన్ యాదవ్ ను గెలిపించాలని అన్నారు సీఎం వెంట ప్రచారంలో నవీన్ యాదవ్, మంత్రి అజారుద్దీన్ ఉన్నారు.

తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డితో కెనడా హైకమిషనర్ క్రిస్టోఫర్ కూటర్ బృందం సభ్యులు సమావేశం అయ్యారు. ఈ భేటీలో ఐటీ, ఫార్మా, ఎయిర్‌స్పేస్, డిఫెన్స్, అర్బన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌లో కెనడాతో భాగస్వామ్యాన్ని మరింత ముందుకు తీసుకెళ్లడంపై చర్చించారు.ప్రభుత్వం చేపట్టిన ప్రతిష్టాత్మక ప్రాజెక్టులను కెనడా హైకమిషనర్‌కు వివరించారు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. తెలంగాణ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావాలని కెనడా హైకమిషనర్‌కి సీఎం విజ్ఞప్తి చేశారు. స్టార్టప్స్, ఎడ్యుకేషన్, అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్స్‌లోనూ పెట్టుబడుల పెట్టడానికి ముందుకు రావాలని సీఎం సూచించారు. ఈ సమావేశంలో కెనడా మినిస్టర్ ఎడ్ జాగర్ , ట్రేడ్ కమిషనర్ విక్రమ్ జైన్, కారెన్, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఫ్రాన్స్ కాన్సులెట్ జనరల్ మార్క్ లామీ బృందం మర్యాదపూర్వకంగా సమావేశం అయ్యారు. ఈ భేటీలో హైదరాబాద్‌లో ఫ్రాన్స్ ఆన్ గోయింగ్ ప్రాజెక్టుల ప్రస్తుత పరిస్థితిపై చర్చించారు. హైదరాబాద్‌లో మరిన్ని పెట్టుబడులు పెట్టాలని ఫ్రాన్స్ బృంద సభ్యులని సీఎం కోరారు. హైదరాబాద్‌లో ఫ్రెంచ్ బ్యూరో కార్యాలయాన్ని మరింత బలోపేతం చేయాలని సీఎం విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో మోద్ మిక్సా, తెలంగాణ ప్రభుత్వ స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, విష్ణువర్ధన్ రెడ్డి, అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇల్లు పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక

- మూడేళ్ల కాలంలో జూబ్లీహిల్స్ సమస్యలు పరిష్కరిస్తాం

రాష్ట్రాభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తోంది: మంత్రి పొంగులేటి

హైదరాబాద్(జనంసాక్షి):ఇందిరమ్మ ఇల్లు పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని తెలంగాణ గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా రెహమత్ నగర్‌లో పర్యటించిన మంత్రి.. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పదేళ్ల పాలనలో జూబ్లీహిల్స్‌లో భారాస ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించలేక పోయిందని ఆరోపించారు. తమ అభ్యర్థి నవీన్‌కుమార్‌ను గెలిపిస్తే.. మూడేళ్ల కాలంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. భాజపా, భారత రాష్ట్ర సమితిలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు.ఇందిరమ్మ ఇల్లు పేదవారి ఆత్మగౌరవానికి ప్రతీక అని, అర్హులైన ప్రతి ఒక్కరికీ అందజేస్తామని తెలంగాణ గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాష్ట్రాభివృద్ధి, సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. పదేళ్ల పాలనలో జూబ్లీహిల్స్‌లో భారాస ప్రభుత్వం మౌలిక వసతులు కల్పించలేక పోయిందని ఆరోపించారు. తమ అభ్యర్థి నవీన్‌కుమార్‌ను గెలిపిస్తే.. మూడేళ్ల కాలంలో ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని చెప్పారు. భాజపా, భారత రాష్ట్ర సమితిలను నమ్మి ప్రజలు మోసపోవద్దన్నారు.

రేపటి నుంచి ప్రైవేటు కాలేజీల నిరవధిక బంద్

నవంబర్ 3 నుంచి నిరవధిక బంద్ చేస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి.. రేపటిలోగా మంచి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాం. బంద్ సమయంలో పరీక్షలు వాయిదా వేయాలి. నవంబర్ 6న అన్ని కాలేజీల స్టాఫ్, సిబ్బందితో కలిసి దాదాపు లక్ష మందితో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తాం. నవంబర్ 10 లేదా 11న 10 లక్షల మంది విద్యార్థులతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తాం. ఒకటి.. రెండు కాలేజీలకు ఎందుకు బకాయిలు చెల్లించారు. 10శాతం లంచం తీసుకొని ఇచ్చారా. ఆ కాలేజీలపై విచారణ జరపాలి. అత్యంత ఫ్రాడ్ జరిగే దగ్గర విచారణ జరపాలి. ఎమ్మెల్యేలు, అధికారుల ఇళ్ల ముట్టడి చేస్తాం. విద్యార్థులు, తల్లిదండ్రులకు కలిగే అసౌకర్యానికి క్షమాపణ చెబుతున్నాం" అని రమేష్‌బాబు తెలిపారు.

భారతీయులే కీలకం..

ఏఐ, అధునాతన సాంకేతికతలలో చైనా దూకుడుగా పెట్టుబడులు పెడుతున్న సమయంలో మనం ప్రపంచంలోని అత్యుత్తమ ప్రతిభను ఆకర్షించడాన్ని కొనసాగించాలి. హెచ్-1బీ వీసాల అమలు అంటే కేవలం ఉద్యోగాలను మాత్రమే భర్తీ చేయడం కాదు. ఇది 21వ శతాబ్దంలో ప్రపంచ శక్తిని నిర్వచించే పరిశ్రమలలో అమెరికా నాయకత్వాన్ని చూపించడం. వీసాల ఫీజు పెంపు పెద్ద కంపెనీలకు కొంత అనుకూలంగా ఉన్నప్పటికీ.. నైపుణ్యంపై ఆధారపడే స్టార్టప్‌లు, పరిశోధన సంస్థలను గుదిబండగా మారుతుంది' అని హెచ్చరించారు.హెచ్-1బీ వీసాలను కంపెనీలు దుర్వినియోగం చేస్తున్నాయని, స్థానిక అమెరికన్ యువత స్థానంలో తక్కువ జీతాలకు విదేశీ కార్మికులను నియమిస్తున్నారని అమెరికా లేబర్ డిపార్ట్‌మెంట్ ఆరోపించింది.

హింస నుంచి విముక్తి దిశగా ఛత్తీస్‌గఢ్

విజయం సాధించిందని ఈ సందర్భంగా మోదీ గుర్తు చేశారు. ఉగ్రవాదం వెన్నెముకను భారత్ విరిచినట్లే.. మావోయిస్టు హింస నుంచి విముక్తి పొందే దిశగా ఛత్తీస్‌గఢ్ అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలో గడిచిన రెండున్నర దశాబ్దాల్లో ఎంతో మార్పు వచ్చిందని, ఈ ఘనత రాష్ట్ర ప్రజల కృషి, భాజపా ప్రభుత్వాల నాయకత్వాలకే చెందుతుందన్నారు.

శ్రీ సత్యసాయి సంజీవని ఆస్పత్రిని సందర్శించిన ప్రధాని

రాయ్‌పుర్‌లోని శ్రీ సత్యసాయి సంజీవని ఆస్పత్రిని ప్రధాని నరేంద్ర మోదీ సందర్శించారు. గుండె సంబంధిత శస్త్రచికిత్సలు చేయించుకున్న చిన్నారులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆస్పత్రికి చేరుకున్న మోదీకి.. 'వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ మిషన్' వ్యవస్థాపకులు మధుసూదన్ సాయి స్వాగతం పలికారు. సత్యసాయి సంజీవని ఆస్పత్రుల ఛైర్మన్ శ్రీనివాసన్ ప్రధానికి చిత్రపటాన్ని అందజేశారు. సత్యసాయి బాబా విగ్రహానికి పూజలు నిర్వహించిన అనంతరం.. ఆ ఆస్పత్రిలో చికిత్స పొందిన చిన్నారులకు ప్రధాని ధ్రువపత్రాలు అందజేశారు. చిన్నారుల ప్రశ్నలకు ఓపిగ్గా సమాధామిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ క్రికెటర్, సత్యసాయి సంజీవని ఆస్పత్రి ట్రస్టీల్లో ఒకరైన సునీల్ గవాస్కర్ కూడా పాల్గొన్నారు.వన్ వరల్డ్ వన్ ఫ్యామిలీ మిషన్‌లో భాగంగానే 'శ్రీ సత్యసాయి సంజీవని' ఆస్పత్రులను నిర్వహిస్తున్నారు. ఈ మిషన్ వైద్యం, విద్య, పోషకాహార రంగాల్లో వందకు పైగా దేశాల్లో సేవలం దిస్తోంది. భారత్‌లోని 25 రాష్ట్రాల్లో 4 కేంద్ర పాలిత ప్రాంతాల్లో రోజూ కోటి మంది ప్రభుత్వ పాఠశాలల చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తోంది. అంతేకాకుండా దేశంలోనే మొట్ట మొదటి ఉచిత ప్రైవేటు వైద్య కళాశాలను కూడా నిర్వహిస్తోంది. ఈ కాలేజీని ప్రధాని నరేంద్ర మోదీ 2023లో ప్రారంభించారు.ఉచిత వైద్య కళాశాలతో పాటు శ్రీ సత్యసాయి యూనివర్సిటీ ఫర్ హ్యూమన్ ఎక్స్‌లెన్స్ పేరిట ఓ విశ్వవిద్యాలయం కూడా ఉంది. అంతేకాకుండా కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల్లో 6వ తరగతి నుంచి పీహెచ్‌డీ వరకు విద్యార్థులకు పూర్తిగా ఉచితంగా విద్యను అందిస్తున్నారు. దేశంలోని చిన్నారుల్లో పోషకాహార లోపాన్ని తగ్గించడమే లక్ష్యంగా అన్నపూర్ణ ట్రస్ట్ ద్వారా ప్రభుత్వ పాఠశాలల చిన్నారులకు పోషకారాన్ని అందిస్తున్నారు.

మానవ హక్కుల ఉల్లంఘనలు ఆపండి

న్యూయార్క్(జనంసాక్షి):అంతర్జాతీయ వేదికగా పాకిస్థాన్‌కు మరోసారి భంగపాటు ఎదురైంది. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లోని ప్రజల బహిరంగ తిరుగుబాటును అక్కడి దళాలు అణచివేస్తున్నాయని, అక్కడ జరుగుతున్న మానవ హక్కుల ఉల్లంఘనను వెంటనే ఆపాలని భారత్ డిమాండ్ చేసింది. ఐక్యరాజ్యసమితి జనరల్ అసెంబ్లీలో చర్చ సందర్భంగా మన దౌత్యవేత్త భవిక మంగళానందన్ మాట్లాడుతూ.. పాక్‌పై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పీవోకేలో తీవ్రమైన మానవ హక్కుల ఉల్లంఘనలు కొనసాగుతున్నాయన్నారు. వీటిని వెంటనే ఆపాలని ఆమె డిమాండ్ చేశారు. 'ఆ ప్రాంతంలోని ప్రజలు ప్రాథమిక హక్కు, స్వేచ్ఛ కోసం చేస్తున్న తిరుగుబాటును ఆ దేశ దళాలు అణచివేస్తున్నాయి. ఈ క్రమంలో అనేకమంది అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోతున్నారు' అని ఆమె పేర్కొన్నారు. ఐరాసలో జరిగే చర్చల్లో భారత్‌పై నిందలు మోపేందుకు ఆ దేశ దౌత్యవేత్తలు చేస్తున్న ప్రయత్నాలను ఆమె తప్పుబట్టారు.పాక్ ద్వంద్వవైఖరి, కపటత్వంపై సమయం వెచ్చించడం, దృష్టిపెట్టాల్సిన అవసరం లేదన్నారు. భారతదేశ ప్రజాస్వామ్యంపై పాక్ చేస్తున్న ఆరోపణలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతున్న విషయాన్ని గుర్తుచేశారు. వారి ఆరోపణలు, అబద్ధాలు వాస్తవాలను మార్చలేవని భవిక అన్నారు. ఇటీవల కశ్మీరీ ప్రజలు ఎన్నికల్లో పాల్గొన్న విషయాన్ని ఆమె ఇక్కడ ప్రస్తావించారు. ఈసందర్భంగా ఆ దేశ సామాజిక, ఆర్థిక పురోగతి గురించి అందరికీ తెలుసని ఎద్దేవా చేశారు. కేంద్రపాలిత ప్రాంతాలైన జమ్మూకశ్మీర్, లద్దాఖ్ ఎప్పటికీ భారత్‌లో అంతర్భాగమేనని మంగళానందన్ పునరుద్ఘాటించారు.

కాశీబుగ్గలో ఘోర విషాదం

నిర్మించారు. కార్తీకమాసంలో వచ్చే ఏకదశి శనివారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో రావడంతో తొక్కిసలాట జరిగింది. దీంతో రెయిలింగ్ ఊడిపోయివడంతో కిందపడ్డారు. దీంతో పిల్లలతో సహా తొమ్మిది మంది చనిపోయారు. ఆలయం దగ్గర సహాయక చర్యలు కొనసాగుతున్నాయి.ఏకాదశి సందర్భంగా వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా పోటెత్తారు. ఈ నేపథ్యంలోనే తొక్కిసలాట చోటుచేసుకుంది. పలువురు భక్తులు స్పృహతప్పి పడిపోయారు. ఘటనాస్థలిలో సహాయచర్యలు కొనసాగుతున్నాయి. క్షతగాత్రులను స్థానిక ఆస్పత్రులకు తరలించారు. ఈ ప్రమాదంలో ఏడుగురు ఘటనాస్థలిలోనే మృతి చెందారు. ఇద్దరు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 8 మంది మహిళలు, 12 ఏళ్ల బాలుడు ఉన్నారు. సుమారు 25 మంది గాయపడినట్లు సమాచారం. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతులను వై.చిన్నమ్మ, ఆర్.విజయ, ఎం.నేలమ్మ, డి.రాజేశ్వరి, సీహెచ్ పశోధామిగా గుర్తించారు. మరికొందరి వివరాలు తెలియాల్సి ఉంది.శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వేంకటేశ్వర ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన కలచివేసిందని సీఎం చంద్రబాబు అన్నారు. 'ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి సత్వర చికిత్స అందించా లని అధికారులను ఆదేశించాను. ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించా ల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరాను' అని చంద్రబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఎక్స్ (ట్వీట్టర్) వేదికగా స్పందించిన ఆయన.. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన తనను బాగా కలచివేసింది.. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం.. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. ఈ తొక్కిసలాటలో గాయాల పాలైన వారికి సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ ఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలను పర్యవేక్షించాల్సిందిగా స్థానిక అధికారులను, ప్రజాప్రతినిధులను కోరారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుంది అని సీఎం చంద్రబాబు భరోసా ఇచ్చారు. అలాగే, శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గ వెంకటేశ్వర స్వామి ఆలయ తొక్కిలాట దుర్ఘటనపై రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన గురించి అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం అన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను.. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందచేయాలని అధికారులకు ఆదేశాం.. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలగా అండగా ఉంటుందని హోం మంత్రి అనిత హామీ ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని కాశీబుగ్గ వెంకటేశ్వర ఆలయంలో తొక్కిసలాట ఘటన కలచివేసింది. ఈ దురదృష్టకర ఘటనలో భక్తులు మరణించడం అత్యంత విషాదకరం. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. గాయాల పాలైన వారికి మేలైన సత్వర చికిత్స అందించాలని అధికారులను ఆదేశించానన్నని అన్నారు. ఆలయ తొక్కిసలాట ఘటనపై కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. క్షతగాత్రులకు తక్షణం మెరుగైన వైద్యం అందించాలని జిల్లా కలెక్టర్, ఇతర అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబాలకు సానుభూతి తెలిపారు. రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఘటనా స్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. నాలుగేళ్ల క్రితం ఈ ఆలయ నిర్మాణాన్ని ధర్మకర్త హరిముకుంద్‌పండా ప్రారంభించారు. 12 ఎకరాల సొంత భూమిలో ఈ ఆలయ నిర్మాణం జరిగింది. సుమారు రూ.20 కోట్లతో దీనిని నిర్మించారు. కొత్తగా నిర్మించిన ఆలయంలో మే నుంచి దర్శనాలు ప్రారంభమయ్యాయి. ప్రతి శనివారం ఈ ఆలయానికి భారీగా భక్తులు తరలివస్తారు.

తొక్కిసలాట ఘటన బాధాకరం

శ్రీకాకుళం **(జనంసాక్షి):**శ్రీకాకుళం జిల్లా కాశీబుగ్గలో వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటనపై ప్రధాని మోదీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన జరగడం విచారకరమని సోషల్ మీడియా వేదికగా స్పందించారు 'ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీకాకుళం జిల్లాలో గల వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగిన తొక్కిసలాట ఘటన బాధాకరం. తమ కుటుంబ సభ్యులను కోల్పోయిన వారి గురించే నా ఆలోచనంతా. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నా" అని మోదీ విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల చొప్పున, గాయపడిన వారికి రూ.50,000 చొప్పున ఎక్స్‌గ్రేషియా అందజేస్తామని పీఎంఓ కార్యాలయం ప్రకటించింది. ఈ ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందిస్తూ.. "తొక్కిసలాటలో భక్తులు ప్రాణాలు కోల్పోవడం తీవ్ర దిగ్భ్రాంతి కలిగించింది. మృతుల కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నా" అని విచారం వ్యక్తం చేశారు.ఏకాదశి సందర్భంగా శనివారం వేంకటేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా పోటెత్తారు. ఈ నేపథ్యంలోనే తొక్కిసలాట చోటుచేసుకుంది. పలువురు భక్తులు స్పృహతప్పి పడిపోయారు. ఈ ప్రమాదంలో పలువురు ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఎక్కువమంది మహిళలు ఉన్నారని తెలుస్తోంది.

పిడికిలెత్తిన ఆత్మగౌరవ పతాక

బీఆర్ గవాయి దళితుడు కావడం వల్లనే ఈ దాడి జరిగిందన్నారు. గవాయి స్థానంలో ఉన్నతవర్గాలకు చెందిన న్యాయమూర్తులు ఉంటే ఈ దాడి జరిగి ఉండేదా అని ప్రశ్నించారు. అందువల్లనే ఈ దాడిని దళితుల మీద జరిగిన దాడిగా చూస్తున్నామని తెలిపారు. గవాయి దళితుడు కావడం వల్లనే వ్యవస్థలన్నీ మౌనం వహించాయని, కానీ అదేస్థానంలో ఉన్నతవర్గాలకు చెందిన న్యాయమూర్తి ఉంటే ఇప్పటికే స్పందించి శిక్షలు వేసేవారని అన్నారు. ఇంత కులవివక్షత పాటించడం అత్యంత అమానుషం అని అన్నారు. ఢిల్లీ పోలీసులు ఇప్పటికీ కేసు ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు సుమోటోగా కేసు ఎందుకు స్వీకరించలేదన్నారు. జాతీయ మానవ హక్కుల కమిషన్ మౌనంగా ఉండిపోయిందని ఆందోళన వ్యక్తంచేశారు. ఇలాంటి పరిస్థితుల్లో దళితులకు రక్షణ ఎక్కడ ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే దళితుల ఆత్మగౌరవ ఉద్యమానికి శ్రీకారం చుట్టామని అన్నారు. దేశంలో రాజ్యాంగ వ్యవస్థలన్నీ చట్టప్రకారం పని చేయాలని కోరారు. దాడులకు పాల్పడ్డవారు దాడులను సమర్థించుకుంటుంటే.. మళ్ళీ దాడులు చేస్తామని మాట్లాడుతున్నా చట్టపరమైన చర్యలు ఎందుకు తీసుకోవడం లేదన్నారు. విశ్వాసాల పేరుతో దాడులకు పాల్పడితే శిక్షలు వేయకపోవడం చట్టవిరుద్ధం అని అన్నారు. 'విశ్వాసాల పేరుతో, ధర్మాల పేరుతో దళితుల మీద దాడికి పాల్పడితే కేసులు పెట్టరా? శిక్షలు వేయరా? అరెస్టులు చేయరా? ఇదేమి న్యాయం అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వివక్షతను దళిత సమాజం గట్టిగా ఎదుర్కోవడానికి సిద్ధమవుతుంది అన్నారు.దళితుల మీద దాడులకు పాల్పడితే సహించేది లేదని మందకృష్ణ మాదిగ అన్నారు. ఇప్పటికే దేశంలో కులాంతర వివాహాలు చేసుకున్నా, మీసాలు పెంచుకున్న, స్కూళ్ళలో మంచి నీళ్ళు తాగినా దళితులను నిర్దాక్షిణ్యంగా హత్యలు చేస్తున్నారని అన్నారు. దీనికి ఎక్కడోచోట తగిన ముగింపు జరగాల్సిన అవసరం ఉందన్నారు. అందుకే జస్టిస్ బిఆర్ గవాయి న్యాయం జరగాలని జాతీయ స్థాయిలో పోరాటం చేస్తున్నామని తెలిపారు. హైదరాబాద్‌లో జరుగుతున్న దళితుల ఆత్మగౌరవ పోరాటం కేవలం ఆరంభం మాత్రమే అని

కాంగ్రెస్ భస్మాసుర హస్తం

- జూబ్లీహిల్స్ ప్రచారంలో ఎంపి రఘునందన్

హైదరాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) : 'అభయ హస్తం మేనిఫెస్టోలో ప్రజా దర్బార్‌ను నిర్వహిస్తాం అన్నారు.. ప్రజా దర్బార్ నిర్వహించడానికే కాంగ్రెస్ కు చేతకాలేద'ని బీజేపీ ఎంపీ రఘునందన్ రావు విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కేసీఆర్ అవినీతి రూ. లక్ష కోట్లు కక్కిస్తాం అన్నారు..? ప్రజలకు పంచుతాం అన్నారు..? ఏమైందని ప్రశ్నించారు. కేసీఆర్ కుటుంబం నుంచి కక్కించిన మొత్తం డబ్బు ఎంతో..? ముఖ్యమంత్రి శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జీవో 111 వెనక లక్షల కోట్ల కుంభకోణం అన్నారు.. అది ఏమైందో ముఖ్యమంత్రి చెప్పాలన్నారు. బీఆర్ఎస్ 30 శాతం కమిషన్ సర్కార్ అన్నారు. ప్రస్తుతం ఎంత కమిషన్ నడుస్తుంది ముఖ్యమంత్రి చెప్పాలి? అని నిలదీశారు. కాంగ్రెస్ అభయ హస్తం కాదు.. ఆది భస్మాసుర హస్తమని జూబ్లీహిల్స్ ప్రజలు గమనించాలని ఎంపీ రఘునందన్‌రావు అన్నారు. మానిఫెస్టోలో మొదటి పేజీనే అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రం ఒక్క నియోజక వర్గంలో గంటేడు జాగా స్మశాన వాటిక కు ఇవ్వలేదన్నారు. కానీ షేక్ పేట్‌లో కబ్రస్థాన్‌కు ఆగమేఘాల మీద లాండ్ ఇచ్చారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీని కబ్రస్థాన్ లో పెట్టేందుకు ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు.. కంటోన్మెంట్ అభివృద్ధికి రూ.4 వేల కోట్లు ఇచ్చారని ముఖ్యమంత్రి చెబుతున్నారని చెప్పారు.. అవి ఏమయ్యాయని ప్రశ్నించారు. ఎంఐఎం ఎవరి కోసం ప్రచారం చేస్తుంది.. జూబ్లీహిల్స్ ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు.

తెలంగాణను ఎకో టూరిజం హబ్ చేస్తాం

- పర్యావరణాన్ని పరిరక్షిస్తూ... పర్యాటకాన్ని పెంపొందిస్తాం
- రాష్ట్ర అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణను ఎకో టూరిజం హబ్ చేస్తామని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. హైదరాబాద్ మహా నగరానికి అతి సమీపంలో ఉన్న నర్సాపూర్ అడవులను ప్రకృతి ప్రేమికులతో పాటు పర్యాటకులకు నచ్చేలా అర్బన్ ఎకో పార్క్ ను తీర్చిదిద్దామన్నారు. శనివారం ఆమె నర్సాపూర్ నియోజకవర్గంలో ఎకో పార్క్, కాటేజీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. పర్యాటకులను మరింతగా ఆకట్టుకోవడంతో పాటు ప్రముఖ పర్యాటక కేంద్రంగా నర్సాపూర్ అడవులను తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో తమ ప్రభుత్వం అర్బన్ ఎకో పార్కులో అధునాతన సౌకర్యాలతో కాటేజీల నిర్మాణాన్ని చేపట్టిందన్నారు. అటవీ శాఖ,ప్రైవేటు భాగస్వామ్యంతో అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. హైదరాబాద్-మెదక్ జాతీయ రహదారికి సమీపంలో ఉన్న ఈ అటవీ ప్రాంతాన్ని మరింత డెవలప్ చేయబోతున్నట్లు తెలిపారు. నర్సాపూర్‌కు ఎవరు వచ్చినా ...అర్బన్ ఎకో పార్కును సందర్శించి అక్కడి పరిసరాలు, ప్రకృతి అందాలను తనివితీరా ఆస్వాదించేలా సౌకర్యాలు అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. ఇక్కడ వాచ్‌టవర్ అందరినీ ఆకట్టుకుంటుందని అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. వాచ్‌టవర్ ఎక్కి అటవీ ప్రాంతం అంతా చూడటం ఓ గొప్ప అనుభూతిగా ఉంటుదన్నారు. ప్రస్తుతం హైదరాబాద్ శివార్లలో ఉన్న ప్రైవేట్ కాటేజీలను తలదన్నేలా ఇక్కడ అర్బన్ ఎకో పార్కులో సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. ఇక ప్రస్తుతం నగరాలన్నీ కాలుష్యం బారిన పడుతున్నాయి, ఈ నేపథ్యంలో పచ్చదనం కాపాడేందుకు ఎకో పార్కులను మెరుగుపరచడం, మరింత అభివృద్ధి చేయడం అనివార్యంగా మారిందని మంత్రి వివరించారు. గతంలో మన మానవ జీవన విధానం అడవుల్లోనే ప్రారంభమైందని, ఇప్పుడు పట్టణీకరణ పేరుతో పెరిగిన కాలుష్యం కారణంగా ప్రజలంతా మళ్ళీ అడవుల వైపు చూస్తున్నారన్నారు. అందుకే తమ ప్రభుత్వం అర్బన్ ఎకో పార్కు అభివృద్ధి పరిచిందన్నారు. ప్రస్తుత యాంత్రీకరణ జీవన విధానంలో వారంతంలో ఒక్కసారైన కుటుంబం ఇలాంటి ఆహ్లాదకరమైన వాతావరణంలో గడిపేందుకు అర్బన్ ఎకో పార్క్ లో అన్నీ సౌకర్యాలు ఉన్నాయన్నారు. అయితే కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలకు అడవులను ఫోన్‌లలో, ఇన్‌స్టాగ్రాం రీల్స్ లో చూపుతున్నారని, దీనంత దారుణం మరొకటి లేదని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. ఇవన్నీ కళ్లముందు సహజ సిద్ధంగా సాక్షాత్కరిస్తే అద్భుతంగా ఉంటుందని వివరించారు. అందుకే అర్బన్ ఎకో పార్కులను అటవీ శాఖ ఏర్పాటు చేసిందన్నారు. పర్యాటక పరంగా నర్సాపూర్ మరింత అభివృద్ధి చెందనుందని, ఇప్పటికే అర్బన్ పార్కుకు సందర్శకుల తాకిడి పెరిగిందని అధికారులు చెబుతున్నట్లు మంత్రి తెలిపారు. ఈ ఎకో పార్క్ లో పాత కాటేజీల పనులు పూర్తి చేయడంతో పాటు కొత్తగా మరిన్ని అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. నీరు నిల్వ ఉండే ప్రాంతంలో 21 కాటేజీలు, ఒకే బ్లాక్‌లో ఉండే విధంగా మరో 12 కాటేజీలు, ఎన్విరాన్‌మెంట్ ఎడ్యుకేషన్ సెంటర్, సెమినార్ హాల్, ఇండోర్, అవుట్‌డోర్ గేమ్స్, నెట్ క్రికెట్‌తో పాటు స్విమ్మింగ్ పూల్, పర్యాటకులకు భోజన సదుపాయం కల్పించేందుకు రెస్టారెంట్, దానిని ఆనుకొని కిచెన్ నిర్మాణాలు పూర్తయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, ప్రిన్సిపల్ సెక్రెటరీ పర్యావరణం అడవులు సైన్స్ అండ్ టెక్నాలజీ హమ్మద్ నదీమ్ ,ప్రధాన అటవీ సంరక్షణ అధికారి,సువర్ణ, ముఖ్య అటవీ సంరక్షణ అధికారి ప్రియాంక వర్గీస్,జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్, అదనపు కలెక్టర్ నగేష్,మృగవని గ్రూప్ ఆఫ్ రిసార్ట్స్ ఎండి ,విష్ణు చైతన్య రెడ్డి ,జిల్లా అటవీ అధికారి జోజీ, నర్సాపూర్ ఆర్డీవో మహిపాల్ రెడ్డి,ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ దారుణ హత్య

- తల, చేతుల వేళ్లు నరికిన వైనం
- వివస్త్రను చేసి చంపినట్టు అనుమానం
- ముమ్మర దర్యాప్తు చేపట్టిన పోలీసులు

నిజామాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) : నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం మిట్టాపూర్ శివారులో గుర్తుతెలియని మహిళ దారుణ హత్యకు గురైంది. మృతదేహానికి తల లేదు, చేతుల వేళ్లు సగం వరకు తెగి ఉన్నాయి. మహిళ మృతదేహాన్ని బాసర ప్రధాన రహదారి పక్కన స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటనా స్థలికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. మహిళ వయసు 30 నుంచి 40 ఏళ్ల మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. మృతదేహం వివస్త్రగా ఉండటంతో అత్యాచారం చేసి హత్య చేసినట్లు అనుమానిస్తున్నారు. వేరే ప్రాంతంలో చంపి ఇక్కడ పడేశారని అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఘటనా స్థలాన్ని పోలీసు కమిషనర్ సాయి చైతన్య పరిశీలించారు. క్లూస్ టీమ్ ఆధారాలు సేకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఓట్లు వేయకుంటే పథకాలు ఆపుతారా?

- బెదిరింపు రాజకీయాలు సహించేది లేదు
- సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ తలసాని

హైదరాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) : రేవంత్ రెడ్డి అలవాట్లు అందరికి ఉండవని, ప్రజలను భయపెడితే చూస్తూ ఊరుకోమని బీఆర్ఎస్ ఎమ్మెల్యే,మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో పలువురు బీఆర్ఎస్ నాయకులతో కలసి ఆయన మీడియాతో మాట్లాడారు. సీఎం రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయకపోతే పథకాలు ఆగుతాయని అన్నారని.. ప్రజలను రేవంత్ రెడ్డి భయపెడుతున్నారా? అని ప్రశ్నించారు. సంక్షేమ పథకాలు ఆగితే పోరాటం ఎలా చేయాలో తమకు తెలుసు అని చెప్పారు. అసెంబ్లీని ఏ విధంగా స్తంభింపచేయాలో కూడా తెలుసు అని అన్నారు. అసెంబ్లీలో మాట్లాడకుండా పనిచేసే ఎమ్మెల్యేలు చాలామంది ఉన్నారని అన్నారు. మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశారని చెప్పారు. ఆయన చివరి వరకు ప్రజల్లో ఉన్నారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా కాశీబుగ్గ తొక్కిసలాటలో చనిపోయిన భక్తులకు మాజీ మంత్రి సంతాపం తెలిపారు. రేవంత్ రెడ్డి ఇప్పటికైనా భాష మార్చుకోవాలని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే ఒపీనియన్ పోల్‌కు సిద్ధం కావాలని సవాల్ విసిరారు. 23 నెలల్లో రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరంలో ఎక్కడ తిరిగారో చెప్పాలన్నారు.

ఫ్రెయిస్ ఫ్యూజన్ కేఫ్‌ను ప్రారంభించిన ఉప్పల

హైదరాబాద్ (జనంసాక్షి) : నేరెడ్మెట్ క్రాస్ రోడ్ వద్ద శర్మ నూతనంగా ఏర్పాటు చేసిన ఫ్రెయిస్ ఫ్యూజన్ కేఫ్‌ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, అంతర్జాతీయ ఆర్య వైశ్య ఫెడరేషన్ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్, రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పల శ్రీనివాస్ గుప్త ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులకు శుభాకాంక్షలు తెలిపారు వ్యాపార రంగంలో రాణించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో కొమురవెల్లి దేవస్థాన పాలక మండలి డైరెక్టర్ జయప్రకాష్ రెడ్డి, డాక్టర్ కృష్ణమోహన్, నరేందర్, రామకృష్ణ, బ్యాట్మెంటన్ టీం శర్మ మిత్రులు తదితరులు పాల్గొన్నారు.

3నుంచి మెట్రో వేళల్లో మార్పులు

హైదరాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) : ఈ నెల 3 నుంచి హైదరాబాద్ మెట్రో రైలు ప్రయాణ వేళల్లో మార్పులు చేసినట్టు ఆ సంస్థ ఓ ప్రకటనలో తెలిపింది. ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11గంటల వరకు అన్ని టెర్మినల్స్‌లో అన్ని రోజుల్లో ప్రయాణ సదుపాయం ఉంటుందని మెట్రో రైలు యాజమాన్యం తెలిపింది. ప్రస్తుతం అమల్లో ఉన్న మెట్రో రైలు వేళలు గమనిస్తే.. సోమవారం నుంచి శుక్రవారం: ఉదయం 6 గంటల నుంచి రాత్రి 11.45 వరకు., శనివారం: ఉదయం 6గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు., ఆదివారం: ఉదయం 7 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు. సర్వీసులు అందుబాటులో ఉంటాయి.

రాజ్యాధికార సాధనే ధ్యేయంగా టీఆర్పీ

- రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా
- జిల్లా అధ్యక్షులు అరుణ ఆధ్వర్యంలో నూతన సభ్యులకు సన్మానం

కరీంనగర్ (జనంసాక్షి) : రాజ్యాధికార సాధనే ధ్యేయంగా టీఆర్పీ పుట్టిందని రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా అన్నారు. కరీంనగర్ జిల్లా టీఆర్పీ పార్టీ కార్యాలయంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు గంగిపెల్లి అరుణ ఆధ్వర్యంలో జిల్లాలో టీఆర్పీ పార్టీ వివిధ విభాగాలలో నూతనంగా నియమించబడ్డ అధ్యక్షులను ప్రధాన కార్యదరుషులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పార్టీ రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా హాజరై నూతన సభ్యులు జిల్లా కార్యదర్శి చాంద్ పాషా, జిల్లా మహిళ కార్యదర్శి విజయ లక్ష్మి, ప్రధాన కార్యదర్శి పోలు సబిత, జిల్లా యూత్ అధ్యక్షులు గుడెల్లి రాకేష్, ప్రధాన కార్యదర్శి మంతెన శ్రీకాంత్, కరీంనగర్ టౌన్ అధ్యక్షులు ఆర్షద్ బిన్ అలీ, ప్రధాన కార్యదర్శి ఎగుర్ల రమేష్, టౌన్ మహిళ అధ్యక్షులు జింక లావణ్య గార్లను శుభాకాంక్షలు తెలియజేస్తూ జిల్లా అధ్యక్షులు అరుణతో కలిసి నూతన సభ్యులను సన్మానించారు. అనంతరం రాష్ట్ర కార్యదర్శి అఖిల్ పాషా మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో బీసీ రాజ్యాధికారం సాదించుకోవడం టీఆర్పీ పార్టీ తోనే సాధ్యమైతుందని తెలిపారు. టీఆర్పీ పార్టీ కరీంనగర్ జిల్లాలో గ్రామ వ్యాప్తంగా బలపడేటట్టు అందరూ కలిసి కృషి చేయాలని సూచన చేశారు. మనమెంతో మనకంత అనే నినాదంతో ప్రజా క్షేత్రంలోకి వెళ్లి అగ్రవర్ణాల దోపిడీని అరికట్టాలని అందుకు గాను మీరంతా పార్టీ సైనికులై కష్టపడాలని తెలిపారు. పార్టీలో చేరిన నూతన సభ్యులు అందరూ పార్టీ బలోపేతానికి ముందు వరుసలో ఉండాలని అఖిల్ పాషా సూచన చేశారు. ఈ కార్యక్రమంలో టీఆర్పీ నాయకులు బూత్కూరి మధు, ఓర్సు రాజు, సమ్మయ్య, గణేష్, వాజిద్, మహబూబ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు ఫైళ్ల దొంగతనంపై తక్షణ చర్య తీసుకోండి

- బీఆర్ఎస్ మైనారిటీ సెల్ డిమాండ్

హైదరాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) : తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు కార్యాలయం నుండి కీలక పత్రాల దొంగతనం జరగడంపై, ఎఫ్ఐఆర్ నెం. 261/2025లో పేర్కొన్న విధంగా, భారత్ రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) రాష్ట్ర మైనారిటీ సెల్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. తెలంగాణ రాష్ట్ర వక్ఫ్ బోర్డు ముఖ్య కార్యనిర్వహణాధికారికి (సీఈఓ) రాసిన లేఖలో, బీఆర్ఎస్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎం.కె. ముజీబుద్దీన్, మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్ మసీఉల్లా ఖాన్, మరియు సీనియర్ నాయకులు ఖాజా బద్రుద్దీన్ తక్షణమే పారదర్శక విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు. అధికారిక వక్ఫ్ రికార్డుల దొంగతనం రాష్ట్రవ్యాప్తంగా వక్ఫ్ ఆస్తుల భద్రత మరియు జవాబుదారీతనంపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుందని, ఇది ప్రజలను తీవ్రంగా కలవరపరిచే అంశమని నాయకులు పేర్కొన్నారు. ఏ ఫైళ్లు దొంగిలించబడ్డాయి మరియు వాటిని తిరిగి పొందేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు అనే దానిపై స్పష్టతనిస్తూ వక్ఫ్ బోర్డు ఒక అధికారిక ప్రకటన విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు వెంటనే చర్యలు తీసుకోకపోతే, పారదర్శకతను పాటించడంలో విఫలమైతే, నిర్లక్ష్యం వహించిన అధికారులను జవాబుదారీగా చేయాలనే డిమాండ్‌తో వక్ఫ్ బోర్డు కార్యాలయం ముందు బీఆర్ఎస్ మైనారిటీ సెల్ ధర్నా (నిరసన) చేస్తుందని కూడా వారు హెచ్చరించారు. "ఇలాంటి సంఘటనలు కప్పిపుచ్చబడకుండా ప్రభుత్వం తప్పక చూడాలి. వక్ఫ్ వ్యవస్థ యొక్క సమగ్రతను ఏ ఖర్చుకైనా కాపాడాలి" అని బీఆర్ఎస్ నాయకులు స్పష్టం చేశారు. సామాజిక ఆస్తులు మరియు రికార్డుల రక్షణ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి వక్ఫ్ బోర్డు తక్షణమే చర్యలు తీసుకోవాలని మైనారిటీ సెల్ కోరింది.

పేట్రేగిపోతున్న కామాంధులు

- పారిశుద్ధ్య కార్మికురాలిపై అత్యాచారం
- బాలికపై సామూహిక అత్యాచారం

హైదరాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) : అత్యాచార ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలోని బోరబండ పోలీస్‌స్టేషన్ పరిధిలో దారుణం జరిగింది. ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై జీహెచ్ఏంసీ పారిశుద్ధ్య కార్మికురాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడో కామాంధుడు. శుక్రవారం తెల్లవారుజామున జరిగిన ఈ ఘటన ఒకరోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రతీరోజు లాగే బాధితురాలు తన విధులను నిర్వహిస్తోంది. ఈ క్రమంలో ఉన్నట్టుండి ఓ వ్యక్తి ఆమెను బలవంతం చేశాడు. ఎర్రగడ్డ ఈఎస్ఐ ఆసుపత్రి సమీపంలోని ఫుట్ ఓవర్ బ్రిడ్జిపై కార్మికురాలిపై రాజు అనే వ్యక్తి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం నిందితుడు అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ దారుణ ఘటనపై బాధిత మహిళ బోరబండ పోలీసులను ఆశ్రయించింది. వెంటనే కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడు రాజును అదుపులోకి తీసుకున్నారు. మద్యం మత్తులో రాజు.. పారిశుద్ధ్య కార్మికురాలిపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. నిందితుడు మోడల్ కాలనీలో ఓ అపార్ట్‌మెంట్‌లో వాచ్మెన్‌గా పని చేస్తున్నట్టు సమచారం. ఇదిలావుంటే ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలంలో దారుణం జరిగింది. బాలిక (13)పై సామూహిక అత్యాచార ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం ప్రకారం మండలంలోని ఓ గ్రామానికి చెందిన బాలికపై అదే గ్రామానికి చెందిన ముగ్గురు అత్యాచారానికి పాల్పడ్డారు. శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఓ బాలుడు వచ్చి 'నీ తమ్ముడు కింద పడిపోయాడు' అని బాలికకు మాయమాటలు చెప్పి ఓ ఇంటి వద్దకు తీసుకెళ్లాడు. ఆ తర్వాత ఇద్దరు బాలురతో కలిసి ఓ యువకుడు.. బాలికపై అత్యాచారానికి పాల్పడ్డారు. బాలిక తల్లిదండ్రులు పని మీద హైదరాబాద్ వెళ్లగా, ఇంట్లో ఉన్న నానమ్మ, తాతయ్య బయటకు వెళ్లారు. బాలిక తల్లి.. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితులపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. నిందితులు పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారికోసం గాలిస్తున్నామని అన్నారు.

వరదల నష్టాన్ని అంచనా వేసి పంపండి

- కలెక్టర్లను ఆదేశించిన సిఎస్

హైదరాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) : ముఖ్యమంత్రి ఆదేశాలకనుగుణంగా మొంథా తుఫాన్ ప్రభావంతో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల జరిగిన నష్టాన్ని అంచనా వేసి వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణారావు జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో నేడు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. విపత్తుల నిర్వహణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు ఈ టెలికాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ రాష్ట్రంలో దాదాపు 24 జిల్లాలు ఈ మొంథా తుఫాన్ కు ప్రభావితమయ్యాయని తెలిపారు. జిల్లాలలో జరిగిన పంట నష్టం తో పాటు, రహదారులు, నీటి వనరులు, పశువులు, ప్రాణ నష్టంతో పాటు ఇతర ప్రాథమిక వివరాలను వెంటనే ప్రభుత్వానికి సమర్పించాలని ఆదేశించారు. అదేవిధంగా ఇటీవల కాలంలో ఏవిధమైన సూచనలు లేకుండా 25 నుండి 30 సెంటీమీటర్ల వర్షపాతం ఆకస్మికంగా కురుస్తోందని, ఈ నేపథ్యంలో అత్యవసర సమయంలో చేపట్టాల్సిన చర్యలపై జిల్లాల వారీగా ముందస్తు ప్రణాళికల ను రూపొందించుకోవాలని సి.ఎస్ సూచించారు. తుఫాన్ ప్రభావంతో ఆయా జిల్లాలలో దెబ్బతిన్న రహదారులు, విద్యుత్ లైన్లు, నీటి వనరులకు తాత్కాలిక పునరుద్ధరణ పనులు ముమ్మరంగా చేపట్టినట్టు అధికారులు పేర్కొన్నారు. ఎక్కడైనా అంగన్వాడీ భవనాలు, పాఠశాల భవనాలు ధ్వంసం అయితే వాటి పునరుద్ధరణకు వెంటనే నిధులు మంజూరు చేస్తున్నట్టు సీఎస్ తెలిపారు. అదే విధంగా తరచుగా ముంపునకు గురయ్యే ప్రాంతాలను గుర్తించి, శాశ్వత పరిష్కార దిశగా చర్యలు చేపట్టాలని, అవసరమైన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపాలని ఆదేశించారు.

డిసెంబర్‌లో డబ్ల్యూటిఐటిసి నూతన కార్యవర్గం ఎన్నిక

- దుబాయ్ వరల్డ్ ట్రేడ్ సెంటర్‌లో 2025 డిసెంబర్‌లో ప్రమాణ స్వీకార వేడుక
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రొఫెషనల్స్, ఇన్నోవేటర్స్, మరియు వ్యాపార నాయకులను ఆహ్వానం.
- నవంబర్ 15 వరకు దరఖాస్తులు స్వీకరణ

హైదరాబాద్ (జనంసాక్షి) : ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక మండలి (డబ్ల్యూటిఐటిసి) తెలుగు మాట్లాడే సాంకేతిక నిపుణులు మరియు వ్యాపారవేత్తలను ప్రాతినిధ్యం వహించే అంతర్జాతీయ సంస్థ 2026 నాయకత్వ స్థానాల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రకటించింది. ప్రస్తుత నాయకత్వ కాలం ముగియనుండగా డబ్ల్యూటిఐటిసి నూతన అంతర్జాతీయ నాయకత్వ బృందాన్ని ఆహ్వానించేందుకు సిద్ధమవుతోంది. ఈ కొత్త బృందం ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు టెక్నోక్రాట్లకు ప్రాతినిధ్యం వహించనుంది. కొత్తగా నియమించబడిన ఇంటర్నేషనల్ చాప్టర్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, మరియు కార్యదర్శులు తమ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని 2025 డిసెంబర్‌లో దుబాయ్, యూఏఈలో జరగనున్న ప్రపంచ తెలుగు సమాచార సాంకేతిక సదస్సు సందర్భంగా నిర్వహించనున్నారు. దుబాయ్‌లో జరగబోయే ఈ సదస్సు, తెలుగు సాంకేతిక నిపుణులు, వ్యాపార వ్యవస్థాపకులు, ఇన్నోవేటర్లలో పెద్దది, ప్రతిష్టాత్మకమైనదిగా ఉండనుంది. గతంలో సింగపూర్‌లో జరిగిన ఈ గ్లోబల్ ఈవెంట్‌లో 100కి పైగా దేశాల నుండి వచ్చిన 3,000కు పైగా ప్రొఫెషనల్స్ పాల్గొన్నారు. తెలుగు ప్రతిభ, టెక్నాలజీ, మరియు వ్యాపార వైభవాన్ని అంతర్జాతీయ వేదికపై ఆ సందర్భంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా డబ్ల్యూటిఐటిసి చైర్మన్ సందీప్ కుమార్ మక్తాలా మాట్లాడుతూ డబ్ల్యూటిఐటిసి 2026 అంతర్జాతీయ చాప్టర్స్‌కు నామినేషన్లు ఆహ్వానిస్తున్నామని ప్రకటించడం మాకు గర్వంగా ఉంది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు సాంకేతిక నిపుణులు, వ్యాపారవేత్తలు, నాయకులు అందరికీ అంతర్జాతీయ నెట్‌వర్క్‌లో భాగమయ్యే అద్భుత అవకాశం. కొత్త చాప్టర్ నాయకులు ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రొఫెషనల్స్‌ను కలుపుతూ, ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూ, భారతదేశం మరియు గ్లోబల్ టెక్ కమ్యూనిటీ మధ్య సహకారాన్ని పెంపొందించడంలో కీలక పాత్ర పోషించనున్నారు. దుబాయ్‌లో జరగబోయే గ్రాండ్ ప్రమాణ స్వీకార వేడుక, డబ్ల్యూటిఐటిసికే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు టెక్నోక్రాట్లందరికీ గర్వకారణమైన చారిత్రాత్మక ఘట్టంగా నిలుస్తుందని పేర్కొన్నారు. డబ్ల్యూటిఐటిసికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రొఫెషనల్స్, వ్యాపారవేత్తలు, ఇన్నోవేటర్లు, పరిశోధకులు, టెక్నాలజీ సంస్థలను నాయకత్వ పదవులకు దరఖాస్తు చేయడానికి లేదా గ్లోబల్ కౌన్సిల్ సభ్యులుగా చేరడానికి ఆహ్వానిస్తోందని, డబ్ల్యూటిఐటిసిలో భాగమవడం ద్వారా వ్యక్తులు మరియు సంస్థలు అంతర్జాతీయ నిపుణులతో కలవడం, ప్రపంచవ్యాప్త వ్యాపార అవకాశాలను అన్వేషించడం, అలాగే టెక్నాలజీ మరియు ఆవిష్కరణ రంగాల్లో తెలుగు ప్రతిభను గౌరవించే గ్లోబల్ ఉద్యమంలో భాగస్వాములవడం సాధ్యమవుతుందని తెలిపారు. నవంబర్ 15వ తేదీన వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థుల కోసం నమోదు మరియు నామినేషన్ లింక్ డబ్ల్యూటిఐటిసి అధికారిక వెబ్‌సైట్ **www.wtitc.org** లో అందుబాటులోకి వస్తుంది. మరిన్ని వివరాలు డబ్ల్యూటిఐటిసిలో +91 81231 23434 (భారతదేశం) +971 56577 8923 (యూఏఈ) సంప్రదించవచ్చు. హైదరాబాద్‌లో ప్రధాన కార్యాలయం కలిగిన డబ్ల్యూటిఐటిసి 60కి పైగా దేశాల నుండి టెక్నాలజీ నిపుణులు, సంస్థలు, స్టార్టప్‌లను కలిపి, సేంకేతిక నైపుణ్యాలను, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు, అంతర్జాతీయ భాగస్వామ్యాలను పెంపొందించే వేదికను సృష్టిస్తోంది. 2026 అంతర్జాతీయ చాప్టర్ నియామకాలు మరియు దుబాయ్‌లో జరగబోయే ఘన ప్రమాణ స్వీకార వేడుకతో, డబ్ల్యూటిఐటిసి తన ఆవిష్కరణాత్మక, భవిష్యత్తుకి సిద్ధమైన గ్లోబల్ తెలుగు టెక్నాలజీ కమ్యూనిటీ నిర్మించడానికి తన మిషన్‌ను కొనసాగిస్తోంది.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
2 నవంబర్ 2025

అదే గడ్చిరోలి, అవే రాజకీయాలు – ఎంత తేడా?!

మహారాష్ట్రలోని మారుమూల జిల్లా గడ్చిరోలి అనేక కారణాల వల్ల వార్తల్లో ఉంటున్నది. ఇప్పుడు మాత్రమే కాదు, కనీసం నలభై ఐదు సంవత్సరాలకు పైగా గడ్చిరోలి ఒక సంచలనాత్మక డేట్ లైన్.

తెలంగాణకు ఒకపక్క ప్రాణహిత, మరొకపక్క గోదావరి సరిహద్దులుగా ఉన్న ఈ ఆదివాసి జిల్లా పూర్తిగా అడవులతో, కొండలతో నిండి ఉండి, నాలుగు దశాబ్దాలకు పైగా విప్లవోద్యమానికి కేంద్రంగా ఉండింది. ప్రాణహిత దాటి ఈ జిల్లా (అప్పటికి అది చంద్రపూర్ జిల్లాలో భాగం) లోకి ప్రవేశించడానికి ప్రయత్నించిన విప్లవోద్యమ నాయకుడు పెద్ది శంకర్ ను 1980 నవంబర్ లో బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపినప్పటి నుంచి మొన్న అక్టోబర్ 15న పోలీసు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన భారీ సభలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ 'గడ్చిరోలిలో మావోయిజం అంతానికి చివరి అధ్యాయం ప్రారంభమయింది' అని ప్రకటించినదాకా చరిత్ర చాలా దూరం ప్రయాణించింది. చరిత్రలో చాలా నెత్తురూ కన్నీళ్లూ, త్యాగాలూ ద్రోహాలూ ప్రవహించాయి.

ఆ భారీ సభ ఒకప్పటి మావోయిస్టు పార్టీ అగ్రనాయకుడు మల్లోజుల వేణుగోపాల్, అరవై మంది సహచరులతో సహా లొంగిపోయిన సందర్భంగా ఏర్పాటయినది. ఇండియన్ ఎక్స్ ప్రెస్ వార్త ప్రకారం ముఖ్యమంత్రి ఫడ్నవీస్ చేసిన సుదీర్ఘ ప్రసంగంలో రాజ్యాంగం, ఆదివాసుల హక్కులు, అభివృద్ధి, దారి తప్పిన యువత సమానత్వ ఆదర్శం వంటి ఆసక్తికరమైన విషయాలు ఎన్నో ఉన్నాయి.

వేణుగోపాల్ కు ఉద్యమకాలంలో ఉండిన అనేక పేర్లలో ఒకటైన భూపతి అనే పేరు ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి, ఆయన పొలిట్ బ్యూరో, కేంద్ర కమిటీ సభ్యుడు మాత్రమే కాక, ఈ జిల్లాలోని అహెరి, సిరొంచలలో మొట్టమొదట దళాల నిర్మాణానికి నాయకత్వం వహించినప్పటి నుంచీ ఇక్కడే ఉన్నాడని అన్నాడు. "ముఖ్యమంత్రి ముందు లొంగిపోవాలని ఆయన కోరిక అని పోలీసు అధికారులు నాకు చెప్పినప్పుడు, దాని కోసం నేను అడవిలోకి అయినా వెళ్తానన్నాను. కాని పోలీసులు వారిని ఇక్కడికే తెచ్చారు. నేను నా కార్యక్రమాలన్నీ రద్దు చేసుకుని హుటాహుటిన ఇక్కడికి వచ్చాను" అన్నాడు. ఆ సభలో లొంగిపోయిన వారందరికీ ఆయన రాజ్యాంగ ప్రతులు ఇచ్చాడు.

ముఖ్యమంత్రి తన రాజకీయ జీవితంలో ఆ రాజ్యాంగం మీద చాలాసార్లే ప్రమాణం చేసి ఉంటాడు గాని, అది ఎప్పుడైనా చదివాడో లేదో తెలియదు. అందులో ఐదో షెడ్యూల్ ఆ గడ్చిరోలి ఆదివాసులకు కొన్ని హక్కులు ఇచ్చిందని, వాటిని గత ఏడున్నర దశాబ్దాలలో తన ప్రభుత్వంతో సహా ఏ ఒక్క ప్రభుత్వమూ అమలు చేయలేదని ఆయనకు ఎవరైనా చెపితే బాగుండును. ఆ రాజ్యాంగంలోనే ఒక అధికరణం చట్టం ఎదుట భారత పౌరులందరూ సమానమని చెప్పిందని, మరొక అధికరణం అసమానతలు పెరగకుండా, సంపద కొందరి దగ్గర పోగుపడకుండా పాలన నడపడం ప్రభుత్వ విధి అని నిర్దేశించిందని కూడా ఆయన తెలుసుకుంటే బాగుండును. ముఖ్యమంత్రికి, ఆయన సమక్షంలోనే లొంగిపోతానని కోరుకున్న వేణుగోపాల్ కు ఇప్పుడు కనీసం ఆ మూడు రాజ్యాంగ అంశాలు గుర్తు చేయడం అవసరం అనిపిస్తున్నది.

ఐదో షెడ్యూల్ ను ఎప్పుడూ సక్రమంగా అమలు చేయకపోవడం మాత్రమే కాదు, దాని స్ఫూర్తిని ఎంతో కొంత అనుసరించి తయారైన పంచాయత్ ఎక్స్ టెన్షన్ టు షెడ్యూల్డ్ ఏరియాస్ చట్టం (పెసా), అటవీ హక్కుల చట్టం (ఎఫ్ ఆర్ ఎ) లలో ఉన్న ఆదివాసుల రక్షణలను కూడా ప్రభుత్వాలు ఎప్పుడూ అమలు చేయలేదు. అవి అమలు చేయాలనే చిత్తశుద్ధి ఉంటే, ఆదివాసుల గ్రామసభల అనుమతి లేకుండా అడవిలో నిర్మాణాలు చేయడం, వేలాది ఎకరాల అడవిని కార్పొరేట్లకు అప్పగించడం జరగనే జరగదు.

మిగిలినవన్నీ అలా ఉంచి ఇటీవలనే, 2025 మేలో, ఒకవైపు ఈ అడవుల నుంచి మావోయిస్టులను, ఆదివాసులను వెళ్లగొట్టడానికి ప్రయత్నిస్తూ, మరొకవైపు ఇదే ఫడ్నవీస్ ప్రభుత్వం గడ్చిరోలీ జిల్లా గనుల తవ్వకపు ప్రాధి కార సంస్థను ఏర్పాటు చేసి, లాయిడ్ స్టీల్ కు 2,324 ఎకరాల అడవిని అప్పగి ంచింది. ఒక లక్షా ఇరవై మూడు వేల చెట్లను నరికివేసి ఖనిజశుద్ధి కర్మాగారం ఏర్పాటు చేసుకోవడానికి అనుమతించింది. అంతకు ముందే, 2007లో గనుల తవ్వకానికి ఇచ్చిన వెయ్యి ఎకరాలకు ఇది అదనం. ఈ అడవుల పందారం కచ్చితంగా రాజ్యాంగానికీ, పెసాకూ, ఎఫ్ఆర్ఎకూ వ్యతిరేకం.

ఆ రాజ్యాంగ వ్యతిరేక, చట్ట వ్యతిరేక కార్యకలాపం గురించి ముఖ్యమంత్రి లొంగుబాటు సభలో సగర్వంగా చెప్పుకున్నాడు! బహుళజాతి సంస్థ లాయిడ్ మూడు లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడి పెట్టడానికి సిద్ధంగా ఉన్నదనీ, గడ్చిరోలిని స్టీల్ హబ్ గా మారుస్తామనీ అన్నాడు. "లాయిడ్స్ స్టీల్ కు చెందిన ప్రభాకరన్ గారితో నేను మాట్లాడాను. మీరు ఇష్టపడితే ఆయన తన కంపెనీలో మీకు శిక్షణ, ఉద్యోగాలు ఇస్తామని అన్నారు" అని కూడా ఆయన లొంగిపోయిన మావోయిస్టులకు చెప్పాడు. వేణుగోపాల్ ను లాయిడ్ బ్రాండ్ అంబాసడర్ గా నియమిస్తామని ప్రభాకరన్ అన్నారని వార్తలు వచ్చాయి. వేణుగోపాల్ అందుకు ఒప్పుకున్నాడో లేదో తెలియదు కాని ఒప్పుకుంటే మాత్రం ఎవరికి వ్యతిరేకంగా ఇరవై ఏళ్లుగా పోరాడాడో, పోరాటానికి నాయకత్వం వహించాడో వారికే ప్రచారకర్తగా మారుతాడన్నమాట! ఇప్పటికే లొంగిపోయిన మావోయిస్టులు కొందరు లాయిడ్ ఉద్యోగులుగా ఉన్నారని, ఒకప్పుడు వేణుగోపాల్ సహాయకుడిగా ఉండిన వ్యక్తి లొంగిపోయి, లాయిడ్ ఉద్యోగిగా, ప్రస్తుత లొంగుబాటుకు చక్రం తిప్పాడని కూడా వార్తలు వచ్చాయి.

ఈ గడ్చిరోలి లొంగుబాటుదారులను పదిహేను రోజుల పాటు ఇంటరాగేట్ చేస్తామని, వారు ఇచ్చిన సమాచారాన్ని యథాతథంగా నమ్మకుండా ధృవీకరించుకుని కేంద్ర హోమ్ మంత్రిత్వ శాఖకు పంపుతామని కూడా ముఖ్యమంత్రి అన్నాడు. ఆ గడువు అయిపోయింది గనుక ఇంకా ఇంటరాగేషన్ ప్రక్రియ సాగుతున్నదో, ఆ తర్వాత వారి మీద కేసులకు విచారణ ప్రారంభిస్తారో (వేణుగోపాల్ మీద 79 కేసులున్నాయని అక్కడే చెప్పారు!), విచారణ కోసం జైలుకు పంపుతారో, ఊరికే వదిలేస్తారో తెలియదు.

లొంగిపోయినప్పటికీ కొందరు కర్నాటకలో ఇప్పటికి రెండు సంవత్సరాలుగా జైళ్లలో మగ్గుతున్నారు. శ్రీకాకుళం జిల్లాకు చెందిన దున్నా కేశవరావు లొంగిపోయిన తర్వాత కూడా పాత తప్పుడు కేసులకు పదిహేను సంవత్సరాలుగా జైలులోనే ఉన్నాడు.

గడ్చిరోలి లొంగుబాటుదారులకు లాయిడ్ ఉద్యోగాలు ఇస్తానంటున్నది గనుక వీరిని బహుశా బైటికి వదులుతారనే అనుకోవాలి. "లొంగిపోయి తప్పు చేశామా అనే విచారం కలగకుండా ప్రభుత్వం మిమ్మల్ని చూసుకుంటుంది" అని కూడా ముఖ్యమంత్రి అన్నాడు.

ఈ నేపథ్యంలో గడ్చిరోలికే సంబంధించిన మరొక రెండు ఉదంతాలు చెప్పాలి.

ఒకటి ఆదివాసి మహిళ పార్వతి సడ్మెక్ గురించినది. ఆమె వయసు ముప్పై సంవత్సరాలు. గడ్చిరోలి జిల్లా భామ్రాగడ్ తాలూకా మద్వెలి అనే కుగ్రామానికి చెందిన పార్వతిని మావోయిస్టులతో సంబంధాల ఆరోపణతో 2018లో అరెస్టు చేశారు. ఆరు సంవత్సరాలుగా ఆమె జైలులోనే ఉంది. ఆమె మీద ఐదు కేసులు పెట్టగా, నాలుగు కేసులను కింది కోర్టులే కొట్టివేసి, ఆమెను నిర్దోషిగా ప్రకటించాయి. ఒక కేసులో కింది కోర్టు పది సంవత్సరాల శిక్ష విధించింది గాని, ఆ శిక్షను కొద్ది నెలల కింద బొంబాయి హైకోర్టు నాగపూర్ బెంచ్ కొట్టివేసింది. అంటే ప్రభుత్వం ఏ నేరారోపణలతో ఆమెను అరెస్టు చేసి ఆరు సంవత్సరాలకు పైగా జైలులో నిర్బంధించిందో, ఆ ఆరోపణలేవీ రుజువు కాలేదు. ఆమె నిర్దోషిగా విడుదల కావలసి ఉండింది. మావోయిజం అంతానికి ఆరంభం జరిగిందని ముఖ్యమంత్రి ప్రకటించిన పదిహేను రోజులకు ఈ మావోయిస్టుగా నిరూపితం కాని ఆదివాసి మహిళ విడుదల కావలసింది. అక్టోబర్ 30న ఆమె విడుదల జరుగుతుందని ఆమె భర్త బిర్జు పొంగటి (ఆయన కూడా యాభై అక్రమ కేసులతో 13 సంవత్సరాలు జైలులో ఉండి, 49 కేసులు కొట్టివేయబడి, ఒక కేసులో బెయిల్ మీద బైట ఉన్నాడు) నాగపూర్ జైలు గేటు ముందు ఉండగా, ఆమె బైటికి రాగానే మఫ్టీలో ఉన్న కొందరు ఆమెను బలవంతాన ఒక పోలీసు వాహనం లాంటి దాంట్లో ఎక్కించుకుని తీసుకుపోయారు. వాళ్లు పోలీసులా, అయితే యూనిఫాంలో ఎందుకు లేరు, అది అరెస్టా, కేసు ఏమిటి, పక్కనే ఉన్న భర్తకు చట్టప్రకారం వివరాలు అందించాలి గదా వంటి రాజ్యాంగ, చట్ట వ్యవహారాలు ముఖ్యమంత్రి తెలుసుకుంటే బాగుండు. తన భార్యను ఎత్తుకుపోతున్న వారిని బిర్జు ఆ చట్టపరమైన వివరాలు అడిగాడు. కాని వారి నుంచి జవాబు లేదు.

ఆమె న్యాయవాది ఆకాశ్ సోర్దే వెంటనే స్థానిక పోలీసు స్టేషన్ కు వెళ్లి ఈ అపహరణ మీద ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఎఫ్ఐఆర్ రాయడానికి నిరాకరించారు. అప్పుడు ఆ న్యాయవాది ఆ సాయంత్రం లోపు పార్వతిని ఇంటికి పంపకపోతే హైకోర్టులో హెబియస్ కార్పస్ వేస్తానని పోలీసు ఉన్నతాధికారులను, భామ్రాగడ్ పోలీసు అధికారిని హెచ్చరించాడు. ఆ రాత్రి భామ్రాగడ్ పోలీసులు బిర్జుకు ఫోన్ చేసి, ఆమె నాగపూర్ జైలు నుంచి 150 కి.మీ. దూరంలోని చంద్రపూర్ జిల్లా బెంగాలీ క్యాంప్ పోలీసు స్టేషన్ లో ఉన్నదని, వచ్చి తీసుకుపోవచ్చునని చెప్పారు. తన ప్రభుత్వ పోలీసులు చేసిన ఈ అక్రమ అపహరణను తాను బహూకరించిన రాజ్యాంగం ఎలా అనుమతిస్తుందో ఫడ్నవీస్ చెప్పాలి.

ఇక మరొక ఘటన, లాయిడ్ కంపెనీకి చెందిన వాహనాల దగ్ధం కేసుకు సంబంధించినది. లాయిడ్ కంపెనీకి సుర్జాఘర్ గనులు తవ్వుకోవడానికి 2007లో ప్రభుత్వానుమతులు దొరికితే, ఆదివాసుల ప్రతిఘటన వల్ల, విప్లవోద్యమం వల్ల లాయిడ్ అక్కడ ప్రవేశించలేకపోయింది. ఉద్యమం మీద నిర్బంధకాండ పెరిగిన తర్వాత, 2016లో అక్కడ తవ్వకాలు ప్రారంభించింది. ఆదివాసులు, మావోయిస్టులు లాయిడ్ కు చెందిన 80 వాహనాలను, ట్రక్కులను, ఎర్త్ మూవర్లను 2016 డిసెంబర్ లో తగులబెట్టడంతో గనుల తవ్వకం మళ్లీ ఆగిపోయింది. ఆ వాహనాల దహనం మీద వందలాది మంది ఆదివాసుల మీద కేసులు బనాయించారు. భీమా కోరేగామ్ కేసులో జూన్ 2018లో అరెస్టయిన న్యాయవాది సురేంద్ర గాడ్లింగ్ పేరు, ఆగస్ట్ 2018లో అరెస్టయిన వరవరరావు పేరు వారు జైలులో ఉండగానే ఈ కేసులో నిందితులుగా 2019 జనవరిలో చేర్చారు. ఆ కేసులో వరవరరావుకు అతి కష్టం మీద బెయిల్ వచ్చింది గాని, సురేంద్ర గాడ్లింగ్ బెయిల్ ఇప్పటికి ఎన్నోసార్లు తిరస్కరించబడి, ఇప్పుడు హైకోర్టు ముందు ఉంది.

పోరాటానికి నాయకులుగా ఉండి, లొంగిపోయినవారి మీదనేమో కేసులే లేవు. ఎవరి మీద పోరాడారో వారిదగ్గర ప్రచారకర్తలుగా చేరవచ్చు. ఆ ప్రాంతానికే చెందిన ఆదివాసి మహిళ మీద వేధింపులు ఆగిపోవు. ఆ ప్రాంతానికి ఎన్నడూ వెళ్లని వారి మీద అక్రమ కేసులు, వేధింపులు కొనసాగుతాయి. ఎన్ని విచిత్రాలు, వైరుధ్యాలు సజావుగా సాగిపోతున్నాయి!!

ఎన్ వేణుగోపాల్
కవి, సాహిత్య విమర్శకుడు, పాత్రికేయుడు, ప్రజా వక్త, వ్యాఖ్యాత, రాజకీయ, ఆర్థిక,సామాజిక అంశాలపై కాలమిస్ట్.

కామ్రేడ్ 'దివ్య గౌతమ్'ని గెలిపించాలి

ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎ.ఐ.ఎస్.ఎ) మాజీ నాయకురాలు, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ – లెనినిస్ట్) లిబరేషన్ నాయకురాలు కామ్రేడ్ దివ్య గౌతమ్ బిహార్ అసెంబ్లీ ఎన్నికల బరిలో బరిలో నిలవడం విశిష్ట ప్రాధాన్యం సంతరించుకుంది. భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ – లెనినిస్ట్) లిబరేషన్ ప్రకటించిన 20 మంది సభ్యుల జాబితాలో ఆమె ఏకైక మహిళా అభ్యర్థి కావడం గమనార్హం. బిహార్ రాష్ట్రం పాట్నాలో 2008 నుండి ఉనికిలోకి వచ్చిన అతి పెద్ద అసెంబ్లీ నియోజకవర్గం అయిన దిఘా అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఆమె భారతీయ జనతా పార్టీకి చెందిన సిట్టింగ్ ఎం.ఎల్.ఎ సంజీవ్ చౌరాసియాతో ప్రధాన ప్రత్యర్థిగా బరిలో తలపడుతును న్నారు. దివ్య గౌతమ్ విద్యార్థి రాజకీయాల నుండి ప్రధాన రాజకీయాలలోకి ప్రవేశించమే కాకుండా నేడు ఎం.ఎల్.ఎ గాను బరిలో నిలిచి దిఘా అసెంబ్లీ నియోజకవర్గంలోని యువ ఓటర్లను ముఖ్యంగా మహిళలను అత్యధికంగా ఆకర్షిస్తున్నారు.

దివ్య గౌతమ్ చిన్ననాటి నుండి ఎల్లప్పుడూ సామాజిక సేవా కార్యక్రమాల్లో తలమునకలు అయ్యారు. నేడు ఆమె వామపక్ష ఉద్యమాలలో చురుకుగా ఉద్యమిస్తున్నారు. దివ్య గౌతమ్ పాట్నా విశ్వవిద్యాలయం తో అనుబంధంగా ఉన్న పాట్నా కళాశాల నుండి జర్నలిజం మరియు మాస్ కమ్యూనికేషన్లో బ్యాచిలర్ డిగ్రీతో పాటు అదే జర్నలిజం మరియు మాస్ కమ్యూనికేషన్లో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీని పూర్తిచేసి అదే సంస్థలో గెస్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్గా మూడున్నర ఏళ్లుగా పనిచేశారు.

దివ్య గౌతమ్ తన మాస్ కమ్యూనికేషన్ అధ్యయనాల సమయంలో 'తన విభాగంలో మెరుగైన కెమెరాలు, స్టూడియోలు, సరైన లైబ్రరీ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలి' అని డిమాండ్ చేసి విద్యార్థులను ఉద్యమింపజేశారు. టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ నుండి మహి ళా అధ్యయనాలలో కూడా ఆమె మాస్టర్స్ డిగ్రీని కలిగి ఉన్నారు. ఆమె ప్రస్తుతం బిట్స్ పిలానీలో జెండర్ అండ్ కమ్యూనికేషన్లో పిహెచ్.డి చేస్తున్నారు. జెండర్ మరియు కమ్యూనికేషన్, సబాల్టర్న్ అధ్యయనాలు, సినిమా సంబంధిత రంగస్థలం, డాక్యుమెంటరీ తయారీ మరియు జానపద మరియు సంస్కృతి పరిశోధన అధ్యయనాల పట్ల ఆమె ప్రత్యేక ఆసక్తులు కలిగి ఆ దిశగా ముందును సాగుతున్నారు.

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ – లెనినిస్ట్) లిబరేషన్ విద్యార్థి విభాగం అయిన ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎ.ఐ.ఎస్.ఎ) తో భాగంగా దివ్య గౌతమ్ 2011 నుండి అనేక ఉద్యమాలు చేశారు. విద్యార్థి ఉద్యమాలతో పాటుగా మహిళా సమస్యలపై కూడా ఆమె తీవ్రంగా ఉద్యమించారు. పాట్నా విశ్వవిద్యాలయంలో 2012 లో జరిగిన విద్యార్థి సంఘం ఎన్నికల్లో అధ్యక్ష పదవికి ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఎ.ఐ.ఎస్.ఎ) తరపున దివ్య గౌతమ్ పోటీ చేశారు. కాని ఆమె తన సమీప ప్రత్యర్థి అయిన ఎ.బి.వి.పి అభ్యర్థి ఆశిష్ సిన్హా చేతిలో స్వల్ప తేడాతో ఓడిపోయారు. 'డబ్బు, అధికారం మరియు ప్రతికూల సమీకరణ మొదలైనవి ఎన్నిక ఫలితాన్ని వంచించినాయి' అని ఆమె పేర్కొనడాన్ని గమనించవచ్చు. ఆ తదానంతరం ఆమె భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ – లెనినిస్ట్) లిబరేషన్ లో చేరారు.

దివ్య గౌతమ్ బిహార్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా ప్రభుత్వ ఆహార మరియు వినియోగదారుల రక్షణ విభాగంలో సరఫరా ఇన్స్పెక్టర్గా ఎంపికైననూ ఆమె సామాజిక సేవ లక్ష్యంగా తన రాజకీయ ప్రయాణంపై దృష్టి పెట్టడం మూలంగా ఆ ఉద్యోగంలో చేరడానికి నిరాకరించారు. 'నేను ఉద్యోగం చేస్తూ ఈ రాజకీయ ప్రపంచాన్ని విడిచిపెట్టడం అంటే నేను ప్రజా సమస్యలపై స్పందించకపోవడమే అవుతుంది. అందువలన స్పందించాల్సిన సమయంలో స్పందించలేదు అనే విచారం నాలో ఉండకూడదు' అని ఆమె పేర్కొనడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు. నేడు ఆమె కమ్యూనిస్టు రాజకీయాలలో నిత్యనూతనంగా ఉద్యమిస్తూనే ఉన్నారు.

విద్యావేత్త, యువ విప్లవ కమ్యూనిస్టు నాయకురాలు దివ్య గౌతమ్ 'ప్రముఖ బాలీవుడ్ సినీ నటుడు దివంగత సుశాంత్ సింగ్ రాజ్పుత్కు బంధువు కావడం గమనార్హం. 'సుశాంత్ సింగ్ రాజ్పుత్ మాకు బంధువు అయినందుకు నేను కృతజ్ఞురాలిని. నేను చిన్నప్పటి నుండి రంగస్థల నటిగా ఉన్నాను. సుశాంత్ సింగ్ రాజ్పుత్తో నాకున్న అనుబంధం నా ప్రదర్శన కళలలోనూ మరియు నేను రాజకీయాల్లోకి ప్రవేశించడానికి ప్రత్యేకమైన నేపథ్యాన్ని మాత్రమే సమకూర్చాయి. ఇతర రాజకీయ పార్టీలు ఆరోపిస్తున్నట్లుగా నేను విద్యార్థి సంఘం ఎన్నికల్లో పోటీ చేసినప్పుడు గాని, అలాగే నా రాజకీయాల్లో గాని సుశాంత్ సింగ్ రాజ్పుత్ పేరుని ఏనాడు ఏవిధంగాను ఉపయోగించలేదు. ముఖ్యంగా చెప్పాలంటే ఆయన బంధుప్రీతి వల్ల నేను ప్రసిద్ధి చెందలేదు. సుశాంత్ సింగ్ రాజ్పుత్ కేవలం కష్టపడి పనిచేయడం వలన ప్రసిద్ధి చెందాడు. నేను కూడా ఆయనలాగే స్వంతంగా కష్టపడి ఉద్యమిస్తున్నాను' అని దివ్య గౌతమ్ పేర్కొనడాన్ని ప్రత్యేకంగా గమనించవచ్చు.

దివ్య గౌతమ్ భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ – లెనినిస్ట్) లిబరేషన్ పార్టీలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని పదులపరచుకున్నారు. బి.జె.పి సిట్టింగ్ ఎం.ఎల్.ఎ సంజీవ్ చౌరాసియా ఈ దిఘా అసెంబ్లీ నియోజకవర్గాన్ని ఏనాడు పట్టించుకోలేదు, పెద్దగా ఒరగబెట్టింది ఏమి లేదు' అని ఆమె బి.జె.పి అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై తనదైన శైలిలో విమర్శలు చేయడాన్ని సునిశితంగా గమనించచ్చు. రాజకీయాల్లో మహిళల ప్రాతినిధ్యం తక్కువగా ఉండడాన్ని ఆమె తీవ్రంగా నిరశిస్తున్నారు. 'మేము ప్రజా సమస్యలపై పోరాడుతూనే ప్రజలకు మరింతగా చేరువ అవుతూనే ఉన్నాం. మాపై ప్రజలకు విశ్వాసం ఉంది' అని ఆమె పేర్కొనడాన్ని బట్టి ఆమె తప్పకుండా విజయం సాధించనున్నారు అని చెప్పవచ్చు. అంతిమంగా భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్ – లెనినిస్ట్) లిబరేషన్ ద్వారా శ్రామిక జనావళి గొంతుకగా అహర్నిశలు ఉద్యమిస్తున్న దివ్య గౌతమ్ శాసన సభ్యురాలుగా విజయం సాధించాలి' అని ఆకాంక్షిస్తున్నాను.

జె.జె.సి.పి.బాబూరావు
రీసెర్చ్ స్కాలర్
సెల్: 94933 19690

కార్పొరేట్-హిందుత్వ ఫాసిజాన్ని కూల్చివేయాలి



డిసెంబర్ 6న హైదరాబాదులో జరిగే ఫాసిస్టు వ్యతిరేక సదస్సును జయప్రదం చేయండి!మతం పేరుతో దేశాన్ని మూగబరుస్తున్న బీజేపీ విధానాలను ఖండించండి

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పెంచి పోషిస్తున్న కార్పొరేట్ దోపిడీ మరియు మత మూఢత్వపు ఫాసిస్టు కుమ్మక్కును తీవ్రంగా ఖండిస్తోన్నది. భారతదేశంలో దాని రాజకీయ గురువు అయిన ఆర్ఎస్ఎస్ ఆదేశాలకు అనుగుణంగా దేశ సంపద ఆశ్రిత పెట్టుబడి దారుల పరమవుతున్నది. నెహ్రూ ఆర్థిక విధానాలను త్రోసి వేసి సంక్షేమ సంఘం చాటున ఆశ్రిత పెట్టుబడిదారీ విధానం వైపు ఎర్రి వేగంతో భారతదేశం పరుగులు తీస్తున్నది. నెహ్రూ ఆర్థిక విధానా ల ఫలిత ంగా భారీ పరిశ్రమలు అయినటువంటి వాటిని ప్రభుత్వ రంగంలో ఉంచగా నేడు వాటినన్నటినీ ప్రైవేటు పరం చేస్తున్నారు. విమానాశ్రమాలు, రోడ్లు, రైల్వేలు, ఓడరేవులు, ఉక్కు పరిశ్రమలు, లాభాల నడుస్తున్న ఎల్ఐసి, బ్యాంకులు ప్రైవేటీకరణ, ఒకటేమిటి అన్ని రంగాలను ఆశ్రిత పెట్టుబడి దారులైన అంబానీ ఆదానిలకు అప్పజెప్పటానికి పూనుకున్నది. అమెరికా ఆధీనంలోని ప్రపంచ బ్యాంకు,ఐఎంఎఫ్, డబ్ల్యూటీవో ఆదేశాలకు అనుగుణంగా అమెరికా సామ్రాజ్యవాదులకు జూనియర్ భాగస్వామిగా ప్రయాణిస్తున్నది.

25 లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడిదారులు బ్యాంకులకు ఎగవేస్తే ప్రభుత్వమే పెద్ద రక్షణగా ఉన్నది. ఇందిరా గాంధీ టైంలో అత్యవసర పరిస్థితి కాలంలో రాజభరణాల రద్దు, బ్యాంకులు జాతీయకరణ, భూసంస్కరణల చట్టాలు ప్రజల పోరాట ఫలితంగా వచ్చాయి. కానీ నేటి నరేంద్ర మోడీ మతోన్మాదాన్ని రెచ్చగొడుతూ భారత రాజ్యాంగ లౌకిక స్వభావాన్ని వంటగలుపుతూ బ్యాంకులను ప్రైవేటీకరణ చేస్తున్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది ఎకరాలు భూములన్నిటికి కూడా కార్పొరేట్లకు అప్పచెబుతున్నారు. జీఎస్టీ పేరుతో రాష్ట్రాల ఆర్థిక స్వరూపాన్ని మార్చి, గణతంత్ర స్వభావానికి తూట్లు పొడిచారు. మూడు నాలుగు కార్మిక స్మృతులు, మూడు, వ్యవసాయ నల్ల చట్టాలు తీసుకొచ్చారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఒకటేమిటి అన్ని రంగాలు ఆశ్రిత పెట్టుబడిదారుల గుజరాతీల పరం అవుతున్నాయి.

నేడు భారతదేశం ఒక ప్రమాదకరమైన మలుపు వద్ద నిలిచింది .గత పది సంవత్సరాలుగా పైగా మోదీ పాలన భారతదేశాన్ని దోపిడీ మరియు కార్పొరేట్ కాషాయ సామాజిక మతవాద మాయాజాలానికి ప్రయోగశాలగా మార్చింది. దేశ సంపదను బడా కంపెనీలు బహిరంగంగా దోచుకుంటుంటే, ప్రజలను హిందుత్వం అనే విషపూరిత సిద్ధాంతంతో మత్తెక్కిస్తున్నారు. ఆర్ఎస్ఎస్ ఆదేశాలకు అనుగుణంగా, ఆర్ఎస్ఎస్ మద్దతుతో పాలక వర్గం ఆర్థిక అసమానతపై ఉన్న ప్రజల ఆగ్రహాన్ని మత విద్వేషం వైపుకు మళ్లించే కళను నేర్చుకుంది. "హిందూ రాష్ట్రం" లేదా హిందూ రాజ్యం" అనే మాయాజాలాన్ని సృష్టించి, కార్పొరేట్ లకు ప్రజల సంపదను దోచిపెడుతున్నది. "భారత మాతా కి జై" అనే నినాదాల వెనుక, బీజేపీ ప్రభుత్వం దేశ సంపదను తన పెట్టుబడిదారుల మిత్రులకు కానుకగా ఇస్తోంది. ₹ 25 లక్షల కోట్ల కార్పొరేట్ రుణ మాఫీ ముఖ్యంగా ఆదానీ, అంబానీ లాంటి పారిశ్రామిక సామ్రాజ్యా లకు లభించిన ఈ బహుమతి ఈ ప్రభుత్వ అసలైన స్వరూపాన్ని బయటపెడుతోంది: ప్రజల నమ్మకంతో ఏర్పడిన ఎల్ఐసీ వంటి సంస్థలు ఇప్పుడు పాలక వర్గాల దోపిడీ ఆశలకు పునాదిగా మారాయి. ఈలోగా సాధారణ ప్రజలు నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, అప్పు, అణచివేతలతో బిక్కుబిక్కు మంటూ జీవిస్తున్నారు.

ఇంకా ప్రమాదకరమైనది ప్రజల నిశ్శబ్దం ఇది సహజమైనది కాదు, సృష్టించబడినది. బీజేపీ మరియు ఆర్ఎస్ఎస్ తమ భావజాల ప్రచారం ద్వారా ప్రజల మనసుల్లో "హిందుత్వానికి మద్దతు ఇవ్వడం అంటే దేశభక్తి" అనే అబద్ధాన్ని నాటాయి. దాంతో, దోపిడీకి గురైనవారే తమ దోపిడీదారులను పూజించే పరిస్థితి ఏర్పడింది.

"మత పునరుజ్జీవన" పేరుతో, బీజేపీ యొక్క నిజమైన లక్ష్యం హిందూ రాష్ట్రం ఏర్పరచడమే. అక్కడ వ్యతిరేక స్వరం దేశద్రోహం గా ముద్రవేయబడుతుంది, కార్పొరేట్ ప్రయోజనాలు రాజ్యాధికారం గా నిలుస్తాయి. ఈ దోపిడీకి వ్యతిరేకంగా నిలబడే కార్మికులు, రైతులు, విద్యార్థులు, మేధావులు జైలుకు వెళ్తున్నారు లేదా "దేశ ద్రోహులు" "అర్బన్ నక్సలైట్ " లుగా ముద్రవేయబడుతున్నారు.

సీపీఐ (ఎంఎల్) రెడ్ స్టార్ అన్ని ప్రగతిశీల, ప్రజాస్వామ్య, మతనిరపేక్ష శక్తులను ఈ కాషాయ కార్పొరేట్–సామాజిక మతవాద నియంతృత్వానికి, ఫాసిజానికి వ్యతిరేక పోరాటానికి పిలుపిస్తోన్నది. నేటి నిజమైన వైరుధ్యం హిందువుల – ముస్లింల– క్రైస్తవుల– సిక్కుల– బౌద్ధుల మధ్యది కాదు ం దోపిడీ చేయబడుతున్న శ్రామిక ప్రజల మధ్య నూ సర్వ సంపదలను దోచుకుంటున్న అంబానీ ఆదాని లాంటి పెట్టుబడిదారుల, దోపిడీదారుల మధ్యది బీకార్పొరేట్ ఫాసిజానికి– మరియు అశేష శ్రామిక ప్రజా శక్తికి మధ్యది. ఇప్పుడు సమయం ఆసన్నమైనది దేశాన్ని తిరిగి రక్షించు కోవాల్సిన సమయం ఇది. లాభం కోసం మతాన్ని, దోపిడీ కోసం దేశభక్తిని అమ్ముకునే శక్తుల నుండి ప్రజాస్వామ్య, లౌకిక సామ్యవాద ప్రజాస్వామ్య, గణతంత్రాన్ని రాజ్యాంగాన్ని రక్షించకోవాలి. ప్రజల ఐక్యతే విముక్తి దారి మత మతసామరస్యంతో మనమంతా ఐక

ఫుడ్ పాయిజన్ విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు

● గద్వాల జిల్లా కలెక్టర్ సంతోష్

గద్వాల నడిగడ్డ, నవంబర్ 1 (జనం సాక్షి) : జోగులాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం ధర్మవరం బీసీ బాలుర సంక్షేమ వసతి గృహంలో శుక్రవారం రాత్రి భోజనం చేసి అస్వస్థతకు గురైన విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించినట్లు, భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ బి. ఎం. సంతోష్ తెలిపారు. గద్వాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను శనివారం ఉదయం కలెక్టర్ పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి వైద్య అధికారులను అడిగి తెలుసుకున్నారు. పలువురు విద్యార్థులతో మాట్లాడి,చికిత్స అనంతరం వసతి గృహానికి వెళ్లవచ్చు అన్నారు.విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసుకోవడం జరుగుతుందని వారి తల్లిదండ్రులకు భరోసా ఇచ్చారు. వసతి గృహంలో మొత్తం 140 మంది విద్యార్థులకు గాను శుక్రవారం 110 మంది విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు.రాత్రి క్యాబేజీ,క్యాలీఫ్లవర్ మొదటిసారి కలిపి వండడంతో ఈ ఆహారం పడని 54 మంది విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు చెప్పారు. విషయం తెలిసిన వెంటనే అంబులెన్సును పంపించి విద్యార్థులను గద్వాల ప్రభుత్వ

ఆసుపత్రిలో చేర్పించి చికిత్స అందించినట్లు పేర్కొన్నారు.తమ అధికార యంత్రాంగం రాత్రంతా ఆసుపత్రిలోనే ఉండి ఎప్పటికప్పుడు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించినట్లు తెలిపారు.తాను కూడా ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడి విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించినట్లు చెప్పారు. చికిత్స అనంతరం 32 మంది విద్యార్థులు బాగుండడంతో ఉదయం వారిని డిశ్చార్జి చేసినట్లు పేర్కొన్నారు. మిగిలిన 22 మంది విద్యార్థులను కూడా వారి ఆరోగ్య పరిస్థితిని బట్టి మధ్యాహ్నం వరకు డిశ్చార్జి చేయడం జరుగుతుందన్నారు. ఫుడ్ పాయిజన్‌కు బాయిలర్ ఎగ్ కూడా కారణమని ఆరోపణలు వస్తుండడంతో శాంపిల్స్ ఉంటే ఫుడ్ ఇన్స్పెక్టర్ కు పంపించి పరీక్షలు చేయిస్తామన్నారు. ఈ సంఘటనపై సమగ్రంగా విచారణ జరిపించి నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు తేలితే బాధ్యులైన వారిని సస్పెండ్ చేస్తామన్నారు. నెల క్రితం తాను ఈ వసతి గృహాన్ని సందర్శించానని, వారానికి కనీసం మూడు విద్యాసంస్థలను ఆకస్మికంగా తనిఖీ చేస్తూ సమస్యలు ఉంటే పరిష్కరిస్తున్నట్లు తెలిపారు.ఆయా వసతి గృహాల్లో ఇప్పటికే ఫుడ్ కమిటీలను ఏర్పాటు చేసి అందులోని సభ్యులు వండిన భోజనం తిన్నాకే, మిగతా విద్యార్థులకు వడ్డించడం జరుగుతుందన్నారు. కూరగాయలు,సరకుల నాణ్యతను ఫుడ్ కమిటీ సభ్యులు తనిఖీ చేస్తారని,నాణ్యత లేనివి సరఫరా చేసే గుత్తేదారులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలోని అన్ని వసతి గృహాలకు ప్రత్యేక అధికారులను నియమించామని,స్థానిక తహసిల్దార్లు సైతం నెలలో రెండు రోజులు సంబంధిత వసతి గృహాలను సందర్శిస్తారన్నారు. ఇకనుంచి వారానికోసారి సందర్శించేలా ఆదేశాలు జారీ చేస్తామని, అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.ఈ పర్యటనలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ ఇందిర,గద్వాల తహసిల్దార్ మల్లికార్జున్ తదితరులున్నారు.

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ అందజేత



ఇబ్రహీంపట్నం, నవంబర్ 1 (జనం సాక్షి) : ఇబ్రహీంపట్నం మండల పరిధిలోని ఎలిమినేడుగ్రామంలో శనివారం ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాల మేరకు ఎలిమినేడులో కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకి ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్స్ ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఒక ఇల్లు కూడా ఇవ్వలేదు కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ఇందిరమ్మ ఇల్లు ఇస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డి లకు ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే గ్రామంలో రెండు సీసీ రోడ్లు ప్రారంభించడం జరిగింది సీఎం రిలీఫ్ ఫండ్ ఇవ్వడం జరిగింది ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రెటరీ మంకాల శేఖర్ రెడ్డి, పట్నం శివశంకర్, స్వామి గట్టు జంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ షాపులపై విజిలెన్స్ దాడులు

- ఏకకాలంలో మూడు రేషన్ షాపులపై విజిలెన్స్ పంజా
- కొందుర్గులో రెండు షాపులపై కేసు నమోదు
- మరో షాప్‌పై దర్యాప్తు

కొందుర్గు, నవంబర్ 1 (జనంసాక్షి) : రంగారెడ్డి జిల్లాల్లోని కొందుర్గు మండలకేంద్రంలో రేషన్ షాపులపై రంగారెడ్డి జిల్లా విజిలెన్స్, ఎన్ఫోర్స్మెంట్ అధికారులు శనివారం దాడులు నిర్వహించారు. మూడు షాపుల్లో తనిఖీలు నిర్వహించాగా షాప్ నెంబర్ 2,లో ఉండాల్సిన రికార్డు నిల్వ కన్న 10 బస్తాలు సన్ బియ్యం ఎక్కువగా షాప్ నెంబర్ 3లో సుమారు 4 క్వి%శీ%టాలు తక్కువగా ఉన్నాయన్నాని వారిపై ఈసీ యాక్ట్ 6ఏ ప్రకారం కేసు నమోదు చేసినట్టు షాప్ నెంబర్ 4 లో సుమారు14 క్వింటాలు అంగన్‌వాడీ బియ్యం నిల్వ ఉన్నాయని షాప్ నెంబర్ 4 పై విచారణ చేస్తామని డిఎస్ఓ వెంకటేశ్వర్లు విలేకరులకు వివరాలు వెల్లడించారు. దాడుల్లో పాల్గొన్న వారు విజిలెన్స్ అడిషనల్ ఎస్పీ సూర్యనారాయణ, సిఐ లక్ష్మణ్,డిప్యూటీ తహసీల్దార్ , రవీందర్ తమ సిబ్బందితో పాల్గొన్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే రోహిత్ వందేళ్లు చల్లగా ఉండాలి

తూప్రాన్, నవంబర్ 1 (జనం సాక్షి) : మెదక్ శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు వందేళ్లు చల్లగా ఉండాలని మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని కోరుకుంటున్నట్లు మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు తెలిపారు మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావ్ పుట్టినరోజు పురస్కరించుకొని మనోహరాబాద్ తూప్రాన్ మండలాలలో పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు పాల్గొన్నారు. మండల కేంద్రం మనోహరాబాద్ లో రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరమ్ మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ చిటుకుల మహిపాల్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం మెగా రక్తదాన శిబిరం ను ఏర్పాటు చేశారు. అక్కడి నుండి పాలట ,రావెల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థుల కు ప్లేట్స్ పంపిణి చేశారు. ఊరేగింపుగా తూప్రాన్ మండలం లోని ఘనపూర్ గ్రామంలో మాజీ ఎంపీపీ గడ్డి స్వప్న వెంకటేష్ ఆధ్వర్యంలో మైనంపల్లి బృందానికి గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. వర్గల్ మండలం లోని నాచారం లక్ష్మి నర్సింహా స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకలలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ ధర్మేందర్ రమేష్, మైనార్టీ నాయకులు జావిద్ భాష నాయకులు అభిమానులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. రక్తదాన శిబిరంలో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు.

హైడ్రా కూల్చివేతలను పట్టించుకోని కబ్జాదారులు

కుత్బుల్లాపూర్, నవంబర్ 1 (జనం సాక్షి) : హైడ్రా కూల్చివేతలను పట్టించుకోకుండా పరికి చెరువులో దర్జాగా కబ్జాలు చేస్తున్నారని పరికిచెరువు పరిరక్షణ కమిటీ ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం పరికిచెరువులో కబ్జాకు గురైన ప్రాంతాన్ని పరిశీలించిన కమిటీ సభ్యులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగద్గిరిగుట్ట ,గాజులరామారం ఎల్లమ్మబండ ,ఆల్విన్ కాలనీ ప్రాంతాలను కలుపుతూ ఉన్న పరికిచెరువు ఇప్పటికే 50 శాతానికి పోయిన కబ్జాకు గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. హైడ్రా కూల్చివేతలు జరిపినప్పటికీ తిరిగి నిర్మాణాలు చేపట్టడం పరిపాటిగా మారిందన్నారు. చెరువును సుందరీకరించడం జరిగితే కబ్జాలకు ఆస్కారం లేకుండా అవుతుందని సూచించారు. కబ్జా చేస్తున్న కబ్జాదారులపై పిడి ఆక్ట్ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పరికిచెరువు పరిరక్షణ కమిటీ కన్వీనర్ ఉమా మహేష్, సభ్యులు సాయి పంతుల, పవన్, ప్రవీణ్, బాబు, సహదేవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బుగ్గ జాతర వాల్ పోస్టర్ విడుదల

ఇబ్రహీంపట్నం, నవంబర్ 1 (జనం సాక్షి) : నవంబర్ 5 నుండి ప్రారంభమయ్యే ఆరుట్ల బుగ్గరామలింగేశ్వర స్వామి జాతర (బుగ్గజాతర) ఉత్సవాల సందర్భంగా అందుకు సంబంధించిన వాల్ పోస్టర్ ఆవిష్కరించిన ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డి సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు చూడాలని దేవాలయ కమిటీకి సూచించారు. భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య, గడ్డిఅన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, మంచాల సహకార సంఘం చైర్మన్ వెదిరే హనుమంత్ రెడ్డి, దేవాలయ కమిటీ సభ్యులు ఆరుట్ల మాజీ సర్పంచ్ అనంగల్ల యాదయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు బైరిక రమాకాంత్ రెడ్డి, గుడిమల్ల చంద్రయ్య, మార సురేష్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు వెదిరే సికిందర్ రెడ్డి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు బుట్టి కృష్ణ, మార లక్ష్మణ్, కంబాలపల్లి బుగ్గరాములు, కోరే బాబు, పాండాల శ్రీనివాస్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి

మోమిన్‌పేట, నవంబర్ 1 (జనం సాక్షి) : రైతులు మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని దళారులను ఆశ్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలోనే ధాన్యాన్ని విక్రయించాలని మర్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ వై మహేందర్ రెడ్డి, జిల్లా సహకార అధికారి నాగార్జున పేర్కొన్నారు. శనివారం వికారాబాద్ జిల్లా మొమిన్ పేట్ పిఎసిఎస్ కార్యాలయంలో పిఎసిఎస్ చైర్మన్ బండ విష్ణువర్ధన్ రెడ్డి అధ్యక్షతన మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని, కామన్ సర్వీస్ సెంటర్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మొక్కజొన్న క్వింటాలుకు 2400 రూపాయలు గిట్టుబాటు ధర లభిస్తుందని, తేమశాతం 14శాతం ఉండాలని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతుల ప్రయోజనాల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వాటిని పకడ్బందీగా అమలు పరుస్తున్న సందర్భంగా గ్రామీణ ప్రాంత రైతులు సహకార సంఘాల ద్వారా ఏర్పాటుచేసిన కొనుగోలు కేంద్రాలను

సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. రైతులు సహకార సంఘాల ద్వారా అందిస్తున్న ఎరువులను, విత్తనాలను, క్రిమిసంహారక మందులను కొనుగోలు చేసుకుని లబ్ధి పొందాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ చైర్మన్ బండ విష్ణు వర్ధన్ రెడ్డిఅసిస్టెంట్ రిజిస్టర్ రామకృష్ణ, సీనియర్ ఇన్స్పెక్టర్ కిరణ్ మై, జూనియర్ ఇన్స్పెక్టర్ మహమ్మద్ అలీ, పిఎసిఎస్ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, పిఎసిఎస్ సీఈవో శేఖర్, సిబ్బంది బాలయ్య, రవికుమార్, రమేష్, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే ప్రజాబాట

న్యాల్‌కల్, నవంబర్ 1 (జనం సాక్షి) : మండలంలో నెలకొన్న వ్యవసాయ, వ్యాపార, గృహ, ఉచిత, తదితర విద్యుత్ సమస్యల పరిష్కారం కోసమే ప్రజాబాట కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు మండల విద్యుత్ అధికారి అర్జున్ తెలిపారు. జిల్లా విద్యుత్ ఉన్నతాధికారుల ఆదేశం మేరకు ప్రతి మంగళ, గురు, శనివారాల్లో ప్రజాబాట కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా శనివారం మండలంలోని ఖలీల్ పూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామానికి చెందిన పలువురు గ్రామంలో లో ఓల్టేజీ సమస్య, విద్యుత్ సమస్యలను ఏఈ దృష్టికి తీసుకువచ్చారు. తమ పరిధిలో ఉన్న విద్యుత్ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, పరిష్కరించలేని సమస్యలను జిల్లా విద్యుత్ శాఖాధికారుల దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు ఏఈ స్పష్టం చేశారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలోని పలు కాలనీలో నెలకొన్న విద్యుత్ సమస్యలను నేరుగా తెలుసుకున్నారు.

విద్యార్థులకు పోషకాహారంతో కూడిన భోజనాన్ని అందించాలి

● గద్వాల అదనపు కలెక్టర్ నర్సింగరావు

గద్వాల నడిగడ్డ, నవంబర్ 1 (జనం సాక్షి) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సమయానికి పరిశుభ్రమైన, పోషకాహారంతో కూడిన భోజనం అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ బి. నర్సింగ్ రావు అధికారులకు ఆదేశించారు.శనివారం ఎర్రవల్లి గురుకుల పాఠశాలలో ఆహార నాణ్యత, పరిశుభ్రత, పోషకాహార ప్రమాణాలపై తనిఖీ నిర్వహించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ భోజన పదార్థాల తయారీ విధానం, వంటగది పరిశుభ్రత, ఆహార నిల్వ పద్ధతులు, వంట సిబ్బంది వ్యక్తిగత హైజీన్,తాగునీటి శుద్ధి వ్యవస్థ, భోజనశాల శుభ్రతను పరిశీలించారు. వంటగది, డైనింగ్ హాల్ ప్రాంతాల్లో పరిశుభ్రత ప్రమాణాలను మెరుగుపరచాలని సూచించారు. నిల్వ గదుల్లో తగిన గాలి ప్రసరణ ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి భోజన నాణ్యతపై అభిప్రాయాలు, వసతి సదుపాయాలు, తాగునీటి సదుపాయం, పాఠశాల వాతావరణం గురించి అడిగి తెలుసుకున్నారు. తదనంతరం అధికారులు, విద్యార్థులతో కలిసి విద్యార్థులకు అందించే భోజనం చేశారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు ఆరోగ్యవంతమైన, నాణ్యమైన భోజనం అందించడం మనందరి బాధ్యత అని పేర్కొన్నారు. పరిశుభ్రత, పోషకాహారం,సమయపాలనలో ఎలాంటి రాజీ ఉండకూడదని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య శాఖ అధికారి సిద్ధప్ప,పాఠశాల సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సోయా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే కొనింటి మాణిక్రావు, డీసీఎంఎస్ చైర్మన్ ఎం.శివకుమార్

ఝరాసంగం, నవంబర్ 1 (జనం సాక్షి) : ప్రభుత్వం నాఫెడ్ అద్వర్యంలో మార్క్ఫెడ్ ద్వారా సోయా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందని ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కొనింటి మాణిక్రావు,ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్ అన్నారు. శనివారం ఝరాసంగం మండల పరిధిలోని ఏడాకులపల్లి పీఏసీఎస్ సెంటర్లో సోయాబీన్ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోయాబీన్ పంటకు ప్రభుత్వం క్వింటాల్కు 5328 రూపాయల మద్దతు ధర చెల్లిస్తుందని రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోవద్దని కొనుగోలు కేంద్రాలలో పంటను విక్రయించి లబ్దిపొందాలన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ కాంతమ్మ, డైరక్టర్లు అనంత్ రామ్ గౌడ్, శ్రీనివాస్, రాంచందర్, ఆలయ కమిటి మాజీ చైర్మన్ నర్సింహాగౌడ్, ఏఓ వెంకటేశం, ఏఈఓ వేదా, సొసైటీ సీఈఓ శ్రీశైలం, రైతులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యం

హయత్‌నగర్, నవంబర్ 1 (జనం సాక్షి) : మన్సూరాబాద్ డివిజన్‌లోని చిత్రసీమ కాలనీలో ప్రజా బాట కార్యక్రమం లో భాగంగా జిహెచ్ఎంసి డిప్యూటీ ఫ్లోర్ లీడర్, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ్మా రెడ్డి, స్థానిక ప్రజలు, టీజీ ఎస్పీడీసీఎల్ అధికారులతో కలిసి పాదయాత్ర నిర్వహించి, కాలనీ వాసుల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీలో విద్యుత్ సంబంధిత ప్రమాదాలను నివారించేందుకు అత్యవసర చర్యలు తీసుకొని డ్యామేజ్ అయిన ఎలక్ట్రిక్ స్తంభాలను తొలగించి కొత్త స్తంభాలు ఏర్పాటు చేయడం, లూజ్‌గా ఉన్న వైర్లు బిగించడం, ప్రమాదకర ప్రాంతాల్లో ట్రాన్స్ఫార్మర్ల వద్ద భద్రతా చర్యలు తీసుకోవడం కోసం అధికారులు వెంటనే పని ప్రారంభించాలని వారు కోరారు. రోడ్ల మీదకు వచ్చి పిల్లర్లు వేసి నిర్మాణాలు చేపట్టడం వలన కాలనీ లోపల రెసిడెన్షియల్‌గా కాకుండా కమర్షియల్ గా షాపులు

పెట్టడం తో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా అవుతాయని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంశం పై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ, ఈ రకమైన చర్యలు భవిష్యత్తులో స్థానికులకు తీవ్రమైన ఇబ్బందులు కలిగిస్తాయని వారు హెచ్చరించారు. కాలనీలో మ్యాన్ హోల్స్ మరమ్మత్తులను, గ్రీన్ వేస్ట్ కుప్పలు, పారిశుద్ధ్య లోపాలు, రోడ్లు డ్యామేజ్ అవ్వడం వంటి సమస్యలను కూడా గుర్తించి, తక్షణమే ప్యాచ్‌వర్క్ చేయించి శుభ్రత చర్యలు చేపడతామని వారు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లోటీజీ ఎస్పీడీసీఎల్ ఏ ఈ శంకర్, లైన్ ఇన్స్పెక్టర్ రాజయ్య చారి, స్థానిక అధ్యక్షులు జె ప్రభాకర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి మధుసూదన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, జి. హర్షవర్ధన్ రెడ్డి, ఎస్ మాధవ రెడ్డి, ఎన్ చల్మా రెడ్డి, డి రవీందర్ రెడ్డి, ఎం సురేందర్ రెడ్డి, వై. అమృత రెడ్డి, ఎం వెంకట్ రెడ్డి, జె వెంకట్ రెడ్డి, ఎం విజేందర్ రెడ్డి, పూర్ణచందర్ రావు, ఎన్ రమేష్ రెడ్డి, పి. యాదగిరి రెడ్డి, శ్రవణ్ రెడ్డి, దిలీప్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
02 నవంబర్ 2025

దెబ్బతిన్న పంటలకు ఎకరానికి 50వేలు ఇవ్వాలి

వనపర్తి బ్యూరో, నవంబర్ 1 (జనంసాక్షి) : మెంథా తుఫాన్ వర్షానికి జిల్లాలో దెబ్బతిన్న వరి పత్తి తదితర పంటలకు ఎకరానికి రూ. 50,000 నష్టపరిహారం ఇవ్వాలని సిపిఐ వనపర్తి నియోజకవర్గం కార్యదర్శి జే. రమేష్ డిమాండ్ చేశారు. వనపర్తి మండలం నర్సింగాయిపల్లి,గోపాల్పేట మండలం తాడిపర్తి గోపాల్పేట పోలికే పాడు లలొ దెబ్బతిన్న పంటలను స్థానిక నేతలతో కలిసి పరిశీలించిన అనంతరం పోలికపాడులో మాట్లాడారు. వర్షానికి జిల్లాలో వేలాది ఎకరాల్లో వరి పంట నేలకు ఒరిగి నీళ్లలో పడ్డాయని, పక్వానికి వచ్చిన ఒడ్లు మొలకెత్తి, పక్వం కాని వడ్లు తాలు పోయి రైతుల నష్టపోయే పరిస్థితి ఉందన్నారు. ఎకరానికి రూ. 40 వేల దాకా పెట్టుబడి పెట్టి 6 కాలం పనిచేశారన్నారు. పంట చేతికి వచ్చే దశలో అకాల వర్షం రైతుల ఆశలను చిదిమేసిందన్నారు. రెవెన్యూ వ్యవసాయ అధికారులు గ్రామాలలో పర్యటించి ప్రతి రైతు పంట నష్టాన్ని స్పష్టంగా లెక్కించాలన్నారు. నష్టపోయిన ప్రతి రైతుకు సహాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఖరీఫ్లో ముందుగా నాటిన

చేలు కోస్తున్నారని, కొందరు నూర్పిడులు కూడా చేశారని, కొనుగోలు కేంద్రాలు తెరవకపోవడంతో ధాన్యం ఎక్కడ పోసుకోవాలో అర్థం కాక రైతులు ఆవేదన చెందుతున్నారన్నారు. గోపాల్పేట కొనుగోలు కేంద్రంలో రైతులు ధాన్యం పోసారని కొనుగోలు ప్రారంభించకపోవడంతో మళ్లీ వర్షానికి తడుస్తుందని ఆందోళన చెందుతున్నారన్నారు. తాడిపర్తిలో కేంద్రం తెరవక రైతులు ఇండ్ల ముందే ధాన్యం పోసుకొని ఆరబెడుతున్నారన్నారు. చాలా గ్రామాలలో కొనుగోలు కేంద్రాలకు స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారని, పోలికే పాడు కేతేపల్లితో పాటు చాలా గ్రామాల్లో కొనుగోలుకు దాన్యం పోసేందుకు స్థలాలు లేవన్నారు. ప్రతి గ్రామంలో కొనుగోలు కేంద్రాలకు శాశ్వత స్థలాలను కేటాయించాలన్నారు. కొనుగోలు కేంద్రాల ద్వారా గత రబీలో సేకరించిన సన్నధాన్యానికి క్వింటాల్ రూ. 500 బోనస్ చెల్లించలేదని, వెంటనే చెల్లించాలన్నారు. ఆలస్యంతో ప్రభుత్వం బోనస్ ఎగవేస్తుందేమోనని ఆందోళన చెందుతున్నారన్నారు. ఖరీఫ్లో సేకరించే ధాన్యానికి కనీస మద్దతు డబ్బుతోపాటు, బోనస్ రూ. 500 కూడా కలిపి చెల్లించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకుంటే సిపిఐ ఆధ్వర్యంలో బాధితులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. గోపాల్పేట మండల కార్యదర్శి మంకలి శాంతన్న రైతులు పాల్గొన్నారు.

వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి పూర్తి ప్రణాళిక సిద్ధం చేయాలి

- **జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**

నారాయణపేట జిల్లా బ్యూరో, నవంబర్ 1 (జనం సాక్షి) : జిల్లాలో వ్యవసాయ అనుబంధాల రంగాల అభివృద్ధికి పూర్తి ప్రణాళికను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో స్థానిక సంస్థల జిల్లా అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వర్ తో కలిసి పీఎం ధన్ ధాన్య కృషి యోజన పథకం అమలు పై వ్యవసాయ, పశుసంవర్ధక, పాడి పరిశ్రమ, హార్టికల్చర్, మత్స్య శాఖ అధికారులతో సమీక్షించారు. జిల్లాలో ఆయా రంగాల ఉత్పాదకతలను పెంచేలా అన్ని పారామిటర్స్ కూడిన డాక్యుమెంటేషన్ కు అధికారులు సమన్వయం చేసుకోవాలన్నారు.జిల్లాలో ఆ పథకం అమలు కోసం మన జిల్లాకు కేంద్రం నుంచి ఓ ప్రత్యేక (ఐఏ ఎస్)అధికారి వస్తున్నారని, అందరూ తమ తమ శాఖల పూర్తి వివరాలతో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.ఈ సమీక్షలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, డిప్యూటీ కలెక్టర్ శ్రీరామ్ ప్రణీత్, అధికారులు సాయిబాబా,జాన్ సుధాకర్, రహమాన్, ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందనడం సరికాదు

- **పార్టీ లైన్ దాటి ఎవరైనా మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు**
- **డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్ ఖాద్రీ**

మహబూబ్‌నగర్ బ్యూరో, నవంబర్ 1 (జనం సాక్షి) : కాంగ్రెస్ పార్టీ అన్యాయం చేసిందని జిల్లా మత్స్యశాఖ సహకార సంఘం మాజీ పర్సన్ ఇన్చార్జ్ గంజి ఆంజనేయులు చెప్పడం సరికాదని డీసీసీ ప్రధాన కార్యదర్శి అబ్దుల్ సిరాజ్ ఖాద్రీ అన్నారు. జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గంజి ఆంజనేయులు కాంగ్రెస్ పార్టీని, ఎమ్మెల్యేను విమర్శిస్తూ మాట్లాడడం సబబు కాదన్నారు. ఒకవేళ మీకు ఏమైనా బాధ కలిగితే సీనియర్ నాయకులు, ఎమ్మెల్యేతో మాట్లాడాలి కాని ఇలా బహిరంగంగా విమర్శలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ తరపున రెండు పర్యాయాలు కౌన్సిలర్లుగా గెలిచిన మీరు సొంత ఆస్తులను కాపాడుకోవడానికి బీఆర్ఎస్‌లో చేరినప్పుడూ మీకు పార్టీ గుర్తుకు రాలేదా అని అన్నారు. కష్టకాలంలో పార్టీ ఉన్నప్పుడూ మీరు విడిచిపెట్టిపోయారని అన్నారు. ఏ నాయకుడైనా, కార్యకర్త అయినా పార్టీ లైన్ దాటి మాట్లాడితే క్రమశిక్షణ చర్యలు తప్పవని అన్నారు. సమావేశంలో నాయకులు మైత్రి యాదయ్య, రామకృష్ణ, తిరుమల వెంకటేష్, నాచ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి

నాగర్‌కర్నూల్, నవంబర్ 1 (జనంసాక్షి) : నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల ఏర్పాటు చేయాలని బి. ఎస్. ఎఫ్. ఆధ్వర్యంలో సందర్శించడం జరిగింది. బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కొంగరి రామకృష్ణ మాట్లాడుతూ, గత 30 సంవత్సరాల కింద కట్టిన ప్రభుత్వ జూనియర్ కళాశాల నేడు శిథిలావస్థలో వుంది. గత 3 నెలల కిందట నాగర్ కర్నూల్ ఎమ్ఎల్ఎ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించి నూతన ప్రభుత్వ కళాశాల మంజూరు అయ్యింది. అతి త్వరలోనే నూతన కళాశాల భవనాన్ని నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. నేటికీ కళాశాల నిర్మించక పోవడం వలన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుకునే విద్యార్థులు వర్షం వస్తే చదువు కోవడానికి, చాలా ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ కళాశాలలో సుమారుగా 500 మంది విద్యార్థుల కంటే ఎక్కువ విద్యార్థులు చదువుకుంటున్నారు. చాలా మంది విద్యార్థులు పేద, మధ్య తరగతి విద్యార్థులు, మరియు రైతు కూలిలా పిల్లలు, హమాలీల పిల్లలు చదువు కుంటున్నారు. కాబట్టి వర్షం వస్తే ఎప్పుడు కూలి పోతుందో అని విద్యార్థులు భయందోళనకు గురి అవుతున్నారు. పై పెచ్చులు ఊడి పడుతున్నా విద్యార్థులు అలాగే చదువు కుంటున్నారు. కాబట్టి వెంటనే స్పందించి నూతన ప్రభుత్వ జూనియర్ కళాశాల ను నిర్మించాలని అన్నారు లేని యెడల అన్ని విద్యార్థి సంఘాలు కలుపుకొని పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని అన్నారు. అనంతరం బి. ఎస్. ఎఫ్ కమిటిని వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బి. ఎస్. ఎఫ్. జిల్లా అధ్యక్షులు సాయిబాబు, టౌన్ అధ్యక్షులు అభిషేక్, గణేష్, రాజు, రాము తదితరులు పాల్గొన్నారు.

దేశ ప్రజల భవిష్యత్తు కోసం రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావాలి

- **టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి**

సంగారెడ్డి టౌన్, నవంబర్ 1 (జనం సాక్షి) : దేశ ప్రజల భవిష్యత్తు బాగుండాలంటే దేశానికి రాహుల్ గాంధీ ప్రధానమంత్రి కావాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. శనివారం సంగారెడ్డి పట్టణంలోని ఐబిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆనాడు ఇందిరా గాంధీ ప్రపంచ దేశాలను శాసిస్తే ఈనాడు ప్రపంచ దేశాలు ప్రధాన మంత్రి మోడీని శాసిస్తున్నాయన్నారు. తెలంగాణ లో 14 ఎంపిలను, ఆంధ్ర ప్రదేశ్‌లో 20 ఎంపిలను గెలిపిస్తే రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవుతారని అయన అన్నారు. రాహుల్ గాంధీ ప్రధానమంత్రి అయితే తెలంగాణ అభివృద్ధి కావడంతో పాటు ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక ప్యాకేజీ, వైజాగ్ స్టీల్ ప్లాంట్ సమస్య పరిష్కారం, పోలవరం పూర్తి అవుతుందన్నారు. తెలంగాణ, ఏపి ప్రజలు ఇప్పటినుండే ఆలోచన చేయాలని సూచించారు. తెలంగాణ లో పదేళ్లు కేసీఆర్, ఏపిలో పదేళ్లు జగన్, చంద్ర బాబులు ముఖ్యమంత్రులుగా ఉండి కేంద్రంలో బీజేపీకి మద్దతు ఇచ్చినా కేంద్రం నుండి నిధులు తెచ్చి అభివృద్ధి చేయడంలో విఫలం అయ్యారన్నారు. రెండు రాష్ట్రాల ప్రజలు ఈ విషయాన్ని గమనించాలని అన్నారు. భారత దేశం సాఫ్ట్ వేర్, ఐటి రంగాల్లో అభివృద్ధి సాధించిందంటే అందుకు కారణం రాజీవ్ గాంధీ సాఫ్ట్ వేర్, ఐటీ రంగాల్లో ఈనాడు కోట్ల మంది ప్రజలు ఉద్యోగాలు చేస్తున్నారంటే ఆనాడు రాజీవ్ గాంధీ చేసిన కృషే కారణమని గుర్తు చేశారు. సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని యూపీఏ ప్రభుత్వం హయాం లో ఉపాధి హామీ పథకం తీసుకువచ్చి దేశ వ్యాప్తంగా గ్రామ గ్రామాన పేదలకు ఉపాధి కల్పించారన్నారు. ఈ పదేళ్ల బీజేపీ ప్రభుత్వం లో మహిళల ఉపాధి, యువతకు ఉద్యోగాలు, పేదలకు న్యాయం విదేశాల్లోని నల్లధనం తీసుకువచ్చి ఒక్కొక్కరి బ్యాంక్ అకౌంట్ లో 15 లక్షలు వేస్తానని, సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చిన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ని దేశ ప్రజలు ఎందుకు ప్రశ్నించడం లేదన్నారు. కేసీఆర్, జగన్, చంద్రబాబు లు మోడీ నీడలోనే పాలన కొనసాగించారని, 300 కాంగ్రెస్ ఎంపి స్థానాలను గెలిపించి దేశ ప్రజలు రాహుల్ గాంధీని ప్రధాన మంత్రి ని చేసే ఆలోచన చేయాలన్నారు. మాట ఇస్తే మాట మీద నిలబడే వ్యక్తి రాహుల్ గాంధీ, రాహుల్ గాంధీ కుటుంబం అని అన్నారు ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఆంజనేయులు కూన సంతోష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

ఫీజుల పేరుతో విద్యార్థులపై మానసిక వేధనలు చేస్తే ఊరుకోం

- **ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల**

వనపర్తి బ్యూరో, నవంబర్ 1 (జనంసాక్షి) : ఫీజుల పేరుతో విద్యార్థులపై మానసిక వేధనలు చేస్తే ఊరుకోమని,ఏబీవీపీ వనపర్తి జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల హెచ్చరించారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) కార్యాలయంలో ప్రెస్ మీట్ నిర్వహించబడింది. ఈ సందర్భంగా విద్యార్థి నాయకుడు వనపర్తి జిల్లా కన్వీనర్ అర్జున్ సాతర్ల మాట్లాడుతూ విద్య అనేది మానవ హక్కు. ప్రతి విద్యార్థికి అందుబాటులో ఉండాల్సిన ప్రాథమిక హక్కు. కానీ నేటి కార్పొరేట్ ,ప్రైవేట్ స్కూల్ యాజమాన్యాలు విద్యను వ్యాపారంగా మార్చి వేలకు వేలు ఫీజులు వసూలు చేస్తూ, తల్లిదండ్రులపై ఆర్థిక భారం మోపుతున్నాయి.ఈ ధోరణి వల్ల విద్యార్థులు చదువుపై దృష్టి కోల్పోతున్నారు, తల్లిదండ్రులు అప్పుల్లో కూరుకుపోతున్నారు. ఫీజులు చెల్లించలేని విద్యార్థులను అవమానించడం, క్లాసుల నుండి పంపించడం, ఫలితాలు ఆపివేయడం వంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి.దీని వలన అనేక మంది విద్యార్థులు విద్యకు దూరమవుతూ, మధ్యలోనే చదువు మానుకోవాల్సిన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. ఇది విద్యార్థి మనోభావాలను దెబ్బతీస్తూ, భవిష్యత్తును చీకటిలోకి నెడుతోంది. ఇలాంటి అన్యాయాలను ఏబీవీపీ అసలు సహించదు.విద్యార్థుల హక్కుల కోసం ఎప్పుడైనా,ఎక్కడైనా పోరాటం చేయడానికి సిద్ధంగా ఉంది. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి ఈ పాఠశాలలపై విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలి అన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యారంగంలో జరుగుతున్న ఈ దోపిడీని అరికట్టేందుకు స్పష్టమైన విధానాన్ని రూపొందించి, పాఠశాలల ఫీజులపై నియంత్రణ చట్టాన్ని కఠినంగా అమలు చేయాలి అన్నారు. లేనిపక్షంలో ఏబీవీపీ వీరిపై తీవ్ర ఉద్యమం చేపడుతుందని, విద్యార్థుల హక్కుల కోసం రోడ్డుపైకి రావడానికి సిద్ధంగా ఉందని విద్యార్థి నాయకుడు అర్జున్ సాతర్ల హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జ్ఞానేశ్వర్ నగర కార్యదర్శి కార్తీక్, బంటి, రమేష్,నందు,సంతోష్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలి

- **మాదక ద్రవ్యాల అక్రమ రవాణాపై కఠిన చర్యలు**
- **సంగారెడ్డిని మాదకద్రవ్య రహిత జిల్లాగా మార్చడమే లక్ష్యం**
- **అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) చంద్రశేఖర్**

సంగారెడ్డి ప్రతినిధి, నవంబర్ 1 (జనం సాక్షి) : మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మార్గదర్శకత్వంలో జిల్లా యంత్రాంగం సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ బి. చంద్రశేఖర్ తెలిపారు. శనివారం ఎమ్మెన్నార్ వైద్య కళాశాలలో నిర్వహించిన నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యాసంస్థల్లో యాంటి డ్రగ్ కమిటీలను ఏర్పాటు చేసి, అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే జిల్లా యంత్రాంగానికి తెలియజేయాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. సంగారెడ్డిని మాదకద్రవ్య రహిత జిల్లాగా మలచడం లక్ష్యమని స్పష్టం చేశారు. నషా ముక్త్ భారత్ అభియాన్ ఐదేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంలో మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు జిల్లా సంక్షేమాధికారి కె.లలితా కుమారి తెలిపారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేందుకు "మిషన్ పరివర్తన" కార్యక్రమం ద్వారా పలు అవగాహన కార్యక్రమాలు కొనసాగుతున్నాయని తెలిపారు. మాదకద్రవ్యాలను సేవిస్తున్న లేదా విక్రయిస్తున్నవారి వివరాలను హెల్ప్‌లైన్ : 14446కు తెలియజేయాలని సూచించారు. అనంతరం నషా ముక్త్ భారత్‌కు సంబంధించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాలు మత్తు పదార్థాల వినియోగానికి వ్యతిరేకంగా ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు నాటక కళా ప్రదర్శన ద్వారా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రఘునందన్ రావు, జిల్లా యువజన క్రీడాశాఖ అధికారి ఖాసిం బేగ్, వైద్య కళాశాల ప్రిన్సిపల్, అధ్యాపకులు, దివ్యాంగుల శాఖ సిబ్బంది, నషా ముక్త్ భారత్ కమ్యూనిటీ ఎడ్యుకేటర్ ఉమేరా, సహిష్ణ, ఫీల్డ్ రెస్పాన్స్ అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలి

- **షీటీమ్ పోలీసులు**

కృష్ణ, నవంబర్ 1 (జనం సాక్షి) : విద్యార్థులు గుడ్ టచ్,బ్యాడ్ టచ్ పై అవగాహన కలిగి ఉండాలని షీ టీం పోలీసులు సూచించారు. జిల్లా ఎస్పీ వినీత్ ఆదేశాల మేరకు శనివారం కృష్ణ మండలం, హిందూపూర్ గ్రామంలోని కేజీబీవీ పాఠశాల విద్యార్థులకు గుడ్ టచ్ బాడ్ టచ్, ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, డ్రగ్స్, గంజాయి, ట్రాఫిక్ చట్టాలు, సెల్ ఫోన్ వినియోగం వల్ల ఏర్పడే అనర్థాలు, పోటీ పరీక్షల గురించి, లీడర్షిప్ లక్షణాలు, డయల్100 తదితర విషయాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షి టీమ్ పోలీసు లు బాలరాజు, కవిత లు మాట్లాడుతూ విద్యార్థులు పాఠశాలకు వచ్చి పోయే సమయంలో ఎవరైనా అమ్మాయిలను వేధిస్తే షి టీమ్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని అలాగే తమకు తెలిసిన వాళు ్ళగా, సొంతంగా ఉండి అమ్మాయిలను అనేక రకాలుగా మోసం చేస్తున్నారని వారు గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని వివరించారు. గుడ్ టచ్ తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రేమగా అలింగణం చేసుకోవడం, గురువులు విద్యార్థుల తల మీద లాలనగా చేతులు పెట్టడం, స్నేహితులు హై-ఫై ఇవ్వడం. బ్యాడ్ టచ్...ఇది బాలుడికి బాలికకు అసహజంగా, భయంగా,

అపరాధ భారంగా అనిపించవచ్చు ఇది ప్రమాదకరమైనదిగా భావించాలన్నారు. ఎవరైనా ప్రైవేట్ భాగాలను అనవసరంగా తాకడం, ఒత్తిడి చేస్తూ అతుక్కోవడం లేదా ముద్దు పెట్టడం, ఒంటరిగా ఉండమని బలవంత పెట్టడం, హామీలతో లేదా బహుమతులతో ఆకర్షించడం స్పర్శకు ఒప్పించేందుకు ప్రయత్నించడం గ్రహించాలన్నారు. సెల్‌ఫోన్‌లో అశ్లీలంగా, ఫోటోలు వీడియోలు చూపించడం పిల్లలు ఇలాంటి వాటికి దూరంగా ఉండాలని తెలిపారు.

విద్యార్థులు గుర్తించుకోవాల్సిన విషయాలు :

నా శరీరం నా సొంతం ఎవరు అనవసరంగా తాకకూడదని గుర్తుంచుకోవాలి. ప్రైవేట్ భాగాలు నచ్చని స్పర్శపై ఐ యాం నాట్ కంఫర్టబుల్ అని ధైర్యంగా చెప్పాలి. వెంటనే నమ్మదగిన పెద్దలకు తల్లిదండ్రులకు టీచర్ లకు పోలీస్ వారికి తెలియజే యాలి. ఒంటరిగా ఉండవద్దు ఎవరైనా గుప్తంగా మాట్లాడ మంటే నిరాకరించాలన్నారు. ఈ విషయాలను విద్యార్థినిలు తప్పకుండా గుర్తించుకోవాలని షి టీమ్ పోలీసులు విద్యార్థు లకు అవగాహన కల్పించారు. జిల్లా పరిధిలో ఎవరైనా ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ కు పాల్పడి తే, వేధిస్తే నారాయణపేటపేట షీ టీం సెల్ నంబర్ 8712670398 కి లేదా డయల్ 100, 112 కి సమాచారంలి ఇవ్వాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచి అట్టి వ్యక్తులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే విద్యార్థులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలంటే ప్రతిరోజు ఆటలు ఆడాలని, ఆటలు ఆడడం వల్ల లీడర్షిప్ లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు. ప్రతి ఒక్కరు లీడర్షిప్ లక్షణాలు పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ పోలీసులు, జ్యోతి, కవిత, విద్యార్థులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలి

- **అకాల వర్షాలతో రైతుల ఆగం**
- **ఆరుగాల కష్టం వృథా**
- **వడ్ల కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన మాజీ ఎంపీపీ శ్రీకాంత్ రెడ్డి మాజీ ఏఎంసీ చైర్మన్ రాగుల సారయ్య**

నంగునూరు, నవంబర్ 1 (జనం సాక్షి) : అకాల వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీపీ శ్రీకాంత్ రెడ్డి, రాగుల సారయ్య డిమాండ్ చేశారు. శనివారం రోజు నంగునూరు మండలం మగ్దుంపూర్ గ్రామంలోని ఐకెపి కేంద్రాన్ని వారు సందర్శించి రైతులతో మాట్లాడారు. ఇటీవల కురిసిన భారీ వర్షంతో రైతులకు భారీ నష్టం కలిగిందని, ప్రభుత్వం పంట నష్టపోయిన రైతులకు ఆర్థిక భరోసా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పౌరుడికి న్యాయం అందించడమే లక్ష్యం

- తెలంగాణ రాష్ట్ర హైకోర్ట్ చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్
- కోర్టు భవనానికి వర్చువల్‌గా శంకుస్థాపన

జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి): రాజ్యాంగంలోని 21వ అధికరణం ప్రకారం ప్రతి పౌరుడికి న్యాయం అందించడమే లక్ష్యమని తెలంగాణ రాష్ట్ర హైకోర్ట్ చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్ అన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాకేంద్రంలో నిర్మించ తలపెట్టిన 10o2 కోర్ట్ భవనానికి శనివారం వర్చువల్‌గా వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎస్పి కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాలులో ఏర్పాటు చేసిన సమావేశాన్ని ఉద్దేశించి చీఫ్ జస్టిస్ ప్రసంగించారు. పౌరుడి ప్రాథమిక హక్కుల పరిరక్షణే ధ్యేయం కావాలని వారు పేర్కొన్నారు. వ్యవస్థలోని అన్ని వర్గాల సహకారం, వనరుల లభ్యత న్యాయ వ్యవస్తకు ఉందని తెలిపారు. అంతకుముందు 6 ఇన్ క్లయిన్ దగ్గర కోర్టు భవన నిర్మాణ భూమి పూజ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తెలంగాణ హైకోర్ట్ జస్టిస్ ఈవి వేణుగోపాల్, జస్టిస్ ఎన్. రాజేశ్వర్ రావు హాజరైయారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.హెచ్ రమేష్ బాబు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి కిరణ్ ఖరే, అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ లు హై కోర్ట్ న్యాయమూర్తులకు స్వాగతం పలికారు. సర్వమత ప్రార్థనలు నిర్వహించిన అనంతరం పునాది రాయి వేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. జస్టిస్ ఈ.వి.వేణుగోపాల్ మాట్లాడుతూ జిల్లాకు న్యాయస్థాన భవన సముదాయం మంజూరు కావడం ఆనందించదగిన విషయం అన్నారు. కొత్త కోర్టు ఏర్పాటు అనేది సిబ్బందికి, న్యాయవాదులకు, కక్షిదారులకు ఎంతో ఉపయోగకరం అన్నారు. చారిత్రక నేపథ్యం వున్నా జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో కోర్టు ఏర్పాటుతో నేరాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉంటుందని జస్టిస్ తెలిపారు. జస్టిస్ ఎన్.రాజేశ్వర్ రావు మాట్లాడుతూ కోర్టు భవనాలు న్యాయ దేవాలయాలు అన్నారు. కేసుల్లోని ఇరువర్గాలకు న్యాయం జరిగే విధంగా న్యాయవ్యవస్థ పనిచేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి, న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఏ. నాగరాజ్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.ఆర్. దిలీప్ కుమార్ నాయక్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, అడ్వకేట్స్ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వి. శ్రీనివాస చారి, గవర్నమెంట్ ప్లీడర్ బోట్ల సుధాకర్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వి.శ్రావణ్ రావు, చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అనితావని, న్యాయవాదులు, పోలీస్ అధికారులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 15న ప్రత్యేక లోక్ అదాలత్

- న్యాయమూర్తులు నిర్మల గీతాంబ, డాక్టర్ పట్టాభి రామారావు వెల్లడి

వరంగల్ బ్యూరో, నవంబర్ 1 (జనంసాక్షి) : వరంగల్ జిల్లా న్యాయ సేవాధికార సంస్థ నిర్వహించిన మీడియా సమావేశంలో వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రధాన న్యాయమూర్తులు వి.బి. నిర్మలా గీతాంబ, డాక్టర్ కె.పట్టాభిరామారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తులు మాట్లాడుతూ "రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాలను అనుసరించి తేదీ: 15 నవంబర్ 2025 శనివారం రోజున ప్రత్యేక లోక్ అదాలత్ – కార్యక్రమం మన వరంగల్, హనుమకొండ జిల్లా కోర్టు, నర్సంపేట, పర్కాల కోర్టులలో నిర్వహించబడుతుంది అని తెలిపారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా పెండింగ్ లో ఉన్న క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్, వివాహ సంబంధిత కేసులు, మోటార్ ప్రమాద క్లెయిములు, చెక్ బౌన్స్ కేసులు మరియు చిన్న చిన్న వివాదాల పరిష్కారములు పరిష్కరించుకోవచ్చని తెలిపారు . ఈ ప్రత్యేక లోక్ అదాలత్ కక్షిదారులు ఇబ్బందికి గురికాకుండా, రాజీమార్గం ద్వారా తమ సమస్యలను పరిష్కరించే విధంగా వెసులుబాటు కల్పిస్తున్నాము. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ద్వారా కేసుల పరిష్కారం త్వరితంగా మరియు ఇరుపక్షాల అంగీకారంతో రాజీ కుదిర్చేలా ఉంటుంది. పరిష్కారానికి వస్తున్న కక్షిదారులకు న్యాయప్రక్రియలో అధిక భారం లేకుండా ఉంటుంది. ఈ ప్రత్యేక లోక్ అదాలత్‌లో పోలీస్ శాఖ ప్రతినిధులు, న్యాయవాదులు, కక్షిదారులు ఈ లోక్ అదాలత్‌లో సమన్వయంగా సహకరిస్తారని, కేసుల పరిష్కారానికి పూర్తిగా సహకరించాలి అని కోరారు. ఈ ప్రత్యేక లోక్ అదాలత్ ను విజయవంతంగా నిర్వహించడంలో మీడియా మిత్రులు భాగస్వాములు కావాలని కోరుతున్నామని, ఈ ప్రత్యేక లోక్ అదాలత్ సమాజానికి, న్యాయవ్యవస్థకు మంచిదని మేము నమ్ముతున్నామని తెలిపారు. మన ప్రత్యేక లోక్ అదాలత్ విజయవంతం చేయాలి అని కోరారు. ఈ సందర్భంగా న్యాయ సేవాధికార సంస్థ, వరంగల్ ఆధ్వర్యంలో మోంతా తుఫాను వల్ల నష్టపోయిన వరంగల్, హనుమకొండ జిల్లాల ప్రజలకు చేయూతగా హెల్ప్ డెస్క్‌ను న్యాయ సేవా సదన్ బిల్డింగ్‌లో సోమవారం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.

వరద నష్టంపై త్వరగా సర్వేను పూర్తి చేయాలి

- రోడ్ల మరమ్మతులు సత్వరమే పూర్తి చేసి రాకపోకలకు పునరుద్ధరణ చర్యలు చేపట్టండి
- హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్
- మున్సిపల్, ఆర్ అండ్ బి అధికారులను ఆదేశాలు

హనుమకొండ ప్రతినిధి, నవంబర్ 1 (జనంసాక్షి) : హనుమకొండ వరద ప్రభావిత ప్రాంతాల్లో జరిగిన నష్టంపై సర్వే త్వరగా పూర్తిచేసి ఆ నివేదికను త్వరగా అందజేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అధికారులను ఆదేశించారు. శనివారం తీవ్ర వరద ప్రభావంతో హనుమకొండలోని సమ్మయ్య నగర్ పరిధిలోని కాలనీల్లో జరిగిన నష్టం పై అధికారులు ప్రాథమిక అంచనా కోసం సర్వే నిర్వహిస్తుండగా జిల్లా కలెక్టర్ పరిశీలించారు. క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న సర్వే తీరును కలెక్టర్ పరిశీలించి అధికారులు, బాధితులతో మాట్లాడారు. అదేవిధంగా అమరావతి నగర్ లో దెబ్బతిన్న రోడ్లను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ మాట్లాడుతూ వరద ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఇంటికి వెళ్లి నష్టం జరిగిన వివరాలను నమోదు చేయాలని అధికారులకు సూచించారు. నష్టపరిహారాన్ని అందించేందుకు ప్రాథమిక అంచనా కోసం చేపట్టిన ఈ సర్వేను త్వరగా పూర్తి చేయాలన్నారు. నష్టపోయిన ఏ ఒక్క ఇల్లు కూడా విడిచి పెట్టొద్దని పేర్కొన్నారు. నీట మునిగిన ప్రాంతాల్లోని ఇండ్లు, రోడ్లు, పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలలో పేరుకుపోయిన బురదను వెంటనే తొలగించాలని అగ్నిమాపక శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించగా ఆరు అగ్నిమాపక యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. దెబ్బతిన్న రోడ్లను సత్వరమే తాత్కాలిక మరమ్మతులు చేయించి రాకపోకలు సాగే విధంగా పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని ఆర్ అండ్ బి అధికారులను కలెక్టర్ ఆదేశించారు. వరద ముంపు భారీ నుండి తప్పించేందుకు సమ్మయ్య నగర్ , వివేక్ నగర్, అమరావతి నగర్, టీవీ టవర్ కాలనీలలో శాశ్వత పరిష్కారం కోసం రిటైనింగ్ వాల్స్ ఏర్పాటు కోసం అంచనా వేసి ప్రతిపాదనలు అందజేయాలన్నారు. ముంపు కాలనీలలో పారిశుద్ధ్య నిర్వహణను వేగవంతం చేయాలన్నారు. అక్కడ ఉన్న బాధిత కుటుంబాలతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వరద నష్టం వల్ల కలిగిన వివరాల నివేదికను ప్రభుత్వానికి అందించి పరిహారం అందించే విధంగా కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఇంకా ఎక్కడైనా దెబ్బతిన్న రోడ్లను త్వరగా మరమ్మతు పనులు చేయించి రవాణా సౌకర్యాన్ని పునరుద్ధరించాలని ఆర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కాజీపేట డిప్యూటీ కమిషనర్ రవీందర్, హనుమకొండ తహసిల్దార్ రవీందర్ రెడ్డి, సిఎంహెచ్వో డాక్టర్ రాజారెడ్డి, ఆర్ అండ్ బి డీఈలు ఉదయ్, గోపికృష్ణ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మంత్రి కొండా సురేఖ రాజీనామా చేయాలి

- మంత్రిగా ఉండి వరంగల్ తూర్పుకు ఏం తెచ్చారో తెలపాలి
- హనుమకొండ కు వచ్చిన సీఎం వరంగల్ కు రాలేకపోయారు
- సీఎం దగ్గర పరపతి కోల్పోయిన మంత్రి సురేఖ
- రైతులకు ఎకరానికి 50వేల రూపాయలు తక్షణమే ప్రభుత్వం ఇవ్వాలి
- విలేకరుల సమావేశంలో బిజెపి నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు

వరంగల్ బ్యూరో, నవంబరు 01 (జనం సాక్షి) : రాష్ట్ర పర్యావరణ అటవీ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తన పదవికి రాజీనామా చేయాలని బిజెపి నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్ రావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ సిటీ లోని క్యాంప్ కార్యాలయం నందు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రదీప్ రావు మాట్లాడుతూ వర్షభావంతో వరంగల్ తూర్పు నియోజకవర్గం లోని పలు కాలనీలు నీట మునిగిన పట్టించుకోని రాష్ట్ర మంత్రి సురేఖకు మంత్రిగా కొనసాగే హక్కు లేదన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోనూ తీవ్ర వరద ప్రభావానికి గురైన మైసయ్య నగర్, బీఆర్ నగర్, ఎన్ఎన్ నగర్, శివ నగర్, పెరుక వాడ, సంతోషిమాత కాలనీ, ఎస్సార్ సహా పలు కాలనీలు ఉన్నాయన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలోనూ భారీ నష్టం వాటిల్లినా ఇటు వైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చూడలేదని చెప్పారు. మంత్రిగా ఉండి వరంగల్ తూర్పు నియోజకవర్గం ఏం తెచ్చారో తెలపాలని ప్రశ్నించారునియోజకవర్గ ప్రజలను నిండా ముంచిన నీకు ఆ పదవిలో కొనసాగే నైతిక హక్కు లేదన్నారు. వరంగల్ తూర్పు నియజకవర్గం పై సిఎం రేవంత్ రెడ్డి కి స్థానిక మంత్రి కొండ సురేఖ కు పట్టిపింపు అన్నారు. ధంధాలు పక్కన పెట్టి ప్రజలను పట్టించుకోవాలని ప్రదీప్రావుసూచించారు. హనుమకొండ సిఎం వచ్చిన వరంగల్ కి రాలేధు అంటే మంత్రి సురేఖకు పరపతి లేధు అనేధి తేటతెల్లం అయింధి అన్నారు. రైతులకు తక్షణమే ఎకరానికి 50 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. నగరంలో వరద ముప్పుకు గురైన ప్రజలకు తక్షణమే 25 వేల నష్టపరిహారం అందించాలన్నారు. సమావేశంలో వీరితోపాటు మాజీ పార్లమెంట్ సభ్యులు సీతారాం నాయక్ , మాజీ శాసనసభ్యులు వన్నాల శ్రీరాములు , ఆరూరి రమేష్ , కొండేటి శ్రీధర్ , రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కుసుమ సతీష్ , వన్నాల వెంకటరమణ , బిజెపి సీనియర్ నాయకులు సముద్రాల పరమేశ్వర్, మెంతుల యాదగిరి, తదితర మండల అధ్యక్షులు డివిజన్ అధ్యక్షులు మోర్చాల అధ్యక్షులు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

ఎంజీఎం సూపరిండెంటెండ్‌గా డాక్టర్ హరీష్ చంద్రారెడ్డి

వరంగల్ ఎంజీఎం, నవంబర్ 1(జనంసాక్షి): శనివారం నాడు ఎం జీ ఎం నూతన సూపరింటెండెంట్ గా డా. హరీష్ చంద్రారెడ్డి బాధ్యతలు తీసున్నారు. గతంలో మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో సూపరింటెండెంట్ గా విధులు నిర్వహించారు. ఈ కార్యక్రమం లో డా. చిలుక మురళి, డిప్యూటీ ఆర్ ఎం ఓ డా. వసంత రావు, ఆర్ ఎం ఓ లు డా. శశి కుమార్, డా. అశ్విని కుమార్,డా. మమత మరియు ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నీట మునిగిన ప్రాంతాల్లో ఆస్తి నష్టం జరిగిన ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్

వరంగల్ ప్రతినిధి, నవంబర్ 1(జనంసాక్షి): ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా వరంగల్ నగరంలోని పలు ప్రాంతాల్లో నీటిమునిగిపోవడం, గృహ నష్టం, ఆస్తి నష్టం చోటుచేసుకున్న నేపథ్యంలో, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద నగరంలోని ఎన్టీఆర్ నగర్, బృందావన్ కాలనీలలో క్షేత్ర స్థాయిలో పర్యటించారు. శనివారం కలెక్టర్ సత్య శారదా దేవి తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను సందర్శించి, వరదల వల్ల ప్రజలకు జరిగిన నష్టాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. నష్టం వివరాలను సేకరిస్తున్న ఎన్యుమరేటర్లు పని తీరును సమీక్షించి, సక్రమంగా సమర్థవంతంగా నష్టపరిహారం వివరాలు నమోదు చేయాలని సూచించారు. బాధిత కుటుంబాలకు అవసరమైన తక్షణ సహాయం అందించడంలో ఎటువంటి నిర్లక్ష్యం చోటు చేసుకోకుండా చూడాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలు తక్షణమే పరిష్కరించబడేలా చర్యలు తీసుకోవాలని, పునరావాసం పరిశుభ్రత కార్యక్రమాలను వేగవంతం చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీకాంత్, రెవెన్యూ అధికారులు, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగ అరెస్టు

వరంగల్ బ్యూరో, నవంబర్ 01 (జనం సాక్షి) : రాత్రి వేళల్లో చోరీలకు పాల్పడుతున్న దొంగను కాకతీయ యూనివర్సిటీ పోలీసులు అరెస్టు చేశారు దొంగ నుండి రూ.6 లక్షల విలువ గల 40 గ్రాముల బంగారు ఆభరణాలు, 50 గ్రాముల వెండి ఆభరణాలు రూ. 56 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు దీనికి సంబంధించిన వివరాలను కేయూ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ రవికుమార్ శనివారం తెలియజేశారు. దొంగతనానికి పాల్పడుతున్నసెండే అరుణ్ కుమార్, తండ్రి పేరు రామయ్య, వయస్సు 25 సంవత్సరాలు, కులం బారే(తోటమాలి), వృత్తి స్టూడెంట్, తేజిగూడ, వాంకిడి, కొమురం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా. నేరస్తుడు స్థానిక డిగ్రీ కాలేజ్ లో బిఎస్సి బి జెడ్ సి 2022 సంవత్సరం లో పూర్తి చేసి తర్వాత ఒక సంవత్సరం ఇంటి వద్దనే ఖాళీగా ఉండి 2024 సంవత్సరం లో ఉద్యోగాల కోసం ప్రిపేర్ అవడానికి హనుమకొండకు వచ్చి కొద్ది రోజులు రూం కిరాయి తీసుకొని ఉండి చదివే క్రమం లో బెట్టింగ్ లకు బానిసైనాడు. అప్పులు చేసి అవి ఎలా తీర్చాలో తెలియక దొంగతనాలు చెయ్యడం ప్రారంబించి గోపాల్ పూర్, భీమారం ఏరియాలలో ఇంటికి తాళం వేసిన ఇళ్ళను గుర్తించి రాత్రి పూట తాళాలు పగలగొట్టి బంగారు, వెండి ఆభరణాలు, నగదు దొంగతనాలు చేస్తున్నాడని నిందితుడు సుమారు 10 నేరాలు చేసినానని ఒప్పుకోని ఇట్టి 10 కేసులలో 40 గ్రాముల గ్రాముల బంగారు ఆభరణాలు, 50 గ్రాముల వెండి ఆభరణాలు, నగదు 56,400/- రూపాయలు మొత్తం సుమారు రూ.6 లక్షల విలువ గల బంగారు అబరణాలు, వెండి ఆభరణాలు, నగదును రికవరీ చేసినట్లు తెలిపినాడు. ఇన్స్పెక్టర్ రవి కుమార్ మట్లాడుతూ ఎవ్వరైనా ఇళ్ళకు తాళాలు వేసి ఊళ్లకు వెళ్ళేటప్పుడు పక్క ఇళ్ళ వారికి గాని లోకల్ పోలీసు వారికి తెలుపాలని, ఇళ్ళకు సిసి కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించినారు. ఇటీవల కాలంలో వరుస దొంగతనాలు చేస్తూ పోలీసులకు సవాలు విసిరిన ఇట్టి దొంగను ఛాలెంజ్‌గా తీసుకొని ఇట్టి కేసులను తొందరగా ఛేదించిన ఎస్ఐలు. శ్రీకాంత్, నవీస్ కుమార్, క్రైమ్ సిబ్బంది అయిన అహ్మద్ పాషా, రాజ శేఖర్, జితేందర్‌లను, వీరికి సహకరించిన సిసిఎస్ వరంగల్ సిబ్బంది మధు, చందులను ప్రత్యేకంగా ఇన్స్పెక్టర్ రవికుమార్ అభినందించారు.

వైజ్ఞానిక పరిజ్ఞానం కోసమే ల్యాబ్‌ల ఏర్పాటు

- చదువుతోపాటు ఆటల్లో రాణించాలి
- ఎమ్మెల్యే బొజ్జు పటేల్, కలెక్టర్ అభిలాష అభినవ్

ఖానాపూర్ నవంబర్ 01 (జనం సాక్షి) : విద్యార్థుల్లో వైజ్ఞానిక పరిజ్ఞానం పెంపొందించేందుకే ప్రభుత్వ పాఠశాలలో ల్యాబ్ లను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ లు స్పష్టం చేశారు. శనివారం మండలంలోని మస్కాపూర్ జిల్లా పరిషత్ పాఠశాలలో ఆస్ట్రోల్యాబ్ ప్రారంభించిన సందర్భంగా వారు మాట్లాడారు. జిల్లాలోనే అధిక సంఖ్యలో విద్యార్థులు ఉన్న మస్కాపూర్ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పించాలనే ఏకైక లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు పోతుందని అన్నారు. పి ఎం శ్రీ పథకంలో భాగంగా 50 వేల రూపాయల విలువ చేసే ఆట వస్తువులను విద్యార్థులకు అందజేశారు. అలాగే జిల్లా స్థాయిలో రాష్ట్రస్థాయిలో మస్కాపూర్ విద్యార్థులు రాణించడం అభినందనీయమన్నారు. మస్కాపూర్ పాఠశాలను ఆదర్శంగా తీసుకొని ఇతర ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు తదితర అంశాల పై దృష్టి సారిస్తున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. సాంకేతిక పరిజ్ఞానం పెంపొందాలంటే చదువు కంటే అనుకరించడమే ప్రధానమని కలెక్టర్ అన్నారు. విద్యార్థులను తమ తల్లిదండ్రులు బాధ్యతగా ప్రతిరోజు క్రమం తప్పకుండా పాఠశాలకు పంపించాలని సూచించారు. బాల్ శక్తి కార్యక్రమంలో భాగంగా విద్యార్థిని విద్యార్థులకు పాఠశాల స్థాయిలో వైద్య పరీక్షలు సైతం నిర్వహిస్తున్నట్లు ఆమె స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉన్న సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ అన్నారు. 100 శాతం ఫలితాలు రావడం అధిక సంఖ్యలో విద్యార్థులు ట్రిబుల్ ఐటీ, ఎన్ఎంఎంఎస్ లలో అవకాశాలు పొందడం అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల ద్వారా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని అన్నారు. విద్యార్థులు చదువుపై ఎక్కుపెట్టి రాణించాలని ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సూచనలు పాటించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఎమ్మెల్యే సూచించారు. మస్కాపూర్ పాఠశాల అభివృద్ధిలో తమ వంతు సహకారం అందిస్తున్న గ్రామ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. చెడు వ్యసనాలను అలవర్చుకోకుండా సన్మార్గంలో నడవాలని సత్ప్రవర్తనతో మసలుకోవాలని విద్యార్థిని విద్యార్థులకు ఎమ్మెల్యే నిక్కచ్చిగా చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యపై ప్రత్యేక దృష్టి సారించిందని ప్రత్యక్షంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి విద్యాశాఖ అభివృద్ధి పై అహర్నిశలు కృషి చేస్తున్న విషయాన్ని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ ఈ సందర్భంగా వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులకు వివిధ విభాగాలలో వచ్చిన ప్రశంస పత్రాలను ఎమ్మెల్యే వెడ్మా బొజ్జు పటేల్, కలెక్టర్ అభిలాష అభినవ్ విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, మండల విద్యాశాఖ అధికారి సంధ్యారాణి, తహసిల్దార్ ఏ.సుజాత రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పడిగల భూషణ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అబ్దుల్ మజీద్, కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు దొనికేని దయానంద్ లతోపాటు పాఠశాల సిబ్బంది, పోషకులు, విద్యార్థిని విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ ఐఏఎస్ ఐపీఎస్ అధికారుల బృందం పర్యటన

ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి) : ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్‌లోని శిక్షణ ఐఏఎస్, ఐఆర్ఎస్, ఐపీఎస్, ఐఇఎస్, ఐఎస్ఎస్ అధికారుల బృందం జిల్లాకు పర్యటనకు వచ్చింది. ఈ సందర్భంగా శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ రాజర్షి షా, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పర్యటనకు వచ్చిన 16 మంది శిక్షణ అధికారులకు స్వాగతం పలికి వారిని పరిచయం చేసుకున్నారు. నేరడిగొండ మండలంలోని కుమారి గ్రామం, తాంసి మండలంలోని బండల నాగపూర్, తలమడుగు మండలంలోని సుంకిడి గ్రామాల్లో మూడు బృందాలుగా విభజించి పర్యటన నిర్వహించనున్నట్లు తెలిపారు. అదనంగా, ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో కూడా క్షేత్ర స్థాయి పరిశీలన చేయనున్నారు. గ్రామీణ మౌలిక సదుపాయాలు, ఆరోగ్యం, విద్య, పారిశుద్ధ్యం, వ్యవసాయం, జీవనోపాధి తదితర అంశాలపై అధికారులు అధ్యయనం చేయనున్నట్లు కలెక్టర్ వివరించారు. ఆదిలాబాద్ జిల్లా గురించి వివరిస్తూ, తెలంగాణ కశ్మీర్ గా పిలువబడే ఈ ప్రాంతంలో వివిధ మతాలు, కులాల ప్రజలు సామరస్యంగా జీవిస్తున్నారని చెప్పారు. కొమురం భీమ్‌ను ఆదివాసీలు తమ ఆరాధ్య దైవంగా భావిస్తారని, పత్తి సాగు ప్రధానంగా జరుగుతున్న రైతు ఆధారిత జిల్లా అని తెలిపారు. ఈ సమావేశంలో అటవీ అధికారి ప్రశాంత్ బాజీరావ్ పాటిల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్, అదనపు ఎస్పీ కాజల్, శిక్షణ కలెక్టర్ సలోని చాబ్రా, ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ కోఆర్డినేటర్ స్వామి, తలమడుగు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
02 నవంబర్ 2025

ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ప్రథమ కర్తవ్యం

ఖమ్మం, నవంబర్ 1 (జనంసాక్షి) : మనిషి తన జీవితంలో ఆనందంగా జీవితం కొనసాగించడానికి ఆరోగ్యాన్ని కాపాడుకోవడమే ప్రథమ కర్తవ్యంగా ఉండాల్సిన అవసరం వుంది అని ప్రముఖ ఇండస్ హాస్పిటల్ డాక్టర్ అల్లంపాటి రమేష్ రెడ్డి , సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు పేర్కొన్నారు. శనివారం మంచికంటి భవన్ లో సీపీఎం పార్టీ ఖమ్మం టూ టౌన్ కమిటీ, బోడేపూడి విజ్ఞాన కేంద్రం (బీవీకే) ఆధ్వర్యంలో నెల నెలా ఉచిత మెడికల్ బిపి, షుగర్ క్యాంపు విజయవంతంగా శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రమేష్ రెడ్డి, నున్నా నాగేశ్వరరావు లు మాట్లాడుతూ ఆధునిక కాలంలో మానవుడు తన అవసరాల కోసం సంపాదన ధ్యాసలో పడి తన ఆరోగ్య విషయంలో నిర్లక్ష్యంగా వుండటం వల్ల చిన్న వయసులోనే చాలా పెద్ద ఆనారోగ్య సమస్యలతో బారిన పడుతున్నారు అని ఆందోళన వ్యక్తం చేశారు. ఆనారోగ్యం వచ్చిన తర్వాత ఎంత డబ్బులు పెట్టినా ఒకసారి ప్రాణం దక్కదని, చిన్నప్పుడు నుంచి ప్రతి మనిషి వ్యాయామం చేయడంతో పాటు రెగ్యులర్‌గా వైద్య పరీక్షలు చేయించుకోవాలి అని సూచించారు. ఈ సందర్భంగా ప్రముఖ డాక్టర్లు సి భారవి, జయశ్రీ, జొన్నలగడ్డ వరుణ్, రావిళ్ళ రంజిత్, వెంకట్ రెడ్డి,

గుర్రం వినీల్, డి దినేష్, అభినయ్ జోగల పాల్గొన్నారు . అనంతరం బిపి, షుగర్, పక్షవాతం, న్యూరో, కిడ్నీ, ఆర్థో, కంటి పరిక్ష తదితర అనారోగ్య వైద్య సేవలు అందించి మందులు పంపిణీ చేశారు. తిరిగి వచ్చే నెల డిసెంబర్ 6న ఉచిత మెడికల్ క్యాంపు మంచికంటి పంక్షన్ హాల్‌లో జరగబోతుంది. ఈ కార్యక్రమంలో పార్టీ ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రమ్, నాయకులు వై శ్రీనివాసరావు, సుబ్బారావు, పారుపల్లి అరుణ కుమారి, బోడపట్ల సుదర్శన్, అప్జల్, జె వెంకన్న బాబు, వాసిరెడ్డి వీరభద్రం, నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలి

- **జిల్లా కలెక్టర్ అనుదీప్**

మధిర, నవంబర్ 1 (జనం సాక్షి) : మధిర మున్సిపాలిటీ పరిధిలో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్ అధికారులను ఆదేశించారు. శనివారం మధిరలో విస్తృతంగా పర్యటించారు. పర్యటనలో భాగంగా మధిర పట్టణం ముస్లిం కాలనీలో వరద ప్రభావిత ప్రాంతాన్ని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఆదేశం మేరకు జిల్లా కలెక్టర్ ముస్లిం కాలనీ, హనుమాన్ కాలనీలో వరద ముంపు ప్రాంతాన్ని పరిశీలించి శాశ్వత పరిష్కారం కోసం ప్రణాళిక సిద్ధం చేయాలని మున్సిపాలిటీ అధికారులను ఆదేశించారు. మధిర పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మిర్యాల వెంకటరమణ గుప్తా, మాజీ కౌన్సిలర్ మల్లాది వాసు వరద ప్రాంతాన్ని కలెక్టర్కి చూపించి కాలనీవాసుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కాలనీలో వరద ముంపుకు గురి కాకుండానివారణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, కాంగ్రెస్ పార్టీజిల్లా నాయకులు పాటిబండ్ల సత్యంబాబు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అద్దంకి రవికుమార్, మండల కిసాన్ సెల్ అధ్యక్షుడు దుంప వెంకటేశ్వర రెడ్డి, కాంగ్రెస్ పార్టీ

నాయకులు నిడమనూరి వంశీకృష్ణ, రెండో డివిజన్ అధ్యక్షులు షేక్ బాజీ, గౌసుద్దీన్ పట్టణ మైనార్టీసెల్ అధ్యక్షుడు షేక్ జహంగీర్, మొండితోక సుధాకర్, సంపసాల రామకృష్ణ, ఎర్రగుంట రమేష్, యన్నం కోటేశ్వరరావు, చల్లా శ్రీనివాస్ రెడ్డి, సజ్జా ప్రసాద్ మరియు రెండో డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి

భువనగిరి, నవంబర్ 1 (జనం సాక్షి) : భువనగిరి పట్టణం లోని స్థానిక ఖాజి మొహాల్ల జామలే బహార్ దర్గా కిసాన్ నగర్ బుర్హనియా దర్గా మరియు సొంటే పీర్ దర్గా లొ నిర్వహించే గంధం మరియు ఉర్సు ఉత్సవాలు ఘనంగా నిర్వహించాలి అని యాదాద్రి భువనగిరి జిల్లా గ్రంధాలయం చైర్మన్ అవైస్ చిస్తీ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా దర్గా లొ ఏర్పాట్లు పూర్తి చెయ్యాలి అని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తు భువనగిరి శాసనసభ్యులు కుంభం అనిల్ కుమార్ రెడ్డి ఆదేశాలు మేరకు భువనగిరి పట్టణం లొ ని అన్ని దర్గా ల లో పారిశుధ్యం లెట్ లొ టెంట్ ఏర్పాట్లు పూర్తి చెయ్యాలని తెలిపారు. ఈ కార్యక్రమం లొ మున్సిపల్ కమిషనర్ డి. ఈ మరియు సానేటరీ ఎస్. ఐ మరియు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కూర వెంకటేష్, ఎం డీ షరీఫ్, అభిద్ అలీ, రఘు బాబు, ఎండీ మజర్, సలాద్దీన్ఎండీ అక్తర్, ఆజాజ్, శ్రీను,సాయి ఎండీ జలీల్, దర్గా కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పోస్ట్ మెట్రిక్ దరఖాస్తులలో తలెత్తిన సమస్యలు పరిష్కరించాలి

ఖమ్మం, నవంబర్ 1 (జనం సాక్షి) : నవంబర్ 3లోగా పోస్ట్ మెట్రిక్ దరఖాస్తులలో తలెత్తిన సమస్యలు పరిష్కరించాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారిణి జి. జ్యోతి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో చదివే ఎస్సీ విద్యార్థిని, విద్యార్థులకు 2024-25 విద్యా సంవత్సరానికి గాను పోస్ట్ మెట్రిక్ ఉపకార వేతనాలు మంజూరులో తలెత్తుతున్న సమస్యలను తక్షణమే పరిష్కరించ వలసిందిగా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ కార్యదర్శి ఆదేశాలు జారీ చేశారని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీతోనే ముస్లింలకు రక్షణ, న్యాయం

కొండమల్లేపల్లి, నవంబర్ 1 (జనంసాక్షి) : కాంగ్రెస్ పార్టీ ద్వారానే మైనార్టీలకు రక్షణ, న్యాయం జరుగుతుందని జమియత్ ఉలేమా ఏ హింద్ మండల అధ్యక్షులు మౌలానా నజీర్ ఖాస్మి అన్నారు. తెలంగాణ రాష్ట్ర మంత్రివర్గ విస్తరణలో ముస్లిం మైనార్టీ కోటాలో భారత మాజీ క్రికెటర్ మొహమ్మద్ అజారుద్దీన్‌కు మంత్రి పదవి కేటాయించడంపై సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి ముస్లిం మైనారిటీ హక్కులను పరిరక్షించడం సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించే వారసత్వం ఉందన్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడంలో కాంగ్రెస్ పార్టీ అంకితభావాన్ని ప్రతిబింబిస్తుందని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలవడం ఖాయమని ముస్లిం మైనార్టీల సంపూర్ణ మద్దతు కాంగ్రెస్ పార్టీకే ఉంటుందని పేర్కొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

చింతపల్లి, నవంబర్ 1 (జనం సాక్షి) : పోషకాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి అన్నారు. చింతపల్లి మండలం కుర్మేడు నవోదయ మోడల్ పాఠశాలలో నిర్వహించిన పుడ్ ఫెస్టివల్ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు కంకణాల వెంకట్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పోషకాహారంపై అవగాహన పెంచుకొని వంటలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు అనంతుల జంగయ్య,బిఆర్ఎస్ పార్టీ నాయకులు కుంభం శ్రీశైలం గౌడ్, నాదిరి శ్రీశైలం, గండేటి వెంకటయ్య, కుర్మేటి బ్రహ్మయ్య, సోమప్ప, ఇంద్రకంటి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

యాదగిరిగుట్ట దేవస్థానంలో జరుగుతున్న అక్రమాలపై వినతి

భువనగిరి, నవంబర్ 1 (జనంసాక్షి) : యాదగిరిగుట్ట దేవస్థానంలో జరుగుతున్న అక్రమాలపై భువనగిరి జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు ఉట్కూరి అశోక్ గౌడ్ జిల్లా కలెక్టర్‌కు వినతి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో ప్రసిద్ధిగాంచినటువంటి పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఏఈఓ, డీఈవో, ఉన్నత అధికారులు దేవస్థానంలో అక్రమాలకు పాల్పడుతూ స్వామివారి ప్రతిష్టకు భంగం కలిగిస్తూ ఆగమ శాస్త్రానికి విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. దేవస్థానంలో జరుగుతున్నటువంటి అక్రమాలను సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని కలెక్టర్ ని కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షులు పాశం భాస్కర్ ,కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పడమటి జగన్మోహన్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శులు చందా మహేందర్, కాదురి అచ్చయ్య మరియు జిల్లా ఉపాధ్యక్షులు జైనపల్లి శ్యాంసుందర్

రెడ్డి, జిల్లా కౌన్సిల్ మెంబర్ మహేష్ గౌడ్, యాదగిరిగుట్ట పట్టణ అధ్యక్షులు కర్రె ప్రవీణ్, సీనియర్ నాయకులు సుర్వి శ్రీనివాస్ గౌడ్, సత్యం, మహమ్మద్, గుంటుపల్లి సత్యనారాయణ, మల్లారెడ్డి,ఆకుతోట రామకృష్ణ, మంగు నరసింహారావు పాల్గొనడం జరిగింది.

పామాయిల్ సాగుతో రైతులకు లాభం

అశ్వారావుపేట, నవంబర్ 1 (జనంసాక్షి) : భద్రాద్రి కొత్తగూడెంఅప్పారావు పేట పామాయిల్ ఫ్యాక్టరీలో (ఆయిల్ రికవరీ శాతం) 20.01 రావడంతో ఆయిల్ పేట చైర్మన్ జంగా రాఘవరెడ్డి ఆయిల్ ఫామ్ రైతులతో కలిసిఆయిల్ ఫెడ్ అధికారులను,ఫ్యాక్టరీ సిబ్బందిని అభినందించి సన్మానించారు. పంతొమ్మిదివేల నాలుగొందలు ఉన్న పామాయిల్ ధర రికవరీ శాతం పెరగడంతో మరో ఆరువందల వరకూ ధర పెరుగుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. సన్మాన కార్యక్రమం లో పాల్గొన్న ఆయిల్ ఫెడ్ చైర్మన్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో ఆయిల్ ఫెడ్ నర్సరీలలో నాసిరకం మొక్కలు వచ్చిన మాట వాస్తవమేనని, మళ్లీ అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. 10 లక్షల పామాయిల్ మొక్కలను తయారు చేయడానికి అత్యాధునిక శాస్త్రీయ పద్ధతులను అవలంబించి మొక్కలు తయారు చేస్తున్నామన్నారు. సిద్దిపేట ఫ్యాక్టరీ అందుబాటులోకి వచ్చిందని పామాయిల్ క్రషింగ్ జరుగుతుందన్నారు. అశ్వరావుపేటలో మరో పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. తెలంగాణ పామాయిల్ హబ్ గా మారటానికి మంత్రి తుమ్మల కృషి ఎనలేనిదని గుర్తు చేశారు.

ప్రజాక్షేత్రంలో ప్రజల అవసరాలు తీర్చుతా..

సంస్థాన్ నారాయణపురం, నవంబర్ 1 (జనం సాక్షి) : నారాయణపురం మండలం సర్వేల్ నుండి చౌటుప్పల్ వెళ్లే రోడ్డు మార్గం ఇరువైపులా పూర్తిగా గుంతల మయంగా మారడం వల్ల మేజర్ గ్రామ పంచాయతీ కావడంతో పాటు గ్రామంలో గురుకుల పాఠశాల ఉండటం వల్ల రద్దీ పెరగడంతో వాహనాలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది అని గ్రామ ప్రజలు చలమల్ల కృష్ణారెడ్డి, దృష్టికి తీసుకువెళ్లగా వెంటనే వారు సానుకూలంగా స్పందించి,అత్య అవసరం ఉన్న చోట సర్వేల్ గ్రామం నుండి అల్లందేవి చెరువు గ్రామం వరకు డోజర్ పెట్టీ గుంతల మయంగ మారిన రోడ్డుకు ఇరువైపుల మరమత్తులు చేయించడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు చలమల్ల యువసేన అధ్యక్షులు మునుగోడు నియోజకవర్గం శ్రీరామోజు హరికుమార్, కాంగ్రెస్ పార్టీ

సీనియర్ నాయకులు బోయ నర్సింహ్మ, పగిళ్ల శీను, ఎల్లంకి నరసింహ పగిల కృష్ణ, ఎల్లంకి జంగయ్య,నలప రాజు మహేష్, వడ్డేపల్లి రాజు, చిలుక రాజు, అనిల్ బోయ, సుర్గి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

అన్నోజిగూడలో పౌరహక్కుల దినోత్సవ అవగాహన సదస్సు

ఘట్కేసర్, నవంబర్ 1 (జనం సాక్షి) : అన్నోజీగూడ ఎస్టీ కమిటీ హాల్లో నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవం అవగాహన కార్యక్రమాన్ని ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ మెంబర్ తాల్క రాముల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా బీజేపీ ఎస్టీ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యులు తమిళనాడు రాష్ట్ర ఇంచార్జ్ బిక్కు నాథ్ నాయక్ హాజరై, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగల పట్ల వివక్ష చూపించిన వారికి ఆరు మాసాల కారాగార శిక్ష 500 రూపాయలు జరిమానా విధించబడుతుందని, అంటరానితనాన్ని పారదోలాలని ఇలాంటి అవగాహన సదస్సుల ద్వారా ప్రతి ఒక్కరికి ఈ మెసేజ్ అందే విధంగా మన వంతు ప్రయత్నం చేయాలని భారత రాజ్యాంగ నిర్మాత

బాబా సాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఆర్టికల్స్ ద్వారా ఎస్సీ ఎస్టీలకు రాజ్యాంగంలో పొందుపరిచిన హక్కులు మనం సాధించుకోవాలని మన పిల్లలను మంచి చదువులు చదివించి, వారు ఉన్నత స్థానంలో ఉండేలా.., చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉన్నది అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ డి.కావ్య , పోచారం జిపిఓ సత్యనారాయణ, పోచారం బిజెపి మున్సిపల్ అధ్యక్షుడు సురేష్ నాయక్, డి తావు నాయక్ మున్సిపల్ వర్క్ సూపర్వైజర్ తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయి పరిస్థితి ప్రతిబింబించేలా తుఫాన్ నష్టం నివేదిక

- **జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**

ఖమ్మం, నవంబర్ 1 (జనం సాక్షి) : క్షేత్రస్థాయి పరిస్థితి ప్రతిబింబించేలా తుఫాన్ నష్టం నివేదిక తయారు చేయాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టర్, కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి మొంథా తుఫాన్ నష్టం నివేదిక తయారీపై సంబంధిత అధికారులతో శనివారం టెలి కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా తుఫాన్ నష్టం అంచనా నివేదికలను తయారు చేయాలని, ఎక్కడ కూడా ఒక ఫిగర్ తప్పు ఉండటానికి వీలు లేదని సంబంధిత అధికారులను ఆదేశించారు. తుఫాన్ వల్ల నష్టం జరిగిన ప్రతి ఒక్కరికి పరిహారం ప్రభుత్వం నుంచి అందేలా చూడాలని అన్నారు. నష్టం అంచనా తయారీలలో ఎటువంటి అక్రమాలకు పాల్పడటానికి వీలు లేదని, పూర్తి పారదర్శకంగా రూపొందించాలని, వీటిని క్రాస్ చెక్ చేయడం జరుగుతుందని తప్పుడు నివేదికలు ఎక్కడైనా తెలిస్తే చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ. పద్మశ్రీ , వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది కుటుంబాలకు బాసటగా పోలీస్ భద్రత స్కీమ్

- **ఎస్పీ కె.నరసింహ**

సూర్యాపేట ప్రతినిధి, నవంబర్ 1 (జనంసాక్షి) : కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న రాంబాబు ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతి చెందిన కానిస్టేబుల్ రాంబాబు కుటుంబానికి పోలీస్ భద్రత స్కీమ్ ద్వారా నగదు చెక్కును ఎస్పీ నరసింహ శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో రాంబాబు కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు శాఖలో పని చేస్తూ ప్రాణాలు కోల్పోయిన సిబ్బంది కుటుంబాలను పోలీసు శాఖ అన్ని విధాలుగా అదుకుంటుందని అన్నారు. సిబ్బంది కుటుంబాలకు పోలీసు భద్రత స్కీమ్ బాసటగా నిలుస్తుందని అన్నారు. రాంబాబు కుటుంబ సంక్షేమానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పోలీసు కార్యాలయ అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ మంజు భార్గవి, డిసిఆర్బి డీఎస్పీ రవి, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ రామారావు, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రజాపాలనలో ఆకలి కేకలుండవు

భువనగిరి, నవంబర్ 1 (జనం సాక్షి) : కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చాక ప్రతి నిరుపేద బిడ్డ కు రేషన్ కార్డు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీ దే, ఈరోజు ప్రతి పేదవాడు కిరాణా దుకాణం వెళ్లకుండా రేషన్ షాప్‌లో ఇచ్చే సన్న బియ్యం తో కడుపు నిండా తింటున్నారు. అదేవిధంగా రాబోయే రోజుల్లో పప్పు చక్కెర కూడా పంపిణీ చేయడానికి కార్యాచరణ సిద్ధం అవుతుంది. తెలంగాణ రాష్ట్రంలో ఇక ఆకలి కేకలు, ఆకలి భాధలు ఉండకుండ ఉండడానికి తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉంది. ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా శనివారం జిల్లా కేంద్రంలోని భువనగిరి మున్సిపల్ పట్టణం,జంఖానాగూడ రేషన్ షాప్ 11 వ నెంబర్ నందు ఉచితంగా సంచుల్లో రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డ్ మాజీ కౌన్సిలర్ వడిచర్ల కృష్ణ యాదవ్ లక్ష్మి, ఉడుత రమేష్, మొహమ్మద్ అఖిల్, ఇట్టబోయిన మహేష్, నీలం నర్సింగ్ రావు, నీలం నరసింహ, కడారి శివ, నీలం సాలమ్మ, నీలం మనమ్మ,నీలం రాధ, ఇట్టబోయిన విజయలక్ష్మి,ఇట్టబోయిన శైలజ, ఇట్టబోయిన లలిత తదితరులు పాల్గొన్నారు.

శిశు విక్రయాలను అరికట్టాలి

వేములపల్లి/మాడ్గులపల్లి, నవంబర్ 1 (జనంసాక్షి) : గ్రామాలలోజరిగేశిశు విక్రయాలతోపాటు చట్టా వ్యతిరేకమైన అక్రమ దత్తత లపై అవగాహన కల్పించి నివారించేందుకు అంగన్వాడి టీచర్లు కృషి చేయాలని జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కృష్ణవేణి అన్నారు ఐసిడిఎస్ దామర చర్ల ప్రాజెక్టు సిడిపిఓ చంద్రకళ ఆధ్వర్యంలో శనివారం ఐసిడిఎస్ దామర చర్ల ప్రాజెక్టు పరిధిలోని వేములపల్లి సెక్టార్ అంగన్వాడి టీచర్ల సమావేశాన్ని నిర్వహించడం జరిగింది .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడి టీచర్లు శిశువిక్రయాలు జరగకుండా అక్రమ దత్తత ఇవ్వకుండా చూడాలని కోరారు. పిల్లలను అక్రమంగా దత్తత తీసుకోవడంచట్టా రీత్యా నేరమని, చట్టపరంగా దత్తత ఎలాతీసుకో వాలనేవిషయాన్ని ప్రతి గర్భవతి, బాలింతకు తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలోఐసిడిఎస్, సూపర్వైజర్ ,పరిమి రజనితో పాటు వేముల పల్లి సెక్టర్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి మండల కేంద్రంలో..

ఐసిడిఎస్ దామరచర్ల ప్రాజెక్టు పరిధిలోని మాడ్గులపల్లి సెక్టార్ అంగన్వాడీ టీచర్ల సమావేశాన్ని శనివారం మండల కేంద్రంలో నిర్వహించడంజరిగింది. కార్యక్రమంలో లీగల్ ఆఫీసర్ వెంకన్న పాల్గొని మాట్లాడుతూ అక్రమ దత్తత పిల్లల అమ్మకాలు పట్ల అప్రమత్తంగా ఉండాలని అంగన్వాడి టీచర్లకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసిడిఎస్ కౌన్సిలర్ రమణి , సూపర్వైజర్ లక్ష్మి, సెప్టెంబర్ పరిధిలోని అంగన్వాడీ టీచర్లు పాల్గొన్నారు.

తగ్గించినా.. తగ్గేదేలే..

జీఎస్టీ రేట్లు సవరించిన రూ.2 లక్షల కోట్లకు చేరువలో రాబడులు

దిల్లీ: వస్తు, సేవల పన్ను వసూళ్లు మరోసారి రికార్డు స్థాయిలో నమోదయ్యాయి. జీఎస్టీ రేట్లు తగ్గించినా.. పండగ కొనుగోళ్లు కలిసొచ్చాయి. దీంతో అక్టోబర్ నెలలో రూ.1.96 లక్షల కోట్ల మేర వసూళ్లు నమోదయ్యాయి. ఈ మేరకు ప్రభుత్వం శనివారం అధికారిక గణాంకాలను విడుదల చేసింది. గతేడాదితో పోల్చినప్పుడు ఈ మొత్తం 4.6 శాతం మేర పెరిగింది.కిచెన్, ఎలక్ట్రానిక్స్, ఆటోమొబైల్ సహా మొత్తం 375 రకాల ఉత్పత్తులపై సెప్టెంబర్ 22 నుంచి జీఎస్టీ రేట్లను తగ్గించిన సంగతి తెలిసిందే. దసరా నవరాత్రుల ప్రారంభం నుంచి ఈ కొత్త రేట్లు అమల్లోకి వచ్చాయి. ఒకవైపు రేట్లు తగ్గించినా నవరాత్రులు, దీపావళి పండగల నేపథ్యంలో కొనుగోళ్లు భారీ స్థాయిలో పెరిగాయి. దీపావళికి ముందే జీఎస్టీ రూపంలో శుభవార్త వింటారంటూ ప్రధాని మోదీ తన స్వాతంత్ర్య దినోత్సవం ప్రసంగంలో పేర్కొనడంతో చాలా మంది కొనుగోళ్లను వాయిదా వేసుకోవడమూ మరో కారణం.గతేడాది అక్టోబర్ నెలలో జీఎస్టీ రూపంలో రూ.1.87 లక్షల కోట్లు వసూలు జరగ్గా.. ఆ మొత్తం 1.96 లక్షల కోట్లకు పెరిగింది. ఈ ఏడాది ఆగస్టులో ఈ మొత్తం రూ.1.86 లక్షలు కోట్లు కాగా.. సెప్టెంబర్‌లో 1.89 లక్షలు కోట్లుగా నమోదైంది. గతేడాదితో పోల్చినప్పుడు 4.6 శాతం వృద్ధి కనిపించింది. గడిచిన నెలలతో పోల్చి చూసినప్పుడు సగటున 9 శాతం వృద్ధి కంటే తక్కువ నమోదు కావడం గమనార్హం. అక్టోబర్ నెల మొత్తం వసూళ్లలో రూ.1.45 లక్షల కోట్లు దేశీయ వినియోగానికి సంబంధించినవి కాగా.. దిగుమతులపై సుంకాల ద్వారా రూ.50,884 కోట్లు సమకూరాయి. జీఎస్టీ రిఫండ్స్ రూ.26,934 కోట్లు మినహాయిస్తే నికర జీఎస్టీ వసూళ్లు రూ.1.69 లక్షల కోట్లుగా నమోదయ్యాయి.

ఒకేచోట 28 చార్జింగ్ పాయింట్స్

జియో-బీపీ మొబిలిటీ హబ్

బెంగుళూరు:జియో-బీపీ తాజాగా వివిధ రకాల ఇంధనాలతో పాటు చార్జింగ్ పాయింట్లు కూడా ఒకే చోట అందుబాటులో ఉండేలా బెంగళూరులో భారీ స్థాయి సమగ్ర మొబిలిటీ హబ్‌ను తీర్చిదిద్దింది.ఇందులో పెట్రోల్, డీజిల్, సీఎన్‌జీ విక్రయి స్తుండగా, ఈవీ చార్జింగ్ హబ్‌ను కూడా ఏర్పాటు చేసింది.ఈ ఔట్‌లెట్‌లో 28 చార్జింగ్ పాయింట్లు, కేఫ్ ఉంటాయని సంస్థ చైర్మన్ సార్థక్ బెహూరియా తెలిపారు. 360 కిలోవాట్ల సూపర్‌ఫాస్ట్ చార్జర్లతో వేగవంతంగా వాహనాన్ని చార్జ్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. భారత్‌లో ఈ తరహా భారీ సమగ్ర హబ్ ఏర్పాటు చేయడం ఇదే ప్రథమమని సంస్థ తెలిపింది. జియో-బీపీకి దేశవ్యాప్తంగా 1,000 ప్రాంతాల్లో 7000 చార్జింగ్ పాయింట్లు ఉన్నాయి.

కొనుగోలుదారుల వేచిచూసే ధోరణి

- వచ్చే మూడేళ్ల వరకూ స్థిమితంగానే మార్కెట్
- నిర్మాణంలో ఉన్న ప్రాజెక్ట్‌లను పూర్తి చేయడంపైనే బిల్డర్ల దృష్టి
- ప్రాజెక్ట్స్ లాంచింగ్‌కంటే ఇన్వెంటరీ విక్రయాలే లక్ష్యం

హైదరాబాద్:'ఏంట్రా గ్యాప్ ఇచ్చావ్.. ఇవ్వలేదు. వచ్చింది' ఇది ఓ పాపులర్ సినిమా డైలాగ్. ప్రస్తుతం ఇదే పరిస్థితిలో ఉంది హైదరాబాద్ రియల్ ఎస్టేట్ రంగం! ప్రతీ ఆరేడేళ్లకు రియల్టీకి విరామ దశ సాధారణమే. తెలంగాణ ఉద్యమం, సత్యం స్కామ్, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ లెమాన్ బ్రదర్స్ కుప్పకూలడం వంటి వాటితో ఆర్థిక సంక్షోభం ఏర్పడింది. దీంతో 2007లో మొదలైన హైదరాబాద్ స్థిరాస్తి రంగ పతనం.. 2014 వరకూ కొనసాగింది. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏడాది కాలం వరకూ మార్కెట్ ఒడిదుడుకులకు లోనైంది. కొత్త రాష్ట్రం, ప్రభుత్వ విధానాలు, కార్యచరణ లపై అస్పష్టత వంటి కారణాలనేకం. ఆ తర్వాత 2015 ప్రారంభంలో మొదలైన రియల్ బూమ్ 2022 వరకూ కొనసాగింది.ఈ మధ్యకాలంలో మార్కెట్‌లో ధరలు నాలుగైదు రెట్లు పెరిగాయి. 2023లో ఎన్నికలతో స్థిరాస్తి రంగంలో మొదలైన సందిగ్ధత ఇప్పటికీ కొనసాగుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఆర్థిక అనిశ్చితి, లేఆఫ్‌లు, అపరిమిత సరఫరా, ఎఫ్ఎస్ఐపై ఆంక్షలు లేకపోవడం, అధిక ధరలు, వడ్డీ రేట్లు, ప్రభుత్వ ప్రతికూల విధానాల వంటి కారణంగా వచ్చే మూడేళ్ల వరకూ విరామ దశలోనే ఉంటుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే రియల్టీ రంగంలో ఈ విరామం మంచిదే అంటున్నారు. బిల్డర్లతో రాయితీలు, ఆఫర్లు వంటి బేరసారాలకు అవకాశం ఉంటుందంటున్నారు.పడేటప్పుడు కొంటేనే తక్కువ రేటుకు వస్తుంది. షేర్లలో పెట్టుబడులకు వర్తించే ఈ సూత్రం రియల్టీకి వర్క్‌ఔట్ అవుతుందని ఓ బడా బిల్డర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. మార్కెట్ బాగాలేనప్పుడు గృహ కొనుగోలుదారులకు మంచి సమయం. బిల్డర్లతో బేరసారాలకు అవకాశం ఉంటుంది. మాడ్యులర్ కిచెన్, ఫర్నీచర్, కార్లు వంటి ఆఫర్లు, ఉచిత రిజిస్ట్రేషన్, ధరలో రాయితీలు వంటివి అందుకునే వీలుంటుందని పేర్కొన్నారు. హైదరాబాద్ స్థిరాస్తి మార్కెట్‌లో రెండు రకాల కస్టమర్లు ఉంటారు. ప్రవాసులు, హై నెట్‌వర్త్ ఇండివిడ్యువల్స్ (హెచ్ఎన్ఐ), పెట్టుబడిదారులైన మొదటి రకంలో వీళ్లంతా పెద్దస్థాయిలో భూములు, అల్ట్రా లగ్జరీ అపార్ట్‌మెంట్లను కొనుగోళ్లు చేస్తుంటారు.ఇక, రెండో రకం రిటైల్ కస్టమర్లు. వీళ్లు సొంతంగా ఉండేందుకు గృహాలను కొనుగోలు చేస్తుంటారు. మొదటి రకం కొనుగోలుదారులేమో మార్కెట్ బాగాలేనప్పుడు కొనుగోలు చేసి, బాగున్నప్పుడు ఎక్కువ ధరకు విక్రయించేసుకుంటారు. రెండో రకమేమో మార్కెట్ బాగాలేనప్పుడు ధరలు తగ్గుతాయేమోనని భ్రమలో వేచి చూసి, మార్కెట్ బాగున్నప్పుడు ఎక్కువ ధర పెట్టి మరీ కొనుగోలు చేస్తుంటారు. వాస్తవానికి స్థిరాస్తి మార్కెట్‌లో లాభాలు అర్జించాలంటే మొదటి రకాన్ని ఫాలో అవడమే కరెక్ట్. అందుకే ప్రస్తుత సందిగ్ధ వాతావరణంలో గృహాలను కొనుగోలు చేయడమే మంచి నిర్ణయం. ఇలాంటి ప్రతికూల మార్కెట్‌లోనే ధర, వసతుల విషయంలో బిల్డర్లతో బేరసారాలకు అవకాశాలుంటాయి.విక్రయాలు అంతంతమాత్రంగా ఉన్న ప్రస్తుత రోజుల్లో కొత్త ప్రాజెక్ట్‌లు చేపట్టేందుకు బిల్డర్లు పునరాలోచిస్తున్నారు. భవిష్యత్తు అవసరాల కోసం భూములను కొని పెట్టుకోవడం, నిర్మాణ అనుమతులు తీసుకోవడం చేస్తున్నారే తప్ప ప్రాజెక్ట్ లాంచింగ్ చేసేందుకు వెనుకడుగు వేస్తున్నారు. ఊహాజనిత మార్కెట్‌లో భూముల ధరలు పెరుగుతాయే తప్ప అపార్ట్‌మెంట్ల చ.అ. రేట్లు పెరగవు. ఎందుకంటే ఇప్పటికే మార్కెట్‌లో బోలెడంత ఇన్వెంటరీ ఉంది. నిర్మాణంలో ఉన్న, రెడీగా ఉన్న ఇన్వెంటరీ పోతేగానీ కొత్త యూనిట్లకు అవకాశం ఉండదు. అలాగే ప్రీలాంచ్ ప్రాజెక్ట్‌లు, డెవలపర్లు కూడా భూముల రేట్లు పెరగడానికి కారణమే. ఎప్పుడైనా సరే స్థిరాస్తి ధరలు స్థిరంగా పెరగాలే తప్ప అమాంతం పెరగకూడదు. రాత్రికి రాత్రే పెరిగే ధరలు గాలిబుడగ వంటివే. ఎప్పటికైనా పడిపోవాల్సిందే లేకపోతే తుది కొనుగోలుదారుల మీద అదనపు భారం తప్పదు.హైదరాబాద్‌లో సొంతంగా భూమి కొనుగోలు చేసి, భవన నిర్మాణాలు చేపట్టే డెవలపర్లు చాలా తక్కువ. భూయజమానితో ఒప్పందం చేసుకొని చేపట్టే జాయింట్ డెవలప్‌మెంట్ ప్రాజెక్ట్‌లే ఎక్కువగా ఉంటాయి. ఏ ప్రాజెక్ట్‌కైనా విక్రయాలు చాలా ముఖ్యం. ప్రాజెక్ట్ నిర్మాణానికి అయ్యే వ్యయాన్ని డెవలపర్లు తమ జేబులోంచి వెచ్చించరు. ప్రాజెక్ట్ రుణం, కొనుగోలుదారులకు అపార్ట్‌మెంట్ల విక్రయాల ద్వారా వచ్చే సొమ్ముతోనే నిర్మాణ పనులు చేస్తుంటారు. ప్రతి సంవత్సరం హైదరాబాద్ మార్కెట్‌లో 50 వేల యూనిట్ల అపార్ట్‌మెంట్లు అవసరం ఉంటాయి. సొంత నిధులతో స్థలం భూమి కొనుగోలు చేసి ప్రాజెక్ట్‌లు చేపట్టే వాళ్లు ఎంత వరకు సప్లై చేయగలరు. ఎక్కువ రేటుకు భూములు కొన్నవారు ఆ మేరకు లాభాలపైనే ఫోకస్ చేస్తారు. వేలం వెర్రిగా భూముల వేలంతో మార్కెట్‌లో సానుకూలత ఏర్పడినా అంతిమంగా ఆ భారం గృహ కొనుగోలుదారులపైనే పడుతోంది. సామాన్య, మధ్యతరగతికి ఇళ్లు అందుబాటులో ఉండవు.ఏ పట్టణ ప్రాంతం అభివృద్ధికైనా కావాల్సింది విద్యా, వైద్యం, వినోదం, ఉద్యోగ అవకాశాలు. నగరవాసుల నాణ్యమైన జీవితాన్ని నిర్ణయించేవి ఈ నాలుగే. వీటిల్లో భాగ్యనగరం కేంద్ర బిందువనేది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. మెడికల్ టూరిజం, ఎడ్యుకేషనల్ హబ్, ఎంటర్‌టైన్‌మెంట్ జోన్లకు పెట్టింది పేరైన హైదరాబాద్‌లో ఐటీ, ఫార్మా, తయారీ రంగాలతో అపారమైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలున్నాయి. ఇతర నగరాలతో పోలిస్తే భాగ్యనగరానికి ఉన్న మరో అద్భుతమైన అవకాశం మెరుగైన మౌలిక వసతులున్న అపారమైన భూముల లభ్యత, ఔటర్, మెట్రోలతో కనెక్టివిటీ. దీంతో నగర రియల్టీ మార్కెట్‌కు ఎలాంటి ఢోకా ఉండదని నిపుణులు చెబుతున్నారు.మౌలిక సదుపాయాల అభివృద్ధిపై నిరంతరం దృష్టి పెడుతూనే పెట్టుబడిదారులకు మరింత సానుకూల వాతావరణాన్ని ప్రభుత్వం కల్పించాలని స్థిరాస్తి సంఘాలు సూచిస్తున్నాయి. పారిశ్రామిక పాలసీ, రీజనల్ రింగ్ రోడ్డు, మూసీ సుందరీకరణ, ఫార్మా క్లస్టర్లు, సెమీ కండక్టర్ల పాలసీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సిటీ వంటి ఏదైనా ఎప్పటికప్పుడు నిర్ణయాలు తీసుకొని వాటి అమలుకు చర్యలు చేపట్టాలి. ఈ విషయాన్ని ప్రజలకు చేరవేసి ఒక సానుకూల వాతావరణాన్ని రాష్ట్రంలో తీసుకురావాలి. ఆరోగ్యం, పర్యాటక రంగాలకు విశేష ప్రాధాన్యం ఇస్తూ ప్రోత్సహించాలి. ప్రభుత్వం దార్శనికతతో ప్రణాళికలు రూపొందిస్తే ఎన్నెన్నో అద్భుతాలు సృష్టించవచ్చు. ఇవన్నీ రియల్టీ రంగానికి ఇంధనంగా ఉపయోగపడతాయి.

జియోమార్ట్‌లో ఐఫోన్‌పై భారీ తగ్గింపు!

న్యూఢిల్లీ:యాపిల్ హాలిడే సేల్ను మిస్ అయ్యారా? ఆందోళన అవసరం లేదు. జియోమార్ట్ఇప్పుడు ఐఫోన్ ప్రేమికుల కోసం అత్యంత లాభదాయకమైన ఆఫర్ తీసుకువచ్చింది.ఐఫోన్ 16 ప్లస్ (128 బీజీ) మోడల్ ఇప్పుడు జియోమార్ట్ లో కేవలం రూ .65,990 లకే లభిస్తోంది .ఐఫోన్ 16 ప్లస్ 128బీజీవేరియంట్అసలు ధర రూ.89,900 కాగానేరుగారూ. 23,910 తగ్గింపుఅందిస్తోంది. అదనంగా ఎస్బీఐ కో-బ్రాండెడ్ ప్లాటినం క్రెడిట్ కార్డుద్వారా ఈఎంఐ లావాదేవీలపై 5% క్యాష్ బ్యాక్ (రూ.1,000 వరకు) లభిస్తుంది. తద్వారా ఫోన్ధరరూ.64,990 లకు తగ్గుతుంది. అంతేకాకుండాపాత స్మార్ట్‌ఫోన్‌ను ఎక్స్ఛేంజ్ చేయడం ద్వారా మరింత అదనపు తగ్గింపు పొందవచ్చు.యాపిల్ అధికారికంగా ఐఫోన్ 17 విడుదలనేపథ్యంలోఐఫోన్ 16 సిరీస్ ధరను తగ్గించినప్పటికీ, జియోమార్ట్ ధరలు అధికారిక స్టోర్ సవరించిన ధరరూ.79,900 కంటే గణనీయంగా తక్కువగా ఉన్నాయి.

ఐఫోన్ 16 ప్లస్ప్రధాన స్పెక్స్

డిస్ప్లే:6.7 అంగుళాల సూపర్రెటీనాఎక్స్డీఆర్ఓఎల్ఈడీ, సిరామిక్షీల్డ్స్ ప్రొటెక్షన్

ప్రాసెసర్:యాపిల్ఏ18 చిప్, 6-కోర్ సీపీయూ, 5-కోర్ జీపీయూ

కెమెరా సెటప్:48 ఎంపీ మెయిన్ ఫ్యూజన్ కెమెరా, 12ఎంపీ అల్ట్రా వైడ్ కెమెరా, 2ఎంపీ ఆప్టికల్ క్వాలిటీ టెలిఫోటో జూమ్, కొత్త కెమెరాకంట్రోల్బటన్ద్వారా త్వరిత యాక్సెస్ బ్యాటరీ:27 గంటల వరకు వీడియో ప్లేబ్యాక్ డిజైన్:అల్యూమినియం ఫ్రేమ్, ఐపీ68 వాటర్, డస్ట్రెసిస్టెంట్

గుడ్ల ధరలు

హైదరాబాద్	వరంగల్
₹ 5.70	₹ 5.72

బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

₹ 1,12,750 (22 క్యారెట్లు)	₹ 1,23,000 (24 క్యారెట్లు)

వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,66,000

ఇదెక్కడి న్యాయం?..

- ట్రంప్‌పై విరుచుకుపడ్డ కమలా హారిస్

వాషింగ్టన్:అమెరికా మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తతారు. అధ్యక్ష భవనం వైట్‌హౌజ్‌లో భారీ వ్యయంతో బాల్‌రూమ్ నిర్మించాలన్న ప్రణాళికను ఆమె తీవ్రంగా తప్పుబట్టారు.పిల్లల ప్రాణాలకు సంబంధించిన విషయాన్ని పట్టించుకోని ఈ చర్యను అసహ్యకరమైందిగా పేర్కొంటూ ట్రంప్‌పై విరుచుకుపడ్డారు.జాన్ స్టీవర్ట్ నిర్వహించిన ది విక్లీ షో పోడ్‌కాస్ట్‌లో పాల్గొన్న హారిస్ ఈ అంశంపై మాట్లాడుతూ ఊగిపోయారు. ''ఆ మనిషి తన ధనిక మిత్రుల కోసమే బాల్‌రూమ్ నిర్మిలించాలనుకుంటున్నారు. ప్రభుత్వం షట్‌డౌన్ సమయంలో తీసుకోవాల్సిన నిర్ణయమేనా ఇది?. అసలు ఆ

మనిషి ప్రజల గురించి పట్టించుకోరా?

సిగ్గుందా?..అమెరికాలో పేద కుటుంబాలకు ప్రభుత్వం అందించే ఆహార సహాయం నిలిచిపోయే పరిస్థితిలో ఉంది. ఆకలితో మరణాలు సంభవించే పరిస్థితి నెలకొంది. మరి ఆ చిన్నారుల పరిస్థితి ఏంటి?.. వాళ్ల గురించి ఆ మనిషి కనీసం ఆలోచించరా? అంటూ ఆగ్రహంతో కమలా హారిస్ ఊగిపోయారు వ్యవస్థను కదిలించడం వేరు, దాన్ని నాశనం చేయడం వేరు. ప్రజలు ఆకలితో బాధపడుతున్న సమయంలో ఈ విధమైన ప్రాజెక్టులు అసహ్యకరమైనవి అని అభిప్రాయపడ్డారు.చిన్నపిల్లలు ఆకలితో బాధపడుతున్న సమయంలో స్నాప్‌బెనిఫిట్స్ ముగియబోతున్నాయి. కానీ అధ్యక్షుడు బాల్‌రూమ్ నిర్మాణం గురించి ఆలోచిస్తున్నారు. ఇది అమానవీయం అని కమలా హారిస్ తేల్చేశారు. ఇది అమెరికా ప్రభుత్వం నిర్వహించే ఆహార సహాయ కార్యక్రమం, దీని ద్వారా అర్హత కలిగిన పేద కుటుంబాలకు ఫుడ్ స్టాంప్స్ లేదంటే %జుఁదీ% కార్డుల ద్వారా నెలకు కొన్ని డాలర్లు అందిస్తారు. ఈ డబ్బుతో వారు ఆహార పదార్థాలు కొనుగోలు చేయగలుగుతారు.ఇదిలా ఉంటే.. వైట్‌హౌజ్‌లోని ఈస్ట్ వింగ్‌లోని భాగాన్ని కూల్చేసి అత్యాధునికంగా బాల్‌రూమ్‌ను నిర్మించే ప్రయత్నంలో ట్రంప్ ఉన్నారు. ఈ ప్రాజెక్టుకు 300 మిలియన్ డాలర్ల ఖర్చు అవుతుందని అంచనా. అయితే.. ఈ మొత్తం ప్రాజెక్టు పూర్తిగా ప్రైవేట్ విరాళాలతోనే కట్టబడుతున్నట్లు ట్రంప్ ప్రభుత్వం ఇప్పటికే స్పష్టత ఇచ్చింది. అయినప్పటికీ విమర్శలు మాత్రం ఆగడం లేదు.డెమోక్రాట్లు, రిపబ్లికన్ల మధ్య హెల్త్ ఇన్సురెన్స్ సబ్సిడీ, ఫారిన్ఎయిడ్.. ఇతరత్రా ఫెడరల్ బడ్జెట్ విషయంలో మనీ బిల్లులపై సెనేట్‌లో ఏకాభిప్రాయం(13 సార్లు ఓటింగ్ జరిగినా) కుదరలేదు.దీంతో అమెరికా ప్రభుత్వం షట్‌డౌన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంటే.. జీతం లేకుండా ప్రభుత్వ ఉద్యోగులు పని చేయాల్సిన పరిస్థితి అన్నమాట. దీంతో ఫుడ్ బెనిఫిట్స్, మిలిటరీ పే, ఇతర సంక్షేమ పథకాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. నేటితో షట్‌డౌన్ 31వ రోజుకి చేరుకుంది. పోలిమార్కెట్ బెట్టింగ్ అంచనాల ప్రకారం, నవంబర్ 16 తర్వాతే షట్‌డౌన్ ముగిసే అవకాశం ఎక్కువగా కనిపిస్తోంది.

తండ్రి మత్స్యకారుడు.. కొడుకు బుర్జ్ ఖలీఫా ఓనర్

అబుదాబి:దుబాయ్ అంటే అందరికీ 'బుర్జ్ ఖలీఫా' గుర్తొస్తుంది. ప్రపంచంలో అత్యంత ఎత్తైన భవనంగా ప్రసిద్ధి చెందిన ఈ బుర్జ్ ఖలీఫాను ఒక మత్స్యకారుడి కుమారుడు నిర్మించారనే విషయం బహుశా చాలామందికి తెలిసుండకపోవచ్చు.ఈ కథనంలో ఆ వివరాలను తెలుసుకుందాం. బుర్జ్ ఖలీఫాను.. దుబాయ్‌లోని ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ ఎమ్మార్ ప్రాపర్టీస్ నిర్మించింది. ఈ కంపెనీ ఫౌండర్ 'మహమ్మద్ అలబ్బర్' ఈయనే బుర్జ్ ఖలీఫా యజమాని.

తండ్రి మత్స్యకారుడు

మహమ్మద్ అలబ్బర్.. దుబాయ్‌లో ఒక సాధారణ, మధ్యతరగతి కుటుంబంలో జన్మించారు. ఈయన తండ్రి ఒక మత్స్యకారుడు. చిన్నప్పుడు తన తండ్రి చేసే పనిలో సహాయం చేసేవాడు. పట్టుదల, క్రమశిక్షణ, వినయాన్ని నా తండ్రి నుంచే నేర్చుకున్నానని అలబ్బర్ అనేక ఇంటర్వ్యూలలో పేర్కొన్నారు.ప్రాథమిక విద్యను దుబాయ్‌లో పూర్తిచేసిన మహమ్మద్ అలబ్బర్.. ఆ తరువాత ప్రభుత్వం అందించిన స్కాలర్‌షిప్ ద్వారా అమెరికాలో బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ పూర్తి చేశారు. ఆ తరువాత 1981లో స్వదేశానికి (దుబాయ్) తిరిగి వచ్చాడు. అలబ్బర్ అమెరికా నుంచి కేవలం డిగ్రీతో రాలేదు. జీవితంలో ఎదగడానికి ఎదో ఒకటి చేయాలనే లక్ష్యంతో వచ్చాడు.

బ్యాంక్‌లో ఉద్యోగం

అలబ్బర్ తన కెరియర్‌ను యుఎఈ సెంట్రల్ బ్యాంక్‌లో ప్రారంభించి, ఆర్థిక వ్యవస్థల గురించి పూర్తిగా తెలుసుకున్నాడు. పనితనంతో అందరి దృష్టినీ ఆకసారిస్తూ.. చాలా తక్కువ కాలంలోనే ఆయన దుబాయ్ ఆర్థిక అభివృద్ధి విభాగానికి డైరెక్టర్ జనరల్ అయ్యారు. ఆ సమయంలోనే దుబాయ్ దార్శనిక పాలకుడు 'షేక్ మహమ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్'తో పరిచయం ఏర్పడింది. ఆ తరువాతే భవిష్యత్తును ఊహించాడు.1997లో అలబ్బర్ ఎమ్మార్ ప్రాపర్టీస్‌ను స్థాపించినప్పుడు. ఆ సమయంలో చాలామంది ఎగతాళి చేశారు. కానీ ఒక దశాబ్దంలోనే దీనికి ఎనలేని గుర్తింపు లభించింది. ఆ తరువాత దుబాయ్ ఫౌంటెన్, డౌన్‌టౌన్ దుబాయ్, దుబాయ్ మాల్ వంటి నిర్మాణాలను పూర్తిచేసి.. ఈ రంగంలో అలబ్బర్ ఒక ప్రత్యేకమైన గుర్తింపు పొందాడు.

బుర్జ్ ఖలీఫా గురించి

ప్రపంచంలో ఎత్తైన భవనం బుర్జ్ ఖలీఫా.. అత్యంత ఖరీదైన అపార్ట్‌మెంట్ భవనాల్లో కూడా ఒకటి. ఇందులో సింగిల్ బెడ్ రూమ్ అద్దె ఏడాదికి 180000 - 250000 దిర్హామ్‌లు (రూ. 40 లక్షల నుంచి రూ. 55 లక్షలు).బుర్జ్ ఖలీఫా ఎత్తు 829.8 మీటర్లు (2,722 అడుగులు). ఇందులో 163 అంతస్తులు ఉన్నాయి. 2004లో ప్రారంభమైన ఈ భవనం నిర్మాణం 2010కి పూర్తయింది. 95 కిలోమీటర్ల నుంచి కూడా కనిపించే ఈ భవనంలో 304 విలాసవంతమైన హోటల్ రూల్స్, 900 హై-ఎండ్ అపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. ఈ బిల్డింగ్ బయటివైపు శుభ్రం చేయడానికే సుమారు మూడు నెలల సమయం పడుతుందని సమాచారం.

ఐరాసలో భారత్ తరఫున ప్రసంగించిన మిథున్‌రెడ్డి

ఢిల్లీ: వైఎస్సార్‌సీపీ లోక్‌సభ పక్షనేత, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డికి అరుదైన అవకాశం లభించింది. ఐక్యరాజ్య సమితి 80వ సర్వసభ్య సమావేశంలో భారత్ తరఫున ఆయన తాజాగా ప్రసంగించారు న్యూయార్క్‌లోని భారత రాయబార కార్యాలయం ఇందుకు సంబంధించిన ప్రసంగాన్ని పోస్ట్ చేసింది.అంతర్జాతీయ లా కమిషన్ ఆరవ కమిటీ పని నివేదికపై ఆయన భారత ప్రతినిధిగా మాట్లాడారు. పైరసీ, సాయుధ దోపిడి నిరోధానికి కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ఉపయోగించాలని ఆయన ఈ సందర్భంగా తెలిపారు. అలాగే.. ప్రభుత్వ అధికారుల ఇమ్యూనిటీ ముసాయిదా నిబంధనలపై భారత్ అభ్యం తరాలను మిథున్‌రెడ్డి తెలియజేశారు.ఆయన ప్రసంగం.. ''పరస్పర సంప్రదింపులు, చర్చల ద్వారానే వివాదాలకు పరిష్కారం దొరుకుతుందని భారత్ విశ్వసిస్తోంది. ఐక్యరాజ్యసమితిలో భారత్ వ్యవస్థాపక సభ్య దేశం. ఐక్యరాజ్యసమితి విధివిధానాలకు మా దేశం కట్టుబడి ఉంది. వర్తకం, పెట్టుబడులలో తలెత్తే వివాదాల పరిష్కారాలకు ఐక్యరాజ్యసమితి విధానాలకు అనుగుణంగా పనిచేస్తోంది. ఆర్బిట్రేషన్, ప్రత్యామ్నాయ పరిష్కార విధానాల ద్వారా సమస్యలను పరిష్కరిద్దాం అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వాల మధ్య వివాదాలను కూడా ఇలాంటి పద్ధతుల ద్వారా శాంతియుతంగా పరిష్కరించుకోవచ్చు. వ్యక్తిగత మానవ హక్కులు, న్యాయ సౌలభ్యం, అంతర్జాతీయ సంస్థల స్వతంత్ర పని విధానాల మధ్య సమతుల్యత అవసరం. అంతర్జాతీయ సంస్థల మధ్య వివాదాల పరిష్కార సమయంలో దౌత్యపరమైన రక్షణలు అవసరం. అలాగే..పైరసీ, ఆయుధాల దోపిడి నిరోధానికి సమగ్రమైన లీగల్ ఫ్రేమ్ వర్క్ అవసరం ఉంది. అంతర్జాతీయ చట్టాలను, ఒప్పందాలను సమగ్రంగా తయారు చేయాలి. కొత్త టెక్నాలజీలను ఉపయోగించడం ద్వారా వీటిని నిరోధించాలి. ఆయుధాల దోపిడీ నిరోధానికి సముద్ర చట్టాలను పరిగణలోకి తీసుకోవాలి.

'నాలుగో పిరమిడ్' లేచింది

- అద్భుతం అనాల్సిందే!
- రెండు దశాబ్దాల సుదీర్ఘ ప్రయాణం

కైరో: ప్రపంచ ప్రసిద్ధి చెందిన పురాతన అద్భుతాలకు నిలయమైన ఈజిప్ట్ ఇప్పుడు మరో విశేష కట్టడాన్ని ఆవిష్కరిస్తోంది. గిజా పీఠభూమి పక్కన నిర్మితమైన గ్రాండ్ ఈజిప్షియన్ మ్యూజియం (జెమ్) దీర్ఘకాల నిరీక్షణ తర్వాత నవంబర్ 4న ప్రజల సందర్శనార్థం స్వాగత ద్వారాలు తెరుస్తోంది.రూపకల్పనలో ఈ మ్యూజియం పిరమిడ్‌ల ప్రతిరూపంలా ఉండటంతో దీనిని స్థానికులు 'నాలుగో పిరమిడ్'గా అభివర్ణిస్తూ, ఇది అందనంత ఎత్తున ఉండటంతో అంతెత్తున లేచిన నాలుగో పిరమిడ్ అని అంటున్నారు.2002లో అప్పటి అధ్యక్షుడు హోస్నీ ముబారక్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ ప్రాజెక్టు రాజకీయ మార్పులు, 2011 తిరుగుబాటు, కోవిడ్ మహమ్మారి తదితర సవాళ్ల కారణంగా పలుమార్లు నిలిచిపోయింది. దాదాపు 20 ఏళ్ల తర్వాత, 1 బిలియన్ వ్యయం తో పూర్తి స్థాయిలో రూపుదిద్దుకుంది. మ్యూజియం విస్తీర్ణం 24,000 చదరపు మీటర్లు. ఇందులో 2,58,000 చదరపు అడుగుల శాశ్వత ప్రదర్శన స్థలం ఉంది. ప్రతీ ఏటా కనీసం ఐదు మిలియన్ల మంది సందర్శకులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు.గిజా పీఠభూమిలోని ఖుఫు, ఖఫ్రే, మెన్‌కౌరే పిరమిడ్‌ల సమీపంలో నిలిచిన ఈ మ్యూజియం రూపకల్పనను ఐరిష్ సంస్థ హెనెగాన్ పెంగ్ ఆర్కిటెక్ట్స్ తీర్చిదిద్దింది. భవనాన్ని త్రిభుజాకార గాజుతో రూపొందించడంతో పక్కనే ఉన్న పిరమిడ్‌లకు ఒక చారిత్రక సౌందర్యం జత అయినట్లు కనిపిస్తోంది. భవనం మధ్యలో ఆరు అంతస్తుల భారీ మెట్లు, వాటి ఇరువైపులా ఫారోల విగ్రహాలు, దేవాలయాల అవశేషాలు, పురాతన సమాధులు ఏర్పాటు చేశారు. పై అంతస్తు నుండి మూడు పిరమిడ్‌ల దృశ్యం ప్రత్యక్షంగా కనిపించేలా దీనిని తీర్చిదిద్దారు.జీఈఎం (జెమ్)లో మొత్తం లక్షకు పైగా పురాతన కళాఖండాలు ఉన్నాయి. వీటిలో సుమారు సగభాగం ప్రదర్శనలో ఉండగా, మిగిలినవి ఉష్ణోగ్రత నియంత్రిత నిల్వ స్థావరాల్లో భద్రపరిచారు. ఈ కళాఖండాలు ఈజిప్టు ఫారోల 30 వంశాల కాలాన్ని, అంటే దాదాపు 5,000 ఏళ్ల నాగరికతను ప్రతిబింబిస్తాయి.మ్యూజియం ప్రధాన ద్వారం వద్ద 11 మీటర్ల ఎత్తయిన రామ్సెస్ ది గ్రేట్ విగ్రహం సందర్శకులను స్వాగతిస్తుంది. 19వ వంశానికి చెందిన ఈ రాజు క్రీ.పూ. 1279-1213 కాలంలో పాలించాడు. 1820లో మెంఫిస్ ప్రాంతంలో కనుగొన్న ఈ విగ్రహం అనేక ప్రదేశాకు తరలించాక, చివరకు జెమ్‌లో స్థిర నివాసం పొందింది.మ్యూజియంలోని 1922లో పురావస్తు శాస్త్రవేత్త హోవార్డ్ కార్టర్ కనుగొన్న టుటన్‌ఖామున్ సమాధి నుండి వెలికితీసిన 5,000 విలువ

శిక్షణ పొందిన అభ్యర్థులకు సర్టిఫికెట్ల ప్రదానం

హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ డా.బి.నరేందర్ రావు

కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 01(జనంసాక్షి) : డా. బి.ఎన్. రావు హెల్త్ ఫౌండేషన్ సౌజన్యంతో, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్స్ట్రక్షన్ ఆధ్వర్యంలో పురుషుల కోసం ఉచితంగా నిర్వహించిన ఆర్‌పీఎల్ వన్డే ట్రైనింగ్ ప్రొగ్రాం విజయవంతంగా ముగిసింది. ఈ కార్యక్రమంలో రెండు బ్యాచ్‌లకు చెందిన మొత్తం 20 మంది పురుషులు శిక్షణ, అప్రైజల్ పూర్తిచేసి సర్టిఫికేట్‌లు గంగధారలోని ఎన్ఏసీ కేంద్రంలో ప్రదానం చేశారు. ఈ సందర్భంగా హెల్త్ ఫౌండేషన్ చైర్మన్ బి.ఎన్.రావు మాట్లాడుతూ... ఈ శిక్షణా కార్యక్రమం ద్వారా నైపుణ్యం ఉన్న వ్యక్తులు సర్టిఫికేట్‌ల ద్వారా స్వయం ఉపాధి అవకాశాలు, ఉద్యోగ అవకాశాలను పొందగలుగుతున్నారన్నారు. నైపుణ్యాభివృద్ధిని ప్రోత్సహించడం తవ ప్రధాన లక్ష్యమన్నారు. భవిష్యత్తులో ఎన్ఏసీ సంస్థతో కలిసి మరిన్ని శిక్షణా కార్యక్రమాలు నిర్వహించి ఆర్థిక స్వావలంబన కల్పించడానికి కృషి చేస్తామన్నారు. ఎన్ఏసీ అసిస్టెంట్ డైరెక్టర్ రమేష్ మాట్లాడుతూ... ఈ శిక్షణ ద్వారా పురుషులు స్వయం ఉపాధి అవకాశాలను సృష్టించుకోవడం ఒక గొప్ప ముందడుగు అన్నారు. బీఎన్ రావు హెల్త్ ఫౌండేషన్ అందిస్తున్న ఆర్థిక సహకారం ప్రశంసనీయమన్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజాభివృద్ధికి దోహదపడతాయన్నారు. ప్రతి శిక్షణార్థికి రూ.1200 చొప్పున మొత్తం రూ. 24,000 ఫౌండేషన్ ఆధ్వర్యంలో చెల్లించబడుతుందన్నారు. ఇలాంటి కార్యక్రమాలు కరీంనగర్ జిల్లా అన్ని మండలాల్లో ప్రతి నెల నిర్వహించడానికి ప్రణాళిక సిద్ధమైందన్నారు. ఈ కార్యక్రమంలో డా. శ్రీనాథ్ చట్ల, ఎన్ఏసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పేదవారి పట్ల చిత్తశుద్ధి ఉన్న పార్టీ కాంగ్రెస్ పార్టీ

- చెక్కుల పంపిణీ విషయంలో జాప్యం వహించం.
- హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ఒడితల ప్రణవ్ బాబు

వీణవంక నవంబర్ 1 (జనం సాక్షి): వీణవంక పేదవారి పట్ల ఆరోగ్య రీత్యా హాస్పిటల్ లో చేరికైన వారికి మానవతా దృక్పథంతో అందించే సీఎంఆర్ఎఫ్ చెక్కుల విషయంలో ఎలాంటి జాప్యం వహించకుండా చెక్కులు వచ్చిన వెంటనే లబ్ధిదారులకు అందజేస్తున్నామని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఒడితల ప్రణవ్ బాబు అన్నారు.శనివారం రోజున హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వీణవంక మండలానికి చెందిన లబ్ధిదారులకు 12,50,000 విలువ చేసే సీఎంఆర్ఎఫ్ 37 చెక్కులను లబ్ధిదారులకు ప్రణవ్ బాబు లబ్ధిదారులకు స్వయంగా అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చెక్కులు వచ్చిన లబ్ధిదారులు త్వరగా బ్యాంకులో డిపాజిట్ చేసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ పార్టీ అంటే పేదల పార్టీ అని పేద వారికి అండగా ఉండడం తమ కర్తవ్యమని అన్నారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు కష్టకాలంలో ఆదుకున్న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులకు,పార్టీ ఇంచార్జీ ప్రణవ్ బాబుకు కు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఎక్కేటి రఘుపాల్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు ఎండి సాహెబ్ హుస్సేన్,గంగాడి తిరుపతిరెడ్డి,ఎండి రషీద్ నాయకులు ఉపేందర్ రెడ్డి,తోకల సంపత్ రెడ్డి, నల్ల కొండల్ రెడ్డి,రామకృష్ణ నాయకులు కార్యకర్తలు లబ్ధిదారులు పాల్గొన్నారు.

నేడు కరీంనగర్‌లో ఐఎంఎ 9వ రాష్ట్ర సమావేశం

ఐఎంఎ రాష్ట్ర అధ్యక్షుడు డా. పి.కిషన్ ప్రమాణ స్వీకారం

కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 01(జనంసాక్షి): కరీంనగర్‌లోని వి కన్వెన్షన్ హాల్‌లో ఆదివారం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ తెలంగాణ రాష్ట్ర 9వ సమావేశం నిర్వహిస్తామని, ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన డా. పి. కిషన్ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్గనైజింగ్ కమిటీ చైర్మన్ కిషన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ పొలాస రాంకిరణ్ తెలిపారు. కరీంనగర్ ఐఎంఎ హాల్లో శనివారం రోజు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాజీ రాష్ట్ర అధ్యక్షులు డా. శ్యాంసుందర్, డా. బీఎన్ రావు, డా. విజేందర్ రెడ్డి మాట్లాడుతూ... ఈ సమావేశంలో అధునాతన వైద్య విదానాలపై నిపుణులు చర్చిస్తారని, ఐఎంఎ చేపట్టనున్న కార్యక్రమాలపై సుదీర్ఘంగా చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుదిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే గంగుల కమలాకర్, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డితో పాటు తెలంగాణలోని 33 జిల్లాలకు చెందిన ఐఎంఎ ప్రతినిధులు పాల్గొంటారని అన్నారు. ఈ సందర్భంగా సమావేశ బ్రోచర్ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఐఎంఎ జిల్లా అధ్యక్షురాలు డా. ఆకుల శైలజ, కార్యదర్శి డా. మహేశ్‌బాబు, కోశాధికారి డా.నీలిమ, డా.సిహెచ్ విజయ్ కుమార్, డా. వసంత రావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు, శిశు విక్రయాపై అప్రమత్తంగా ఉండాలి

నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ, నవంబర్ 1 (జనం సాక్షి) : శిశువిక్రయాలు, బాల్య వివాహాలు, బాలికల పై లైంగిక దాడుల వంటివి జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. అన్ని సంక్షేమ శాఖల అధికారులు ఆర్‌సిఓలు ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని జిల్లాలో ఎక్కడ శిశు విక్రయాలు జరగకుండా, అలాగే బాల్య వివాహాలు, హాస్టల్ విద్యార్థులపై లైంగిక దాడులు వంటివి జరగకుండా చూడాల్సిన అవసరం ఉందని అన్నారు. ఎక్కడైనా శిశు విజరయాలు జరిగితే సంబంధిత శాఖల అధికారులపై చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. జిల్లాలో ఇటీవల శిశు విక్రయాలు, బాల్య విద్యార్థులపై లైంగిక దాడులు, బాల్యవివాహాలు, తదితర సంఘటనల నేపథ్యంలో శనివారం కలెక్టర్ కార్యాలయంలో సంక్షేమ అధికారులు, ఆర్సిఓలతో సమీక్ష నిర్వహించారు.

అభివృద్ధి చెందిన సమాజంలో ఇంకా శిశు విక్రయాలు, బాలికలపై లైంగిక దాడుల వంటివి జరగడం సిగ్గుచేటని అన్నారు. అన్ని శాఖలు ఈ విశయాలపై క్షేత్రస్థాయిలో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని అన్నారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శిశు గృహాలపై విస్తృత ప్రచారం కల్పించాలని, బిడ్డలను కన్న ఏ తల్లి దండ్రులు శిశువులను అమ్మడం ,దత్తత ఇవ్వడం వంటివి చేయకుండా ఉండాలని కోరారు. ఇలాంటి చర్యలకు ఎవరైనా పాల్పడితే చట్టాలు కఠినంగా ఉంటాయన్న విషయం మర్చిపోవద్దని తెలిపారు. సిడిపిఓలు వారి పరిధిలోని గ్రామాలలో విస్తృతంగా పర్యటించి ప్రజలకు అవగాహన కల్పించాలని, ఆడపిల్లల కోసం ప్రత్యేకించి బేటి బచావో, బేటి పడావో వంటి కార్యక్రమాలు ఉన్నాయని తెలియజేయాలని ,అన్ని పాఠశాలలు, హాస్టళ్లు, అంగన్వాడి కేంద్రాలు, స్కూల్ మేనేజ్మెంట్ కమిటీలలో ఈ విషయాలపై విస్తృత చర్చ నిర్వహించాలన్నారు. జిల్లాలోని దేవరకొండ, పెద్దవూర, తదితర ప్రాంతాలలో ఇలాంటి సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఈ విషయం పై సిడిపిఓ లు మరింత అప్రమత్తంగా ఉండి పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహించాలన్నారు. దేవర కొండ, నేరేడు గోమ్ము, చందంపేట, పెద్దవూర, అడవిదేవులపల్లి వంటి మండలాలలో శిశువిక్రయాలు జరగకుండా, అలాగే బాల్య వివాహాలు వంటివి జరగకుండా అవగాహన కల్పించాలని, ఇందుకు ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. అంతేకాక వాల్ పోస్టర్లు, కరపత్రాలు, ఫ్లెక్సీలు, చిన్న చిన్న వీడియోల ద్వారా సమాజంలోని అందరికీ చైతన్యం కలిగించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వచ్చేవారం సిడిపిఓ లు, సూపర్వైజర్లతో ఈ విషయంపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మండల ప్రత్యేక అధికారులు మండలాలలో అన్ని పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ స్కూళ్లను తిరిగి ఎక్కడ ఎలాంటి సంఘటన జరగకుండా చూడాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా సంక్షేమాధికారి కృష్ణవేణి, గృహనిర్మాణ శాఖ పీడి రాజ్ కుమార్, సాంఘిక సంక్షేమ డిడి శశికళ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి చత్రు నాయక్, జిల్లా ఉప వైద్యాధికారి వేణుగోపాల్ రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌లో పురుగుల మందు సేవించిన యువకుడు

సుల్తానాబాద్,అక్టోబర్ 31(జనంసాక్షి) : మండల కేంద్రంలోని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ లో పురుగుల మందు సేవించి యువకుడు ఆత్మ హత్య యత్నానికి ప్రయత్నించాడు. బాధితుడి కుటుంబ సభ్యుల కథనం ప్రకారం ఓదెల మండలం కొలనురు గ్రామానికి చెందిన బోదాసు శ్రీనివాస్ తన ద్విచక్ర వాహనంపై మద్దికుంట నుండి తన భార్యతో కలిసి వెళుతుండగా గుడుంబా విక్రయిస్తున్నావ్ అంటూ ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారని పోలీస్ స్టేషన్ కు తరలించి కేసు నమోదు చేశారని తన ద్విచక్ర వాహనంతో పాటు తనపై కేసు నమోదు చేయడంతో మనస్థాపం చెంది పురుగుల మందు సేవించాడని హుటాహుటిన సుల్తానాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. ఎక్సైజ్ సీఐని వివరణ కోరగా కొలనూరుకు చెందిన బోదాసు శ్రీనివాస్ తన భార్యతో కలిసి మద్దికుంట గ్రామంలో గుడుంబా విగ్రహిస్తున్నట్టు సమాచారం ఉండడంతో అదుపులోకి తీసుకొని ఎక్సైజ్ పోలీస్ స్టేషన్‌కు తరలించామని కేసు నమోదు చేసే క్రమంలో పురుగుల మందు తాగినట్లు వ్యవహరించగా హుటాహుటిన కరీంనగర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నామని ఎక్సైజ్ సీఐ గురునాథ్ తెలిపారు.

జమ్మికుంట ప్రభుత్వ ఆసుపత్రి ఆకస్మిక తనిఖీ

జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ

జమ్మికుంట, నవంబర్ 1 (జనం సాక్షి): జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ వెంకట రమణ శనివారం సాయంత్రం జమ్మికుంట సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ తనిఖీల్లో భాగంగా లేబర్ రూమును,వార్డులను, సోనోగ్రఫీ రూమును, రికార్డులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు ఇచ్చారు.ప్రతి గర్భిణీకి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రిలోనే స్కానింగ్,ఎక్స్ రే తీయించాలని,సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సిబ్బంది సమయపాలన పాటించాలని విధుల్లో అలసత్వం ప్రదర్శిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పిఓడిటి డాక్టర్ ఉమా శ్రీ రెడ్డి,డాక్టర్ చందు డిప్యూటీ డిఎంహెచ్ఓ, పిఓఎంసి హెచ్ డాక్టర్ సనా జవేరియా పాల్గొన్నారు.

మణికొండలో పార్కు స్థలాల రక్షణలో హైడ్రా దూకుడు

రాజేంద్రనగర్, నవంబర్1(జనం సాక్షి): గండిపేట మండలం మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని పార్కు స్థలాలపై జరుగుతున్న ఆక్రమణలపై హైడ్రా అధికారులు కఠిన చర్యలు ప్రారంభించారు. కమిషనర్ రంగనాథ్ ఆదేశాల మేరకు హైడ్రా ఇన్స్పెక్టర్ రాజశేఖర్ బృందం శనివారం పార్కుల పరిశీలన నిర్వహించింది. వారి చర్యల్లో భాగంగా వెంకటేశ్వర కాలనీ సర్వే నంబర్లు 22, 26లోని 1600 గజాల పార్కు స్థలం, తిరుమల హిల్స్ కాలనీ సర్వే నంబర్లు 87, 119లోని 6050 గజాల పార్కు స్థలం ఆక్రమణదారుల చెర నుండి విముక్తి చేశారు. రెండు ప్రాంతాల్లోనూ హైడ్రా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ఇక, గత మే 21న హైడ్రా సూచనలతో గజాల ప్రాంతానికి ఫెన్సింగ్ పూర్తి చేశారు. ప్రభుత్వ పార్కు స్థలాలను పరిరక్షించడంలో హైడ్రా చురుకుదనం పట్ల కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తూ, కమిషనర్ రంగనాథ్, ఇన్స్పెక్టర్ రాజశేఖర్‌లకు సాంకేతిక మాధ్యమాల ద్వారా ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

కలెక్టరేట్‌లో ఆకట్టుకున్న టెడ్ ఎడ్ టాక్స్

సమాజానికి సందేశం ఇచ్చిన ఆసక్తికర అంశాలు

కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 1 (జనం సాక్షి) : కరీంనగర్ కలెక్టరేట్ ఆడిటోరియంలో 25 జులైన టెడ్ ఎడ్ టాక్స్ కార్యక్రమం అద్భుతంగా జరిగింది. గతేడాది జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పారమిత విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఇ.ప్రసాద్ రావు మధ్య ప్రభుత్వ-ప్రైవేట్ భాగస్వామ్యంలో ఎంఓయూ కుదిరింది. దీని ప్రకారం పారమిత విద్యాసంస్థలు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచితంగా టెడ్ టాక్స్ శిక్షణ ఇస్తున్నాయి. ఇప్పటివరకు ఆరుగురు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు జాతీయ టెడ్ వేదికపై మాట్లాడారు. వారి టాక్స్ అమెరికా టెడ్ ప్రధాన కార్యాలయం ఆమోదంతో ప్రపంచవ్యాప్తంగా ప్రచురితమయ్యాయి. ఆంగ్లంలో అనర్గళంగా మాట్లాడి, విలక్షణమైన టాక్స్‌తో ప్రభుత్వ పాఠశాల బాలలు అందరినీ ఆశ్చర్యపరిచారు. శనివారం జరిగిన కార్యక్రమంలో పారమిత, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఆసక్తికర అంశాలపై అద్భుత టాక్స్ ఇచ్చి సభికులను ఆలోచనలో ముంచెత్తారు. జడ్పీహెచ్ చెల్పూర్ 10వ తరగతి విద్యార్థి కె.గణేష్, టీజీఎంఎస్ రుక్మాపూర్ 9వ తరగతి యం.డి.అర్ఫా సిద్దికా, టీజీఎంఎస్ ఎలగందల్ 10వ తరగతి కె.సహస్ర, టీజీఎంఎస్ పోచంపల్లి 10వ తరగతి కె.సంజనా రెడ్డి తమ టాక్స్‌తో అందరినీ ఆకట్టుకున్నారు. పారమిత 9వ తరగతి జి.అన్విత, యన్.జైత్రిక, ఏ.శ్రీవిద్య, పి.శృతి మైత్రేయ, యం.వర్ష, 10వ తరగతి పి.సమీక్షలు అనర్గళంగా మాట్లాడి సమాజానికి మంచి సందేశం అందించారు. ప్రతి టాక్ సభికులను ఆలోచింపజేసేలా ఉండటంతోపాటు సృజనాత్మకతను పెంచింది. పారమిత టెడ్ క్లబ్ నుంచి ఇప్పటివరకు వందకుపైగా విద్యార్థులు మాట్లాడి ప్రపంచంలోనే అత్యుత్తమ క్లబ్‌గా నిలిచిందని డాక్టర్ ప్రసాద్ రావు తెలిపారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల టాక్స్ దేశం, రాష్ట్రంలో అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తున్నాయని, ఇలాంటి సేవకు అవకాశమిచ్చిన కలెక్టర్ పమేలా సత్పతికి కృతజ్ఞతలు అన్నారు. టెడ్ టాక్స్ కేవలం ఆంగ్ల పట్టు కోసం కాదు, విద్యార్థుల్లో సృజనాత్మకత పెంచడం, వేదిక భయం తొలగించడం, ప్రపంచ విద్యార్థులను ఉత్తేజపరచడమే ముఖ్య ఉద్దేశమని వివరించారు. డీఈవో, ఎంఈఓలు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆంగ్ల ఉపాధ్యాయులు, ప్రభుత్వ యంత్రాంగానికి కృతజ్ఞతలు తెలిపారు. కరీంనగర్ పేరు దేశవిదేశాల్లో మారుమ్రోగుతుండటం గర్వకారణమని అన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, జిల్లా విద్యాధికారి యస్.మొండయ్య ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య, సంగీత కార్యక్రమాలు సభికులను అలరించాయి. మండల విద్యాశాఖ అధికారులు, ప్రభుత్వ-పారమిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు హాజరయ్యారు.

నవంబర్ 15 న స్పెషల్ లోక్ అదాలత్

మెట్ పల్లి,నవంబర్ 1(జనంసాక్షి) : నవంబర్ 15 న నిర్వహిస్తున్నటువంటి స్పెషల్ లోక్ అదాలత్ ను విజయవంతం చేయాలని మెట్‌పల్లి సీనియర్ సివిల్ జడ్జి డి. నాగేశ్వర్ రావు పిలుపునిచ్చారు.శనివారం మెట్ పల్లి డివిజన్ పోలీసులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాజీకి అస్కారం ఉన్న పలు క్రిమినల్ కేసుల్ని పోలీస్ స్టేషన్ల వారీగా గుర్తించి, వాటిని లోక్ అదాలత్ లో డిస్పా చేయడానికి ప్రతి స్టేషన్ హౌజ్ అధికారి కృషి చేయాలని కోరారు. ప్రతి లోక్ అదాలత్ లాగానే ఈసారీ కూడా మెట్ పల్లి కోర్టు పరిధిలో అత్యధిక కేసుల పరిష్కారం కోసం పోలిసులు, న్యాయవాదులు సహకరించాలని కోరారు.ఈ సమావేశంలో కోరుట్ల జూనియర్ సివిల్ జడ్జి కె. పావని, మెట్ పల్లి జూనియర్ సివిల్ జడ్జి యన్. అరుణ్ కుమార్, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెర్లపల్లి ఆనంద్ గౌడ్, డియస్పి రాములు, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పసునూరి శ్రీనివాస్, సీఐ వి. అనిల్ కుమార్, ఎస్సైలు పి. కిరణ్ కుమార్, యం. చిరంజీవి, ఎ. అనిల్, నవీన్, రాజు, శ్రీధర్, న్యాయవాదులు ఒజ్జెల శ్రీనివాస్, పడిగేలా శ్రీనివాస్, గజేల్లి రామ్ దాస్, మన్నె గంగాధర్, ద్యావని సత్యనారాయణ, కోర్టు డ్యూటీ పోలిసులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్ పట్టణ అభివృద్ధికి మరో రూ. 15 కోట్లు

- పట్టణ రూపు రేఖలు మార్చడమే లక్ష్యం
- సుల్తానాబాద్ ప్రజల్లో ఒకడిగా పట్టణం రుణం తీర్చుకుంటా
- ఎమ్మెల్యే విజయ రమణారావు

సుల్తానాబాద్,అక్టోబర్ 01(జనంసాక్షి) : సుల్తానాబాద్ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి పట్టణ రూపురేఖలు మార్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇందులో భాగంగా పట్టణ అభివృద్ధికి గాను మరో రూ. 15 కోట్లు మంజూరు చేయించినట్టు పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయ రమణారావు తెలిపారు. ఇందుకు సంబంధించి మున్సిపల్ శాఖ జారీ చేసిన జీవో (566) కాపీలను శనివారం ఆయన అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గత పది సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ కాలంలో సుల్తానాబాద్ పట్టణం పై సవతి తల్లి ప్రేమ చూపించారని అన్నారు. అభివృద్ధిలో పట్టణం ఎంతో వెనుకబడిపోయిందన్నారు. తాను పక్కనే ఉన్న శివపల్లి గ్రామంలో పుట్టినప్పటికీ, సుల్తానాబాద్ ప్రజల్లో ఒకరిగా ఇక్కడే పెరిగి చదువుకున్నానని చెప్పారు. అందుకే పట్టణం రుణం తీర్చుకునేందుకు పక్కా కార్యాచరణ ప్రణాళికతో ముందుకు వెళుతున్నట్టు చెప్పారు. రూ. 15 కోట్లను పట్టణంలో ఇంటర్నల్ రోడ్లు, జెంక్షన్ లు,డ్రైనేజీలు, కల్వర్టులు, విలీన గ్రామాల అభివృద్ధికి వెచ్చించనున్నట్టు చెప్పారు. కోరగానే నిధులు విడుదల చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, మంత్రులకు, మున్సిపల్ శాఖ ఉన్నతాధికారులకు ఎమ్మెల్యే విజయ రమణారావు,కృతజ్ఞతలు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రజలు తనకు అండగా నిలవాలని, మరిన్ని నిధులను సమీకరించి అభివృద్ధి పనులు చేపడతానని ఎమ్మెల్యే విజయ రమణారావుఅన్నారు.

మంత్రి శ్రీధర్ బాబుతోనే అభివృద్ధి

గ్రామపంచాయతి భవన నిర్మాణానికి భూమి పూజలో సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

మంథని, నవంబర్ 1 (జనం సాక్షి): ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు తోనే ఖానాపూర్ గ్రామం అన్ని విధాల అభివృద్ధి చెందుతుందని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. ఐటి, పరిశ్రమలు, శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఆదేశాల మేరకు శనివారం ఖానాపూర్ గ్రామ పంచాయతి కార్యాలయ భవన నిర్మాణానికి సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ నాయకులు, గ్రామ ప్రజలతో కలిసి భూమి పూజ చేశారు. గ్రామ పంచాయతి భవన నిర్మానానికి గానూ రూ.20లక్షలు మంజూరయ్యాయని అయన తెలిపారు. అంతేగాకుండా ఎల్ మడుగును పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేయడం లో భాగంగా ఖానాపూర్ పిడబ్ల్యు రోడ్ నుంచి రుద్ర పాదాల వరకు రూ.7కోట్లతో డబుల్ రోడ్డు నిర్మాణం పనులు జరుగుతున్నాయని తెలిపారు. భూమి పూజ కార్యక్రమాని కి వచ్చిన సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ ను మాజీ ఎంపిపి నారమల్ల లక్ష్మి రాజం, తదితరులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అలాగే నారమల్ల లక్ష్మి రాజం ను నాయకులు,గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు సేమంతుల ఓదెలు, దొరగోర్ల శ్రీనివాస్, గ్రామ శాఖ అధ్యక్షుడు తోట సుధాకర్, నాయకులు బాస అశోక్, మంథని సమ్మయ్య, పెగడ రాజు, మాదర వెంకటేష్, రంగు వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డాక్టర్ బి.ప్రకాష్, జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి

రాయికల్ నవంబర్1 (జనం సాక్షి): అల్లీపూర్ గ్రామంలో జరిగిన ఉచిత గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని డాక్టర్ ప్రకాష్, జిల్లా పశు వైద్య మరియు పశు సంవర్ధక శాఖ అధికారి ఆకస్మిక తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధుల పట్ల పాడి రైతులు మరియు గొర్రెల పెంపకందారులు అప్రమత్తంగా వుండాలని, తగు జాగ్రత్తలు తీసుకొని పాడి పశువులను కాపాడుకోవాలని తెలిపారు. దూడలలో పారుడు రోగం, రక్తపు విరేచనాలు కాల్ఫ్ న్యూమోనియా గొర్రెలలో ప్రధానంగా కాలిపుండు రోగం, న్యుమోనియా వ్యాధులు వస్తాయని తెలిపారు. పాడి గేదెలకు సమీకృత దాణా అందించి మంచి పాల దిగుబడి పొందవచ్చని రైతులకు సూచించారు. మూడు నెలలు పైబడిన అన్ని పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రైతులకు తెలియజేశారు. అల్లీపూర్ గ్రామంలో సుమారు 220 పశువులకు ఉచిత గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు అదనపు పశు వైద్య శస్త్ర చికిత్సకులు డాక్టర్ నరేష్ రెడ్డి తెలిపారుఈ కార్యక్రమంలో లైవ్ స్టాక్ అసిస్టెంట్ ఎలిగేటి రవీందర్, నాగేందర్ రెడ్డి, శివ కుమార్, కార్యాలయ సహాయకులు షేక్ అహ్మద్, పోచయ్య, రైతులు రాజేష్, ప్రవీణ్, కొప్పెల గంగారం, గణేష్, చెల్కల భీమన్న తదితరులు పాల్గొన్నారు.

రివిజన్ ప్రక్రియను సమర్ధవంతంగా చేపట్టాలి

రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్

జగిత్యాల బ్యూరో నవంబర్ 1 జనంసాక్షి : స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను సమర్ధవంతంగా చేపట్టాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ నుండి రాష్ట్ర అదనపు ముఖ్య ఎన్నికల అధికారి లోకేష్ కుమార్, ఇతర అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు- ఎన్నికల అధికారులు, ఈఆర్ఓలతో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి మాట్లాడుతూ 2002 ఎలక్టోరల్ జాబితాతో నియోజకవర్గాల వారిగా 2025 ఎలక్టోరల్ జాబితా మ్యాపింగ్ చేసి 4 కేటగిరీలుగా విభజించడం జరిగిందని, కేటగిరీ ఏలో 1987 కంటే ముందు జన్మించి 2002, 2025 ఎలక్టోరల్ జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ బిలో 1987 కంటే ముందు జన్మించి 2002 ఓటరు జాబితాలో లేకుండా 2025 జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ సిలో 1987 నుంచి 2002 మధ్యలో జన్మించి 2025 ఓటరు జాబితాలో నమోదు కాబడిన వారు, కేటగిరీ డి లో 2002-2007 మధ్యలో జన్మించిన వారిగా విభజించడం జరిగిందని తెలిపారు. మొదట కేటగిరి ఏ జాబితాను బి ఎల్ ఓ యాప్ ద్వారా నిర్ధారించుకోవడం జరుగుతుందని, ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 63 లక్షల ఓటర్లను నిర్ధారించడం జరిగిందని, మిగిలిన 12 లక్షల ఓటర్ల నిర్ధారణ త్వరగా పూర్తి చేయాలని తెలిపారు. కేటగిరి సి, క్యాటగిరి డి లలోని

ఎల్ఐసి వాకథాన్

- అవినీతిని అరికట్టడమే ప్రధాన లక్ష్యం
- ఘనంగా విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలు

హైదరాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) :
విజిలెన్స్ అవేర్‌నెస్ వారోత్సవాలలో భాగంగా, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసి), హైదరాబాద్ జోనల్ కార్యాలయం, నవంబర్ 1, 2025 శనివారం హైదరాబాద్, సికింద్రాబాద్ డివిజనల్ కార్యాలయాల జోనల్ కార్యాలయాల ఉద్యోగులు, ఏజెంట్ల భాగస్వామ్యంతో వాకథాన్‌ను నిర్వహించింది. విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ (వీఏడబ్ల్యూ) ప్రతి సంవత్సరం జరుపుకుంటున్నారు. అధిక నిజాయితీ గల వ్యక్తిగా పేరుగాంచిన సర్దార్ వల్లభాయ్ పటేల్ పుట్టినరోజుతో సమానంగా ఉంటుంది. ఎల్ఐసిలో కార్యకలాపాలు అక్టోబర్ 27న మొత్తం సౌత్ సెంట్రల్ జోన్‌లోని అన్ని ఉద్యోగులు సమగ్రత ప్రతిజ్ఞతో ప్రారంభించారు. ఈ వారంలో, ఆన్‌లైన్ క్విజ్, ఆన్‌లైన్ వ్యాస రచన పోటీలు, సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ఐఎల్ నరసింహారావు ద్వారా సైబర్ సెక్యూరిటీ అవగాహనపై ప్రసంగం జరిగాయి. ఇవి ఉద్యోగులలో అవగాహన కల్పించే లక్ష్యంతో ఉన్నాయి. ఈరోజు జరిగిన వాకథాన్‌లో దాదాపు 300 మంది సిబ్బంది, ఏజెంట్లు పాల్గొన్నారు. జోనల్ మేనేజర్ పునీత్ కుమార్ ఉద్యోగులు, ఏజెంట్లకు తన సందేశంలో, ప్రివెంటివ్, శిక్షాత్మక విజిలెన్స్ ద్వారా అవినీతిని అరికట్టడంలో ప్రివెంటివ్ విజిలెన్స్ ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, మా రోజువారీ కార్యకలాపాలలో విజిలెన్స్ కోణం గురించి అంతర్దృష్టులను అందించారు. ఎల్ఐసి జోనల్ ఆఫీసు వద్ద జరిగిన వాకథాన్‌ను ఏపీ, తెలంగాణ ప్రాంతీయ మేనేజర్ (మార్కెటింగ్) ఎం. రవి కుమార్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ వాకథాన్ తెలంగాణతల్లి ఫ్లైఓవర్, మింట్ కాంపౌండ్, సైఫాబాద్ పోలీస్ స్టేషన్, ప్రసాద్స్ ఐమాక్స్, లుంబినీ పార్క్ మీదుగా సాగి ఎల్ఐసి జోనల్ ఆఫీసు వద్ద ముగిసింది. దారి పొడవునా, విజిలెన్స్ అవగాహనపై అవగాహన కల్పించే సందేశాలను ప్రదర్శించే ప్లకార్డులు ప్రదర్శించబడ్డాయి.
జోనల్ విజిలెన్స్ అధికారి ఇ. విద్యాధర్ మాట్లాడుతూ.. అవినీతి చెడు ప్రభావాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడమే విజిలెన్స్ అవగాహన వారం ఉద్దేశ్యం అని, అవినీతి ప్రవేశించలేని సంస్కృతిని మనం కలిసి నిర్మించుకుందాం అని విజ్ఞప్తి చేశారు. విజిలెన్స్ మన ఉమ్మడి బాధ్యత అని కూడా తెలియజేశారు. ఎస్.శరవణ రమేష్, పిజి కుమారవైద్యలింగం, ఎఎఎం హిలాలి, జి. మధుసూధన్, కె. సంధ్యారాణి, ఇతర సీనియర్ అధికారులు ఈ వాకథాన్‌లో పాల్గొన్నారు. ట్రాఫిక్‌ను నియంత్రించడంలో పోలీసు బృందాలు మద్దతు ఇచ్చాయి.

నిజాయితీ అందరి జీవన విధానం కావాలి

- అందరిలో చైతన్యంతోనే అవినీతికి అడ్డుకట్ట
- బీహెచ్ఈఎల్ విజిలెన్స్ వారోత్సవంలో హైడ్రా కమిషనర్

హైదరాబాద్, నవంబర్ 01 (జనంసాక్షి) :
వ్యవస్థల పట్ల, వాటి పని తీరుతో పాటు పౌరుల హక్కులకు సంబంధించి అందరిలోనూ అవగాహన ఉన్నప్పుడు అవినీతి నిర్మూలన సాధ్యమౌతుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. చట్టాలపైన అవగాహన కల్పించడంతో పాటు అనుసరించాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించాల్సిన బాధ్యత వాటిని అమలు చేసేవారిపై ఉందన్నారు. గొలుసు కట్టు చెరువుల ప్రాధాన్యత, నాలాల అవశ్యకత, ప్రజావసరాలకు ఉద్దేశించిన భూముల పరిరక్షణ వల్ల కలిగే ప్రయోజనాలను ప్రజలందరికీ తెలిసేలా హైడ్రా చర్యలు తీసుకుందన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా బీహెచ్ఈఎల్ నిర్వహించిన కార్యక్రమంలో ఏవీ రంగనాథ్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. హైడ్రా రాక ముందు చెరువు ఎఫ్టీఎల్, బఫర్ పట్ల చాలా మందిలో అవగాహన లేదని, ఇప్పుడు దాదాపుగా అందరికీ తెలిసేలా చేశామన్నారు. ఇటీవల హైడ్రా వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రదర్శనలో పాఠశాల విద్యార్థులు చెరువుల ఎఫ్‌టీఎల్(ఫుల్ ట్యాంక్ లెవెల్) బఫర్, నాలాల బఫర్‌ను కాపాడాల్సిన అవసరాన్ని కళ్లకు కట్టారన్నారు. ఇప్పుడు చెరువుల చెంత, నాలాల పక్కన ఇంటి స్థలం కొనేవారు పైన పేర్కొన్న లెక్కలన్నీ సరి చూసుకుని కొంటున్నారని హైడ్రా కమిషనర్ తెలిపారు. నగర భవిష్యత్తుకు హైడ్రా చేస్తున్న కృషికి ప్రజలందరి సహకారం లభిస్తుందంటే.. వాటి ఆవశ్యకతను తెలుసుకోవడంతోనే సాధ్యమైందని చెప్పారు. ఏడాదిలో దాదాపు వెయ్యి ఎకరాల ప్రభుత్వ భూమని హైడ్రా కాపాడిందని అన్నారు. ఎన్ ఆర్ఎస్సీ (నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్) తెలిపిన వివరాల ప్రకారం నగరంలో 61 శాతం చెరువులు కనుమరుగయ్యాయని, ఇదే కొనసాగితే వచ్చే 15 ఏళ్లలో మొత్తం చెరువులు మాయం అవుతాయని హెచ్చరించారు. అందుకే చెరువులతో పాటు నాలాల పరిరక్షణకు హైడ్రా నడుం బిగించిందన్నారు. మొదటి విడతగా 6 చెరువులను అభివృద్ధి చేస్తున్నామన్నారు. చెరువులు, నాలాలు ఆక్రమణలకు గురికాకపోతే వరదలను నియంత్రించగలమని చెప్పారు. ఇలా హైడ్రా చేస్తున్న ప్రతీ చర్యా.. పారదర్శకంగా ఉంటుందని పేర్కొన్నారు. విజిలెన్స్ వారోత్సవాల ను పాఠశాలల్లో నిర్వహించామని బీహెచ్ఈఎల్ హైదరాబాద్ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేబీ రాజా తెలిపారు. విద్యార్థి దశలోనే అవగాహన తీసుకువస్తే మంచి పౌరులుగా మారుతారన్నారు. విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పలు పోటీల్లో విజేతలైన ఉద్యోగులతో పాటు విద్యార్థులకు అవార్డులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో బీహెచ్ ఈఎల్ లోని వివిధ విభాగాల్లోని అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

- మరో వ్యక్తి సెక్యూరిటీ గార్డుపై చర్యలు
- విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి
- పరిసరాల పరిశుభ్రత పాటించకపోతే కఠిన చర్యలు
- రీసనల్ లెవెల్ కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి

శివరెడ్డి పేట గురుకులంలో దారుణంపై విచారణ

పిఈటి అన్వర్ ఖాన్ సస్పెండ్

వికారాబాద్ జిల్లా బ్యూరో (జనం సాక్షి) :
వికారాబాద్ పట్టణంలోని శివరెడ్డిపేట మైనార్టీ బాలుర గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న పిఈటి అన్వర్‌ఖాన్‌పై వేటుపడింది. గురుకులంలో చదువుకుంటున్న ఎనిమిది మంది విద్యార్థులపై పిఈటి అన్వర్ ఖాన్ అమానుషంగా ప్రవర్తించాడు. అల్లరి చేస్తున్నారని కారణంతో ఎనిమిది మంది విద్యార్థులను అల్యూమినియం రాడ్‌తో చితకబాదాడు. గురుకు లం నుంచి విద్యార్థులు పరారికి కారణమయ్యాడు. ఈ విషయమై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగడంతో విషయం వెలుగులోకి వచ్చింది. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఆయనను సస్పెండ్ చేస్తూ ఉన్నత అధికారులు ఉత్తర్వులు జారీ చేసినట్లు మేడ్చల్ రంగారెడ్డి వికారాబాద్ జిల్లాల మైనారిటీ రీజినల్ లెవెల కోఆర్డినేటర్ శ్రీనివాస్ రెడ్డి తెలియజేశారు. అలాగే గురుకులం లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్‌పై చర్యలు తీసుకుంటు న్నట్లు వివరించారు. మైనారిటీ గురుకులంలో విద్యార్థులను చితకబాదిన సంఘటనపై ఆయన విచారణ చేపట్టారు. బాధిత విద్యార్థులతో మాట్లాడి జరిగిన సంఘటనపై ఆరా తీశారు. గురుకులం ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థులు ఇచ్చిన సమాచారంపై సమగ్ర నివేదికను మైనారిటీ వెల్ఫేర్ ఉన్నత అధికారులకు అందజేస్తామని తెలియజేశారు. సమస్య ఏది ఉన్న సామరస్యంగా పరిష్కరించుకోవాలని చిన్న విషయానికి విద్యార్థులను దండించడం హేయమైన చర్య అని అన్నారు .అంతేకాకుండా విద్యార్థులకు అందిస్తున్న భోజనం పై వివరాల అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు ప్రభుత్వ నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ప్రిన్సిపల్‌ను ఆదేశించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనము అందివ్వక పోవడం పట్ల మండిపడ్డారు. అలాగే గురుకుల పాఠశాలలోని పరిసరాలు పరిశుభ్రంగా ఉండాలని పరిశుభ్రత లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమా?

- ఫీజు బకాయిలపై రాజకీయాలు ఆపండి
- ఫీజు రియంబర్స్మెంట్ కాలేజీ స్కాలర్షిప్లను వెంటనే విడుదల చేయండి
- జాతీయ బిసి కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్
- తాండూర్ అంబేద్కర్ కూడలి వద్ద బీసీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా

తాండూరు నవంబర్ 1(జనంసాక్షి) : రాష్ట్రంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రభుత్వం నిర్లక్ష్యంతో ప్రమాదంలో పడుతోందని జాతీయ బిసి కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్ కుమార్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. శనివారం తాండూర్ నియోజకవర్గ బీసీ సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ కూడలి వద్ద విద్యార్థులతో కలిసి మహా ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజ్ కుమార్ మాట్లాడుతూ 1994 నుండి 2008 వరకు బహుజన పేద విద్యార్థులకు ఉన్నత విద్య పూర్తిగా ఉచితంగా అందించాలని ఆర్. కృష్ణయ్య చేసిన నిరంతర ఉద్యమ ఫలితంగానే, 2008లో అప్పటి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ విధానాన్ని తీసుకువచ్చిందని గుర్తు చేశారు.కానీ ప్రస్తుతం, గత ప్రభుత్వం మరియు ఇప్పటి ప్రభుత్వం రెండూ ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లింపులలో ఆలస్యం చేయడం వల్ల లక్షలాది విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమయ్యే పరిస్థితి ఏర్పడిందని రాజ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు.విద్యార్థులకు చెందాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిల విడుదలలో జరుగుతున్న అనవసర ఆలస్యం కారణంగా కళాశాలలు ఒత్తిడి పెంచుతున్నాయి. ఫీజులు చెల్లించలేనందున వేలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు, విద్యార్థుల భవిష్యత్తుతో ఎట్టి పరిస్థితుల్లోనూ చెలగాటం ఆపాలని,ప్రభుత్వం తక్షణమే బకాయిలను విడుదల చేయాలి అని రాజ్ కుమార్ డిమాండ్ చేశారు .ఈ ధర్నా రాష్ట్ర నాయకులు సయ్యద్ సుకుర్, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, మహిళా సంఘం అధ్యక్షురాలు కార్యదర్శులు అనిత, మంజుల, నరసమ్మ, విజయలక్ష్మి, వీరమని,యాలాల్ మండల అధ్యక్షుడు చెన్నారం లక్ష్మణ చారి, మీడియా ఇంచార్జ్ బసవరాజ్, బీసీ నాయకులు అబ్బనీ బసయ్య,బీసీ సంఘం యువ నాయకులు రమేష్, పరమేష్, యాసర్, మధుసూదన్, కార్తీక్, కిరణ్, వినయ్ మరియు ధర్నాలో బీసీ నాయకులు, విద్యార్థులు,యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఖో ఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్లు విజేతలుగా నిలవాలి

- ఖో ఖో జట్ల శిక్షణ శిబిరాన్ని సందర్శించిన సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి

కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 01 (జనంసాక్షి):
రాష్ట్రస్థాయి సీనియర్స్ కరీంనగర్ జిల్లా జట్లు విశేష ప్రతిభ చాటి విజేతలుగా నిలవాలని జిల్లా ఖో ఖో అసోసియేషన్ అధ్యక్షులు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ పీజీ కళాశాలలో నిర్వహిస్తున్న సీనియర్స్ మహిళలు పురుషుల ఖో ఖో జట్ల శిక్షణ శిబిరాన్ని సుడా చైర్మన్ శనివారం సాయంత్రం సందర్శించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకొని మాట్లాడారు. కోచ్ ల శిక్షణలో క్రీడాకారులు ఖోఖోలోని నైపుణ్యాలలో ప్రతిరోజు సాధన చేస్తున్నారన్నారు. ఈనెల 7,8,9 తేదీలలో పెద్దపల్లి జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల జిల్లాలకు చెందిన క్రీడాకారులతో కూడిన ఉమ్మడి జిల్లా జట్లు పాల్గొంటారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంఘ ఉపాధ్యక్షులు ట్రాఫిక్ ఆర్ ఐ కుమారస్వామి, రాష్ట్ర డిగ్రీ కళాశాలల లెక్చరర్ల సంఘం అధ్యక్షులు డాక్టర్ సురేందర్ రెడ్డి, ఎస్ ఆర్ ఆర్ కళాశాల ఉపన్యాసకులు, జిల్లా సంఘ ప్రతినిధులు సూర్య ప్రకాష్, డాక్టర్ ఏ రవీందర్, కట్ట సంతోష్, కరుణాకర్, అశోక్, రాములు, ఖోఖో కోచ్ లు వెంకటేష్, ఆనంద్, జలంధర్, తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా ఉత్సాహంగా స్మార్ట్ కిడ్జ్ వన సమారాధన

- చిన్నారుల నృత్యాలతో హొరెత్తిన వన ప్రాంగణం
- ఆకట్టుకున్న మ్యాజిక్ షో

ఖమ్మం నవంబర్ 1, (జనం సాక్షి):
ఉరకలేసే ఉత్సాహంతో స్మార్ట్ కిడ్జ్ చిన్నారులు స్థానిక చెరుకూరి మామిడి తోటలో శనివారం నిర్వహించిన కార్తీక మాస వన సమారాధన అందరిలో ఉల్లాసాన్ని నింపింది. నృత్యాలతో వన ప్రాంగణం హొరెత్తింది. సంతోషంగా చిన్నారులు నిర్వహించిన పలు రకాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. రోజంతా పాఠశాల చిన్నారులు వనంలో గడిపి స్నేహ బంధాన్ని చాటారు. పుస్తకాలతో బిజీబిజీగా రోజుల తరబడి కాలం గడుపుతున్న పాఠశాల చిన్నారులకు ఆటవిడుపుగా నిర్వహించిన వన సమారాధన విద్యార్థులలో మరింత హుషారుని నింపింది. అల్లరి చేస్తూ, కేకలేస్తూ ఒకరికొకరు ఆత్మీయంగా పలకరిస్తూ చేసిన విన్యాసాలు అబ్బురపరిచాయి. జానపద, సాంప్రదాయ, పాశ్చాత్య నృత్యాలతో వన ప్రాంగణ వేదికపై తోటి మిత్రులను విశేషంగా ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా మ్యాజిక్ కళాకారులు నిర్వహించిన మ్యాజిక్ ప్రదర్శన అందరిలో సంభ్రమాశ్చర్యాలను నింపింది. తమ కళ్ళముందే పలు రకాల వస్తువులు మాయమై కొత్త వస్తువులు దర్శనం ఇవ్వడం విద్యార్థులను మరింతగా అబ్బురపరిచింది. ఈ సందర్భంగా వన ప్రాంగణ వేదికపై పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ వనాలు మనం జీవించడానికి ప్రాణవాయువును అందిస్తున్నాయని అందుకే చెట్లను దేవతలుగా భావించి పూజలు నిర్వహిస్తున్నామని తెలిపారు. వన సమారాధనతో విద్యార్థులలో స్నేహబంధం, సహకారం, ఇతరుల పట్ల సంఘీభావం, ఆటపాటల విన్యాసాలు ప్రతి ఒక్కరికి పొంగే ఉత్సాహాన్ని అందిస్తున్నాయని తెలిపారు. రోజుల తరబడి పాఠశాలలో పుస్తకాలతో కుస్తీ పట్టే విద్యార్థులకు ఆటవిడుపుగా కార్తీక వన సమారాధన నిర్వహించడం ప్రతి సంవత్సరం తమ పాఠశాలలో సాంప్రదాయంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్,ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కరీంనగర్ తెలంగాణ చౌక్‌లో.. సీఎంరేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం

- రేవంత్ రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలి.
- బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్

కరీంనగర్ జిల్లా బ్యూరో, నవంబర్ 01 (జనంసాక్షి):
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భారతదేశ సైనిక శక్తిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం పట్ల కరీంనగర్ బిజెపి శ్రేణులు ఆందోళన చేపట్టారు. శనివారం సాయంత్రం కరీంనగర్లోని తెలంగాణ చౌక్ లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనం కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బిజెపి జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల కోసం ఓవర్గం ఓట్ల కోసం మన దేశాన్ని మన సైనికులను ఘోరంగా అవమానించారని ఆయన మండిపడ్డారు. ఈ ఎన్నికల్లో మైనార్టీలను ప్రసన్నం చేసుకోవడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దిగజారి ఇండియన్ ఆర్మీ పై వ్యాఖ్యలు చేయడానికి సిగ్గుండాలన్నారు. ఆపరేషన్ సింధూర్, ఇండియన్ ఆర్మీ ని అవమానించే రీతిలో మాట్లాడినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు గుగ్గిల రమేష్, వసల రమేష్, అసెంబ్లీ కన్వీనర్ దుబ్బల శ్రీనివాస్, కార్పొరేటర్ కొలగని శ్రీనివాస్, అనూప్, బండ రమణ రెడ్డి, మీడియా కన్వీనర్ కటకం లోకేష్, తదితరులు పాల్గొన్నారు.

3 నుంచి ప్రైవేట్ ఉన్నత విద్యాసంస్థల నిరవధిక బంద్

పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలి

సూర్యాపేట ప్రతినిధి (జనంసాక్షి): ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ విడుదలలో జాప్యాన్ని నిరసిస్తూ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలలతో పాటు అన్ని ఉన్నత విద్యా సంస్థల యాజమాన్యాలు ఈ నెల 3వ తేదీ నుంచి నిరవధిక బంద్ చేపట్టనున్నట్లు మహాత్మా గాంధీ యూనివర్సిటీ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ అండ్ పీజీ కళాశాల మేనేజ్మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు తీకుళ్ళ శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి సిహెచ్.సత్యం గౌడ్ తెలిపారు.శనివారం ఆ సంఘం ఆధ్వర్యంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ కు బంద్ కు సంబంధించిన సమ్మె నోటీసును అందజేసినట్లు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూనివర్సిటీ పరిధిలోని అన్ని ప్రైవేట్ డిగ్రీ, పీజీ,బీఈడీ, పాలిటెక్నిక్, ఇంజనీరింగ్ కళాశాలతో పాటు అన్ని ఉన్నత విద్యాసంస్థల యాజమాన్యాలు బంద్ పాటించనున్నట్లు తెలిపారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో తాము కాలేజీలు నడిపే పరిస్థితుల్లో లేమని అన్నారు. తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ,పీజీ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వంతో చర్చలు జరిపిన తర్వాత తమ ప్రధాన డిమాండ్లను నెరవేర్చడానికి ప్రభుత్వానికి ఈ నెల 1వ తేదీ వరకు గడువు ఇచ్చినట్లు తెలిపారు.పెండింగ్‌లో ఉన్న ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు.దసరా, దీపావళికి ముందు హామీ ఇచ్చిన రూ.1200 కోట్లలో ఇప్పటి వరకు రూ.300 కోట్లు మాత్రమే విడుదలైనట్లు తెలిపారు.2024-25 విద్యా సంవత్సరం వరకు ఉన్న అన్ని బకాయిలు దాదాపు 9వేల కోట్ల రూపాయలను 2026 మార్చి 31 నాటికి చెల్లించడానికి స్పష్టమైన రోడ్‌మ్యాప్ ప్రకటించాలన్నారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు సకాలంలో రాకపోవడంతో తమ కళాశాలల పనితీరు, విద్యా కార్యకలాపాల కొనసాగింపు భారంగా మారిందని, తమ బంద్ కు అందరూ సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

> *ఓటు వేయకపోతే పథకాలను రద్దు చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి ధమ్కీలు ఇస్తున్నాడని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. రద్దు చేస్తానని ఎగిరెగిరిపడితే ప్రజలు పెట్టే వాతలకు నీ ప్రభుత్వమే ఆగమయ్యే రోజు దగ్గరలోనే ఉందని వ్యాఖ్యానించారు. ఇది చైతన్యవంతమైన తెలంగాణ అని తెలిపారు. రేవంత్ రెడ్డి లాంటి వాళ్లను గతంలో చాలామందిని చూశామని అన్నారు.*

పెట్టుబడి రంగాల్లో అవకాశాలను వినియోగించుకోవాలి

- గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ రౌండ్‌టేబుల్‌లో డాక్టర్ అలీఖాన్

హైదరాబాద్, నవంబర్ 01 (జనంసాక్షి) :
కజకిస్తాన్ రాజధాని అస్తానాలో నిర్వహించిన ప్రతిష్టాత్మక కజకిస్తాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ రౌండ్‌టేబుల్ సమావేశానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లకు హైదరాబాద్‌లో కజకిస్తాన్ గౌరవ కాన్సుల్‌గా విధులు నిర్వహిస్తున్న డాక్టర్ నవాబ్ మీర్ నాసీర్ అలీఖాన్ హాజరయ్యారు. కజకిస్తాన్ విదేశాంగ శాఖ సహాయ మంత్రి అలీబెక్ కువాంటిరోవ్ ఆహ్వానం మేరకు వెళ్లారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పెట్టుబడిదారులను, వ్యాపారులను, ప్రభుత్వ ఉన్నతాధికారులను ఒక వేదికపైకి తీసుకువచ్చిన అంతర్జాతీయ వేదిక ఇది. ఈ సమావేశంలో కజకిస్తాన్‌లో ఉన్న విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి అవకాశాలు, పారిశ్రామిక అభివృద్ధి, పరస్పర సహకారంపై చర్చలు జరిగాయి. ప్రధానంగా ఎనర్జీ, ఆయిల్ - గ్యాస్ రంగాలు, ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, లాజిస్టిక్స్, గ్రీన్ ఎనర్జీ, సస్టైనబుల్ డెవలప్మెంట్, డిజిటల్ ట్రాన్స్‌ఫర్మేషన్, టెక్నాలజీ రంగాలపై చర్చలు జరిగాయి. ఈ సమావేశంలో ఐదు వందల మందికి పైగా ఉన్నతస్థాయి ప్రతినిధులు పాల్గొన్నారు. వీరిలో మంత్రులు, రాయబారులు, అంతర్జాతీయ ఆర్థిక సంస్థల ప్రతినిధులు, మధ్య ఆసియా, మధ్యప్రాచ్యం, యూరప్, ఆసియా-పసిఫిక్ ప్రాంతాల ప్రముఖ గ్లోబల్ కంపెనీల అధినేతలు ఉన్నారు. ఈ రౌండ్‌టేబుల్ ద్వారా కజకస్తాన్ ప్రాంతీయ పెట్టుబడి కేంద్రంగా ఉన్న తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకుంది. పారదర్శకతతో కూడిన, పోటీ వాతావరణం కలిగిన, వ్యాపార అనుకూల విధానాలు తీసుకువెళ్లడానికి కజకిస్తాన్ ప్రభుత్వం కట్టుబడి ఉందని మరోసారి ధృవీకరించబడింది. ఈ పర్యటనలో డాక్టర్ నవాబ్ మీర్ నాసిర్ అలీ ఖాన్ కజకిస్తాన్ రిపబ్లిక్‌కు భారత రాయబారిగా ఉన్న వైకే సైలాస్ తంగల్‌ను అస్తానాలోని భారత రాయబార కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రెండు దేశాల మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, మెడికల్ టూరిజం రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింతగా బలోపేతం చేసే అవకాశాలపై చర్చించారు. డాక్టర్ నాసీర్ అలీ ఖాన్ భారతదేశానికి వ్యాపారం, ఆరోగ్య సేవల కోసం వచ్చే కజకిస్థాన్ పౌరులకు వీసా సౌకర్యాలు అందించడంలో సహాయం చేయాలని కోరారు. ఈ సందర్భంగా డాక్టర్ నవాబ్ మీర్ నాసీర్ అలీ ఖాన్ మాట్లాడుతూ కజకిస్తాన్, భారతదేశం మధ్య బలమైన ద్వైపాక్షిక, ఆర్థిక సంబంధాలు ఉన్నాయన్నారు. కజకిస్తాన్ గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ రౌండ్‌టేబుల్ వంటి వేదికలు రెండు దేశాల మధ్య సహకారం పెంపొందించేందుకు, పరస్పర పెట్టుబడులను ప్రోత్సహించేందుకు, కొత్త అవకాశాలను అన్వేషించేందుకు ఉపయోగపడతాయని తెలిపారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాపారవేత్తలు కజకిస్తాన్‌లో వ్యాపార, పెట్టుబడి రంగాల్లో ఉన్న అవకాశాలను వినియోగించుకోవాలని కోరారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
2 నవంబర్ 2025

త్వరలో రోడ్డు భద్రతపై 'అరైవ్ అలైవ్'

- డీజీపీ బి.శివధర్ రెడ్డి

హైదరాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) : డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ బి.శివధర్ రెడ్డి రోడ్డు భద్రతపై 'అరైవ్ అలైవ్' అనే నూతన అవగాహనా కార్యక్రమాన్ని ప్రకటించారు. పోలీస్ ఉన్నతాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, రోడ్డు భద్రత నిపుణులు తదితరులు పాల్గొన్న సమావేశం శనివారం నాడు డిజిపి కార్యాలయంలో నిర్వహించారు. రోడ్డు ప్రమాదాలలో మరణించే వారి సంఖ్య ప్రతి సంవత్సరం వివిధ సంఘటనలలో హత్యలకు గురయ్యే వారి సంఖ్య కన్నా పదిరెట్లు ఎక్కువగా ఉందని డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో రోడ్డు భద్రతను ప్రజా ప్రాధాన్య అంశంగా తీసుకోవాలని సూచించారు. ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు "అరైవ్ అలైవ్" రాష్ట్ర వ్యాప్త ప్రచార కార్యక్రమం వచ్చే డిసెంబర్ నెలలో 15 రోజులపాటు నిర్వహించనున్నామని డిజిపి తెలిపారు. నవంబర్ 16 వ తేదిన జరిగే ప్రపంచ రోడ్డు భద్రతా బాధితుల స్మారక దినం సందర్భంగా ఈ కార్యక్రమానికి రూపకల్పన చేయనున్నామన్నారు. ఈ ప్రచారం ద్వారా ప్రజల్లో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం, నియమాలను కచ్చితంగా పాటించేటట్టు చేయటం, బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లను – ముఖ్యంగా డిఫెన్సీవ్ డ్రైవింగ్ విధానాన్ని ప్రోత్సహించటం, ప్రమాదాలను తగ్గించటం ప్రధాన లక్ష్యంగా నిర్ణయించుకున్నామని తెలిపారు. అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని ఒక ఉద్యమంలాగా చేపట్టాలని అన్నారు. పోలీసు శాఖ, రవాణా శాఖ, కార్పొరేట్ సంస్థలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు పరస్పర సమన్వయంతో ముందుకు వెళ్లాల్సి ఉందని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తమ ఆలోచనలను సమీకరించి, సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందించి నవంబర్ 9 లేదా 10న జరిగే తదుపరి సమావేశంలో చర్చించాలని డిజిపి సూచించారు. అంతేకాకుండా వివిధ ప్రాంతాల్లో అమలులో ఉన్న రోడ్డు భద్రతకు సంబంధించి ఉత్తమ విధానాలను పరిశీలించి, తెలంగాణలో అనుసరించదగిన మార్గాలను రూపొందించాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో పాల్గొన్న స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పలు సూచనలు చేశారు. శాశ్వత డ్రైవింగ్ లైసెన్స్ జారీకి ముందు డ్రైవర్‌లకు తప్పనిసరిగా డ్రైవింగ్ విద్యా శిక్షణ తరగతులు నిర్వహించాలని, ఆ శిక్షణలో పాల్గొన్న వారికి సర్టిఫికెట్లు ఇవ్వాలని సూచించారు. పాఠశాల స్థాయిలోనే రోడ్డు భద్రతా విద్యను పాఠ్యాంశంగా చేర్చటం, ప్రజల్లో అవగాహన పెంచేందుకు రోడ్డు భద్రతా పార్కులను ప్రారంభించాలన్నారు. అదే విధంగా, ప్రతి వాహన డ్రైవర్ 'సేఫ్టీ కనెక్ట్' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత యాప్‌ను ఉపయోగించాలన్నారు. ఈ యాప్ డ్రైవింగ్ విధానాన్ని పర్యవేక్షించి, భద్రతా ప్రమాణాలను పాటించేందుకు సహకరిస్తుందన్నారు. సోషల్ మీడియా వేదికల ద్వారా రోడ్డు భద్రతా నియమాలపై విస్తృత ప్రచారం చేయాలని, #ArriveAliveTG వంటి ప్రత్యేక హ్యాష్‌ట్యాగ్‌లను ఉపయోగించి ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలని ప్రతినిధులు సూచించారు. ప్రయోజనకరమైన సూచనలను ఇచ్చిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ అభినందించారు. రోడ్డు భద్రతపై సంయుక్త కార్యాచరణ ప్రణాళికలు అమలు చేయటంలో పోలీస్ శాఖ సంపూర్ణ సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. ప్రజల భాగస్వామ్యం, రోడ్డు భద్రత నియమాలపై అవగాహన మరియు నియమాల అమలు, డిఫెన్సివ్ డ్రైవింగ్ ఈ అంశాల సమన్వయమే రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో కీలకమని డిజిపి స్పష్టం చేశారు. సమావేశంలో శాంతి భద్రతల అడిషనల్ డిజిపి మహేష్ ఎం.భగవత్, ఎడిజిపి (మల్టీజోన్-1) దేవేంద్ర సింగ్ చౌహాన్, ఐజిపిలు (మల్టిజోన్-1) ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, (ప్రోవిజనింగ్ అండ్ లాజిస్టిక్స్) డా. ఎం.రమేశ్, ఐజిపి (రైల్వే అండ్ రోడ్డు భద్రత) కె.రమేశ్ నాయుడు, జాయింట్ సీపీ (ట్రాఫిక్, హైదరాబాద్ సిటీ) శ్రీ డి.జోయెల్ డేవిస్, తదితర అధికారులు పాల్గొన్నారు.స్వచ్ఛంద సంస్థల తరఫున తన్మయి దీక్షిత్ (ఫౌండర్, సేఫ్టీ కనెక్ట్), నరేశ్ రాఘవన్ (టాప్ డ్రైవర్), మాల్కమ్ వోల్ఫ్ (రిటైర్డ్ స్క్వాడ్రన్ లీడర్), లోకేంద్ర సింగ్ (ఎచ్‌సీఎస్సీ వాలంటీర్), అనిల్ సూర్య (ఐటీ ప్రాజెక్ట్ మేనేజర్), వినయ వంగాల (సివిల్ యాక్టివిస్ట్), వినోద్ కనుముల (రోడ్డు భద్రత నిపుణుడు) తదితరులు పాల్గొన్నారు.

నేను తెలంగాణ ప్రజల బాణాన్ని

- సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం సాగుతున్నా
- జాగృతి జనం బాటలో అధ్యక్షురాలు కవిత వ్యాఖ్యలు

కరీంనగర్, నవంబర్ 1 (జనంసాక్షి) : జాగృతి అధ్యక్షురాలు కవిత చేపట్టిన జాగృతి జనం బాట పాదయాత్ర జిల్లా పరిధిలో ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల నుంచి విశేషమైన స్పందన వస్తోందని పేర్కొన్నారు. నేను తెలంగాణ ప్రజల బాణాన్ని. ప్రజల కోసం, సమాజం కోసం నా గొంతు వినిపిస్తూనే ఉంటానని కవిత స్పష్టం చేశారు. సామాజిక తెలంగాణ నిర్మాణం కోసం అన్ని వర్గాల వారినీ కలుపుకొని ముందుకు సాగుతున్నాం. విద్య, వైద్యం వంటి కీలక అంశాలు ఇంకా జనాల మధ్య లోతుగా చేరాల్సి ఉందని కవిత తెలిపారు. సింగరేణి సంస్థను కాపాడడంలో మాజీ సీఎం కేసీఆర్ కీలక పాత్ర పోషించారని గుర్తుచేసిన ఆమె, ఆర్టీసీ విభాగంలో ఉన్న సమస్యలపై విప్లవాత్మక ఆలోచన అవసరమని సూచించారు. సామాజిక తెలంగాణను సాకారం చేయడం మనందరి బాధ్యతని అన్నారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా రావడానికి మనం అందరం కృషి చేశాం. కానీ కరీంనగర్ జిల్లాలో రోడ్ల పరిస్థితి చాలా దయనీయంగా ఉంది. కేంద్ర మంత్రి బండి సంజయ్ గారు ఈ సమస్యలపై దృష్టి పెట్టాలని వ్యాఖ్యానించారు. పంటనష్టంతో ఇబ్బంది పడుతున్న రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ హాస్టళ్లలో పిల్లలు చనిపోతే ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని, గురుకుల పాఠశాలల సమస్యలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. రాష్ట్రంలో మైనారిటీ సమస్యలను పట్టించుకోవాలి. మైనారిటీ అభివృద్ధికి కనీసం రూ.2,000 కోట్లు కేటాయించాలి. ఎన్నికలు సమీపించాకే మైనారిటీల గుర్తొచ్చాయా? అని ప్రశ్నించారు. తన రాజకీయ పరిస్థితిపై స్పందిస్తూ కవిత ఇప్పుడు నాకు ఎలాంటి బంధనాలు లేవు.. నేను ఫ్రీ బర్డ్‌ని. పర్యావరణ పరిరక్షణను మా జాగృతి ప్రాధాన్యంగా తీసుకుంటుంది. తెలంగాణలో రాజకీయ శూన్యత నెలకొంది, ప్రజల గొంతుకగా మారబోతున్నాం అని తెలిపారు. మానకొండూర్ నియోజకవర్గంలో పంటనష్టం జరిగినా, అక్కడి ఎమ్మెల్యేలు స్పందించలేదని విమర్శించారు. రాహుల్ గాంధీ ఇప్పటివరకు కార్మిక చట్టాలపై స్పందించలేదని వ్యాఖ్యానించారు. ఫిరాయింపుల ఎమ్మెల్యేలపై ప్రభుత్వం నిశ్శబ్దంగా వ్యవహరిస్తోందని కవిత పేర్కొన్నారు. తన ఎమ్మెల్సీ పదవీ రాజీనామా అంశంపై మళ్లీ చైర్మన్, స్పీకర్‌లను కలుస్తానని తెలిపారు.

3నుంచి నిరవధికంగా కాలేజీల బంద్

ఫీజు రియంబర్స్‌మెంట్‌పై యాజమాన్యాల అల్టిమేటం

హైదరాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) : ఫీజు రియంబర్స్‌మెంట్ చెల్లింపులపై ప్రభుత్వం ఆదివారం అంటే 2వతేదీలోగా నిర్ణయం తీసుకోకపోతే.. ఈ నెల 3 నుంచి ప్రైవేటు కాలేజీల నిరవధిక బంద్ పాటిస్తామని ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య ఛైర్మన్ రమేష్ బాబు తెలిపారు. హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై గత 6 నెలలుగా ప్రభుత్వంతో చర్చలు జరిపి ప్రస్తుతం రూ.1200 కోట్ల ఇవ్వాలని అడిగాం. మిగిలిన బకాయిల చెల్లింపులపై రోడ్ మ్యాప్ రూపొందించాలని కోరాం. కేవలం రూ.300 కోట్లు ఇచ్చారు.. ఇంకా రూ.900 కోట్లు దీపావళికి ఇవ్వాలని అడిగాం. నవంబరు ఒకటి నాటికి పెండింగ్ బకాయిలు మొత్తం ఇవ్వాలని కోరాం. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో పాటు అందరినీ కలిశాం. అధికారులు మా విజ్ఞప్తిని పెడచెవిన పెట్టారు. మమ్మల్ని ప్రభుత్వం బెదిరింపులకు గురి చేస్తోంది. మా మీద విజిలెన్స్ విచారణకు ఆదేశించారు. రాష్ట్రంలో ఉన్న అన్ని వృత్తి విద్యా కాలేజీలు నవంబర్ 3 నుంచి నిరవధిక బంద్ చేస్తున్నాం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి.. రేపటిలోగా మంచి నిర్ణయం తీసుకోవాలని కోరుతున్నాం. బంద్ సమయంలో పరీక్షలు వాయిదా వేయాలి. నవంబర్ 6న అన్ని కాలేజీల స్టాఫ్, సిబ్బందితో కలిసి దాదాపు లక్ష మందితో సర్వసభ్య సమావేశం నిర్వహిస్తాం. నవంబర్ 10 లేదా 11న 10 లక్షల మంది విద్యార్థులతో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేస్తాం. ఒకటి.. రెండు కాలేజీలకు ఎందుకు బకాయిలు చెల్లించారు. 10శాతం లంచం తీసుకొని ఇచ్చారా. ఆ కాలేజీలపై విచారణ జరపాలి. అత్యంత ఫ్రాడ్ జరిగే దగ్గర విచారణ జరపాలి. ఎమ్మెల్యేలు, అధికారుల ఇళ్ల ముట్టడి చేస్తాం. విద్యార్థులు, తల్లిదండ్రులకు కలిగే అసౌకర్యానికి క్షమాపణ చెబుతున్నా' అని రమేష్‌బాబు తెలిపారు.

మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్ల కేటాయింపు

- ముఖ్యమంత్రికి మంత్రి దామోదర రాజనర్సింహ కృతజ్ఞతలు

హైదరాబాద్ (జనంసాక్షి) : మెడికల్ పీజీ మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లను తెలంగాణ విద్యార్థులకు కేటాయిస్తూ చారిత్రక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ కృతజ్ఞతలు తెలిపారు. పీజీ సీట్ల కోసం ఎదురు చూస్తున్న వేలాది మంది ఎంబీబీఎస్ డాక్టర్లకు ఈ నిర్ణయం ఎంతో మేలు చేస్తుందన్నారు. ఎంబీబీఎస్ సీట్లతో పోలిస్తే, పీజీ సీట్లు తక్కువగా ఉండడం వల్ల పీజీ సీట్ల కోసం కాంపిటీషన్ ఎక్కువగా ఉందన్నారు. ఇన్నాళ్లు మేనేజ్‌మెంట్ కోటా సీట్ల భర్తీలో తెలంగాణ విద్యార్థులకు కోటా లేకపోవడంతో, ఇతర రాష్ట్రాల విద్యార్థులు వచ్చి మన దగ్గర పీజీ చేస్తున్నారని మంత్రి తెలిపారు. మన డాక్టర్ల విజ్ఞప్తి మేరకు సీట్ల భర్తీ నిబంధనల్లో మార్పులు చేశామన్నారు. ఇకపై మేనేజ్‌మెంట్ కోటాలో 85 శాతం సీట్లు, కన్వీనర్ కోటాలో వంద శాతం సీట్లు మన రాష్ట్ర విద్యార్థులకే దక్కుతాయని మంత్రి వివరించారు. దీంతో రాష్ట్రంలో స్పెషలిస్ట్ డాక్టర్ల సంఖ్య పెరుగుతుందని, తద్వారా ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు. డాక్టర్లకు, ప్రజలకు మేలు చేకూరేలా చారిత్రక నిర్ణయం తీసుకున్న సీఎం రేవంత్‌రెడ్డికి మంత్రి కృతజ్ఞతలు తెలిపారు.

దారిద్ర్యరహిత రాష్ట్రంగా కేరళ

- అత్యంత దుర్భర పేదరిక నిర్మూలన
- వివిధ కార్యాక్రమాల ద్వారా దీనిని సాధించాం
- కేరళ అవరణ దినోత్సవం సందర్భంగా సిఎం ప్రకటన
- అసెంబ్లీలో విజయన్ ప్రకటన... నిరసనగా విపక్షం వాకౌట్

తిరువనంతపురం,నవంబర్1(జనంసాక్షి) : దారిద్ర్యరహిత రాష్ట్రంగా కేరళ అవతరించినట్లు ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అసెంబ్లీలో ప్రకటించారు. దేశంలో అత్యంత దుర్భర పేదరికాన్ని నిర్మూలించిన తొలి రాష్ట్రంగా గుర్తింపు పొందిందన్నారు. కేరళ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న సీఎం ఈ విషయాన్ని వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు 21,263 మందికి మొదటిసారిగా రేషన్ కార్డులు, ఆధార్, పెన్షన్లు వంటి ముఖ్యమైన పత్రాలు మంజూరు చేసిందని తెలిపారు. 4,394 కుటుంబాలకు జీవనోపాధి ప్రాజెక్టుల ద్వారా పని కల్పించామన్నారు. ప్రజలందరికీ సమాన హక్కులు నివాసం, విద్య, వైద్యం అందుతున్నట్లు తెలిపారు. దీనివల్ల రాష్ట్రం అత్యంత దుర్భర పేదరికం నుంచి బయటపడిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. కాగా కాంగ్రెస్ నేతృత్వం లోని ప్రతిపక్షాలు పినరయి విజయన్ ప్రకటనను తప్పుబట్టాయి. ప్రభుత్వం తప్పుడు ప్రకటనలతో ప్రజలను మోసం చేస్తోందని విమర్శించాయి. ప్రతిపక్ష నేత సతీశన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చేసిన ప్రకటన భారీ మోసం అని విమర్శించారు. ప్రభుత్వ ప్రకటనను వ్యతిరేకిస్తూ ప్రతిపక్ష నేతలు సభ నుంచి వాకౌట్ చేశారు. నవంబర్ 1న కేరళ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా శనివారం శాసనసభలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయ్ విజయన్ ఓ చారిత్రాత్మక ప్రకటన చేశారు. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 300 నిబంధన కింద కేరళను తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా ఆయన అసెంబ్లీలో ప్రకటించారు. ఈ సందర్భంగా విజయన్ అసెంబ్లీలో మాట్లాడుతూ.. నవ కేరళ సృష్టిలో మరో మైలురాయిని గుర్తించే సమయంలో అసెంబ్లీ ఇప్పుడు సమావేశ మైంది. 2021లో కొత్త మంత్రిత్వశాఖ ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత తొలి మంత్రివర్గ సమావేశంలో తీసుకున్న కీలక నిర్ణయాల్లో తీవ్ర పేదరికన నిర్మూలన ఒకటి. శాసనసభ ఎన్నికల సమయంలో.. ప్రజలకు ఇచ్చిన అతి ముఖ్యమైన వాగ్దానాలలో ఒకదాన్ని నెరవేర్చడానికి ఇది నాంది కూడా. స్థానిక స్వపరిపాలన శాఖ నాయకత్వంలో, కేరళ ఇన్స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ సమన్వయంతో కేవలం రెండు నెలల్లో తీవ్ర పేదరికంలో నివశిస్తున్న కుటుంబాలను గుర్తించే పక్రియను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. మొదటగా వడక్కంచెరి మునిసిపాలిటి, అంచుతెంగు, తిరునెల్లి గ్రామ పంచయతీలలో దీన్ని పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభించాం. ఆ తరువాత రాష్ట్రం మొత్తానికి విస్తరించాం. సమాజంలో అన్ని వర్గాల నుండి తీసుకున్న సమిష్టి అభిప్రాయాలు, సూచనల ద్వారా లబ్దిదారుల కుటుంబాలను గుర్తించి చారిత్రాత్మక ప్రాజెక్టును ప్రారంభించాం అని విజయన్ అసెంబ్లీలో అన్నారు. అయితే తీవ్ర పేదరిక రహిత రాష్ట్రంగా కేరళను సిఎం ప్రకటించడంపై ప్రతిపక్షాలు విమర్శించాయి. ఆ రాష్ట్రంలోని కాంగ్రెస్ నేతలు ఇది మోసం అని మండిపడ్డారు. ప్రతిపక్ష సభ్యుల ఆరోపణలపై సిఎం విజయన్ స్పందించారు. ప్రతిపక్షనేత వ్యాఖ్యలు అప్రస్తుతమని విజయన్ తోసిపుచ్చారు. దీనిపై ప్రతిపక్షాలు ఎందుకు భయపడుతున్నాయో అర్థంకావడం లేదని అన్నారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం నాడు.. చారిత్రాత్మక ప్రకటన చేసిన రోజున.. నేడు ప్రతిపక్షాలు అసెంబ్లీని బహిష్కరించడాన్ని పార్లమెంటు వ్యవహారాల మంత్రి ఎం.బి రాజేష్ విమర్శించారు. ఇది చరిత్రలో నిలిచిపోతుంది. చరిత్ర ప్రతిపక్షాన్ని దోషులుగా ప్రకటిస్తుంది అని అన్నారు.

ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు

- ముంబైకి దారిమళ్లించిన పైలట్

హైదరాబాద్, నవంబర్ 1 (జనంసాక్షి) : ఇండిగో విమానాలకు తరచుగా బాంబు బెదిరింపులు రావడం తీవ్ర కలకలం రేపుతోంది. ఇటీవల కాలంలో ఇండిగో విమానంలో బాంబులు ఉన్నట్లు బెదిరింపు మెయిల్స్ రావడం.. ఆ తరువాత అదంతా ఫేక్ అని తేలడం జరుగుతూనే ఉంది. తాజాగా మరోసారి ఇండిగో విమానంలో బాంబు ఉన్నట్లుగా వచ్చిన మెయిల్ ఆందోళన కలిగిస్తోంది. శనివారం జెద్దా నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు వస్తున్న ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు మెయిల్ వచ్చింది. దీంతో సెక్యూరిటీ అధికారులు వెంటనే అప్రమత్తమయ్యారు. శంషాబాద్ విమానాశ్రయానికి రావాల్సిన విమానాన్ని ముంబాయి ఎయిర్ పోర్ట్‌కు దారి మళ్లించారు. బాంబు బెదిరింపు మెయిల్‌పై పోలీసులకు సెక్యూరిటీ అధికారులు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గత నెలలో కూడా ఇండిగో విమానానికి బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలిసిందే. దుబాయ్ నుంచి మంగళూరు బయలుదేరిన ఇండిగో విమానం బాత్రూంలో బాంబు బెదిరింపు ఉన్న సందేశాలను ప్రయాణికులు గుర్తించి.. సిబ్బందికి తెలియజేశారు. వెంటనే అలర్ట్ అయిన విమానాశ్రయ సిబ్బంది.. విమానం మొత్తాన్ని క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే ఎలాంటి పేలుడు పదార్థాలు లేవని.. అందంతా ఫేక్ అని నిర్ధారణ కావడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. కాగా.. ఇండిగో విమానాలకు పదే పదే ఇలాంటి బెదిరింపులు రావడంపై అధికారులు సీరియస్‌గా తీసుకోవాల్సిన అవసరం ఉందని ప్రయాణికులు భావిస్తున్నారు. ఫేక్ ప్రచారం చేస్తున్న ఆకతాయిలను వెంటనే గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. తరచూ ఇలాంటి సందేశాలతో భయాందోళనకు గురవుతున్నట్లు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శబరిమల ఆలయ మాజీ ఇవో అరెస్టు

తిరువనంతపురం, నవంబర్ 1 (జనంసాక్షి) : శబరిమల అయ్యప్ప స్వామి ఆలయంలో బంగారం తాపడం పేరుతో జరిగిన మోసం కేసులో అధికారులు మాజీ ఎగ్జిక్యూ టివ్ ఆఫీసర్ సుధీశ్ కుమార్‌ను శనివారం అరెస్టు చేశారు. 2019లో శబరిమల ఈవోగా సుధీశ్ బాధ్యతలు నిర్వర్తించారు. తిరువనంతపురంలో క్రైం బ్రాంచ్ పోలీసులు దర్యాప్తు చేపట్టి అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అయ్యప్ప స్వామి వద్ద ఉన్న ద్వారపాలకుల విగ్రహాల సమాచారాన్ని దాచిపెట్టినట్లు అతనిపై ఆరోపణలు ఉన్నాయి. బంగారు తాపడం ఉన్న ద్వారపాలకుల విగ్రహాలను.. కాపర్ షీట్లుగా దొంగ డాక్యుమెంట్లు సృష్టించినట్లు మాజీ ఈవోపై ఆరోపణలు ఉన్నాయి. ద్వారపాలకుల విగ్రహాల తాపడం కోసం వాటిని ఈ కేసులో ప్రధాన నిందితుడైన ఉన్నికృష్ణన్ పొట్టికి అందజేశారు. వాస్తవానికి ఆ విగ్రహాలకు 1998లో గోల్డ్ ప్లేటింగ్ జరిగింది. అయితే మళ్లీ 2019లో ఆ విగ్రహాలను ఈవోగా ఉన్న సుధీశ్ వాటిని ఉన్నికృష్ణన్‌కు అందజేశారు. ఆ విగ్రహాలను రాగితో ప్లేటింగ్ చేసి ఉన్నట్లు చూపించి, వాటిని ఉన్న బంగారాన్ని మాజీ ఈవో తీసుకెళ్లినట్లు ఈ కేసులో ఆరోపణలు వచ్చాయి. శబరిమల మాజీ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బీ మురారి బాబును కూడా ఈ కేసులో అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మాజీ ఈవో కుమార్‌ను జుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ముందు హాజరుపరచనున్నారు.

తప్పుడు లెక్కలతో ధాన్యం డబ్బులు కాజేసిన కేసులో అరెస్టు

జైపూర్ నవంబర్ 1 (జనంసాక్షి) : మంచిర్యాల జిల్లా జైపూర్ మండలం లోని నర్సింగాపూర్ –మద్దులపల్లి పాడి ప్రొక్యూర్మెంట్ సెంటర్ లో తప్పుడు లెక్కలతో వరి ధాన్యాన్ని చూపించి సివిల్ సప్లై ఫండ్స్ ఒక కోటి ముప్పైతొమ్మిది లక్షల డబ్బులు కాజేసిన కేసులో మూడవ నిందితుడు అయిన తాటిపల్లి సాయి కుమార్ అరెస్టు చేసినట్లు శ్రీరాంపూర్ సీఐ ఒక ప్రకటనలు తెలిపారు.

శనివారం నాడు జైపూర్ మండలం నర్సింగాపూర్ లో తాటిపల్లి సాయిని ఇంటివద్ద అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఇట్టి కేసులో మిగతా ముద్దాయిలు 12 మంది పరారీలో ఉన్నారని, వారిని పట్టుకోవడం కోసం జైపూర్ ఎస్.ఐ ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలని పంపించామని శ్రీరాంపూర్ సీఐ తెలిపారు

దేశ బలోపేతానికి యువతదే బాధ్యత

- వేమన వర్సిటీ విద్యార్థులతో వెంకయ్యనాయుడు

కడప, నవంబర్ 1 (జనంసాక్షి) : నేటి యువత దేశాభివృద్ధికి కార్యోన్ముఖులు కావాలని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు వ్యాఖ్యానించారు. కడప జిల్లాలోని యోగివేమన విశ్వవిద్యాలయం విద్యార్థులతో ఆయన కాసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..యూనివర్సిటీ విద్యార్థులతో ముచ్చటించడం చాలా సంతోషంగా ఉందని చెప్పారు. దేశం బలోపేతం కావాలంటే, యువత తమలో ఉన్న శక్తి సామర్థ్యాలను గుర్తించి, వాటిని సద్వినియోగం చేసుకోవడం అత్యవసరమని చెప్పారు. మన మహనీయులు, ముఖ్యంగా నవభారత నిర్మాత సర్దార్ పటేల్ వంటి వారిని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. యువత తమ వ్యక్తిత్వాన్ని మెరుగ్గా తీర్చిదిద్దుకోవడానికి, యోగి వేమన బోధనలు మార్గదర్శకాలని పేర్కొన్నారు. సరళమైన పదాలతో పద్యాల ద్వారా ఆయన బోధించిన జీవిత సత్యాలను ఆకళింపు చేసుకుంటే ఉన్నతమైన వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుందని దిశానిర్దేశర చేశారు. యువత మాతృభాష, భారతీయ సంస్కృతికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370